www.akshratimes.com

తెలుగు దినపత్రిక

# అక్షర టైమ్స్

మా అక్షరం ప్రజల పక్షం

RNI.NO : APTEL/2022/90211

సంపుటి : 04 సంచిక : 005 పేజీలు : 08, వెల రూ. 1 రూ/ www.akshratimes.com ఆదివారం 19 - 04 - 2026

Published by ANANTAPURAM : Circulated in Anantapuram, Satya Sai, Vijayavada, Ysr Kadapa, Annamayya, Prakasham, Bapatla,Ntr, Karimnagar,Gunturu,East Godavari, West Godavari, Kakinada, Eluru, Sri Potti Sriramulu Nellore, Kurnool



‘డిజిటల్ అరెస్ట్‘ పేరుతో రూ.1.6 కోట్ల భారీ మోసం

ఏపీ, తెలంగాణలో డిజిటల్ అరెస్ట్ స్కాం గుట్టురట్టు చేసిన సీబీఐ



2 లో

## దత్తపుత్రుడు జగన్ గారి తెర తొలగింది

- ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల
- సవరణ బిల్లును అడ్డుకుని ఏం సాధించారంటూ కాంగ్రెస్ సహా విపక్షాలను ప్రశ్నించిన జగన్
- జగన్ పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తిన ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిల
- కేసుల నుంచి రక్షణ పొందేందుకే కేంద్రానికి జగన్ దాసోహమన్నారని వ్యాఖ్యలు
- వైఎస్ఆర్ ఆశయాలకు జగన్ తూట్లు పొడిచారని తీవ్ర విమర్శ

# మహిళా రిజర్వేషన్ల సవరణ బిల్లును ఓడించడం దుర్మార్గం

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు
- ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల నిరసన ర్యాలీలో పాల్గొన్న సీఎం
- మహిళలకు ద్రోహం చేయడం జాతి విద్రోహమేనన్న చంద్రబాబు
- పోరాడి సాధించుకునే సమయంలో అడ్డుకోవడం క్షమించరాని నేరమని వెల్లడి
- మహిళల రిజర్వేషన్ల కోసం మూడు దశాబ్దాలుగా పోరాడుతున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు గుర్తు చేశారు
- విపక్షాల ద్రోహాన్ని ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలన్నారు సీఎం చంద్రబాబు





**అమరావతి :**

కాంగ్రెస్, మిత్రపక్షాలు మహిళా బిల్లును అడ్డుకున్నాయని సీఎం చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలులోని ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు మహిళల రిజర్వేషన్ బిల్లు వీగిపోవడంపై నిరసన ర్యాలీని చేపట్టాయి. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. ఈ నిరసన ప్రదర్శన కార్యక్రమంలో మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకోవడమనేది ద్రోహమంటూ ప్లకార్డులతో నిరసన చేపట్టారు.మహిళలకు ద్రోహం చేయడం జాతి విద్రోహంతో సమానమని సీఎం చంద్రబాబు అన్నారు. మహిళలను గౌరవించి అన్ని రంగాల్లో ఆదరించడం సంస్కృతి అని తెలిపారు. సంస్కృతి, సంప్రదాయాలకు భిన్నంగా ద్రోహం చేశారని ఎద్దేవా చేశారు. ఇది ప్రారంభం మాత్రమేనని, మహిళా లోకమంతా ఏకమైందని వివరించారు. పోరాడి సాధించుకునే సమయంలో అడ్డుకోవడం క్షమించరాని నేరమన్నారు. అదేవిధంగా మహిళలు ఆత్మగౌరవంతో బతకాలనే నినాదంతో ముందుకెళ్లాలని సీఎం సూచించారు.బిల్లును అడ్డుకోవడం క్షమించరాని నేరం: చిన్న రాష్ట్రాలకు నష్టం జరుగుతుందని విపక్షాలు ఆరోపించాయని సీఎం చంద్రబాబు తెలిపారు. దక్షిణాది, ఈశాన్య, చిన్న - మిగతా 2 లో

# రూ. 16 కోట్ల ఇంజెక్షన్‌తో పునర్జన్మ



2 లో

- చిన్నారి పునర్విక ప్రాణాలు కాపాడిన మంత్రి నారా లోకేష్
- అరుదైన వ్యాధితో బాధపడుతున్న చిన్నారి పునర్విక
- రూ.16 కోట్ల విలువైన ఇంజెక్షన్ ఒక్కటే మార్గం
- ప్రజల సాయంతో రూ.10 కోట్లు, మిగిలిన మొత్తానికి లోకేష్ హామీ
- ఇంజెక్షన్‌ను విదేశాల నుంచి తెప్పించిన మంత్రి
- లోకేష్ సమక్షంలో చిన్నారికి జీన్ థెరపీ ఇంజెక్షన్ ఇచ్చిన వైద్యులు
- ప్రాణం నిలిపిన లోకేష్‌కు, దాతలకు కన్నీళ్లతో కృతజ్ఞతలు తెలిపిన తల్లిదండ్రులు

# విపక్షాలు భారీ మూల్యం చెల్లించుకుంటాయ్

- జీవితాంతం ఆ విషయంలో చింతిస్తాయ్
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- విపక్షాలు జీవితాంతం పశ్చాత్తాపపడతాయని ప్రధాని మోదీ వ్యాఖ్యలు
- మహిళల హక్కులను అడ్డుకున్నారని కిరణ్ రిజిజు ఆరోపణలు



**ఢిల్లీ :**

పార్లమెంటులో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు తీసుకొచ్చిన కీలక రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందకపోవడంపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విపక్షాల వైఖరి దేశ మహిళలకు అన్యాయం చేసిందని, ఈ విషయంలో వారు జీవితాంతం చింతించాల్సి వస్తుందని మండిపడ్డారు. కేంద్ర కేబినెట్ సమావేశంలో ఈ అంశంపై మోదీ స్పష్టంగా స్పందించినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.శనివారం జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశానికి అధ్యక్షత వహించిన మోదీ, మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకోవడం ద్వారా విపక్షాలు తమ అసలు స్వరూపాన్ని బయటపెట్టాయని అన్నారు. దేశంలోని ప్రతి గ్రామానికి ఈ విషయాన్ని తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. మహిళల ఆశలను తుంగలో తొక్కినట్లయిందని, ఈ నిర్ణయం రాజకీయంగా కూడా విపక్షాలకు భారీ మూల్యం చెల్లింపజేస్తుందని హెచ్చరించారు.

**బిల్లును అడ్డుకోవడం ఘోర పాపం: రిజిజు**

ఇదే విషయంపై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు కూడా తీవ్రంగా స్పందించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకోవడం ఘోర పాపమని ఆయన విమర్శించారు. మహిళలకు హక్కులు కల్పించే చట్టాన్ని అడ్డుకోవడం దుర్మార్గమని, దానిపై సంబరాలు చేసుకోవడం మరింత దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. బిల్లును అడ్డుకున్న విపక్ష నేతలు మహిళా వ్యతిరేకులుగా నిలిచిపోయారని అన్నారు.లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఈ బిల్లును ఎలా అప్రజాస్వామికమని చెబుతున్నారో ప్రజలకు సమాధానం - మిగతా 2 లో

## హర్మూజ్ మళ్లీ మూసివేత



2 లో

- ఇరాన్ సంచలన నిర్ణయం
- హర్మూజ్ జలసంధిపై మళ్లీ కఠిన నియంత్రణ విధించిన ఇరాన్
- ప్రపంచ ఆయిల్ సరఫరాపై ప్రభావం చూపే అవకాశం

## హర్మూజ్ జలసంధిలో ఇరాన్ సైన్యం కాల్పులు

- వెనక్కి మళ్లిన రెండు భారత నౌకలు
- హర్మూజ్ జలసంధిలో నౌకలపై ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ కాల్పులు
- జలసంధిపై తిరిగి నియంత్రణ సాధించామని ఇరాన్ ప్రకటన
- అమెరికా దిగ్బంధనానికి ప్రతిచర్యగా ఈ చర్యలు తీసుకున్నట్లు వెల్లడి



2 లో

# తెలంగాణలో మండుతున్న ఎండలు

- కొమురంభీమ్ జిల్లాలో 44.6 డిగ్రీల ఉష్ణోగ్రత
- ఉదయం నుంచే బయటకు రాలేని పరిస్థితులు
- నిజామాబాద్ జిల్లాలో 44.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని వాతావరణ శాఖ సూచన



**హైదరాబాద్ :**

తెలంగాణ రాష్ట్రంలో భానుడి భగభగతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం తొమ్మిది గంటల నుంచే బయటకు రాలేని పరిస్థితులు నెలకొన్నాయి. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటాయి. - మిగతా 2 లో



2 లో

## దక్షిణాదికి విపక్షాల చారిత్రక ద్రోహం

- రక్షణ కవచం లాంటి బిల్లును చంపేశారు: బండి సంజయ్
- దక్షిణాది ప్రయోజనాలను కాపాడే బిల్లును విపక్షాలు అడ్డుకున్నాయన్న బండి సంజయ్
- దక్షిణాది గౌరవం పేరుతో గ్రామాలు ఆడుతున్నారని విమర్శ
- రాజకీయ స్వార్థం కోసం చారిత్రక సంస్కరణను అడ్డుకున్నారని మండిపాటు

## రైతు భరోసా నిధులపై తెలంగాణ ప్రభుత్వం శుభవార్త



- భూపాలపల్లి జిల్లాలో విడుదల చేయనున్న సీఎం రేవంత్ రెడ్డి
- రెండో విడతలో 45,11,947 మంది రైతులకు రూ.5,653 కోట్ల నిధులు విడుదల
- మార్చి 22న తొలి విడత నిధులు సిద్దిపేట జిల్లాలో విడుదల చేసిన సీఎం

**హైదరాబాద్ :**

రైతులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రెండో విడత రైతు భరోసా నిధులను ప్రభుత్వం త్వరలో విడుదల చేయనుంది. ఈ నెల 20వ తేదీన భూపాలపల్లి జిల్లా కాటారం బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నిధులను విడుదల చేయనున్నారు.రెండో విడతలో 45,11,947 మంది రైతులకు రూ.5,653 కోట్ల నిధులను వారి వారి ఖాతాల్లో జమ చేయనున్నారు. మార్చి 22వ తేదీన సిద్దిపేట జిల్లా - మిగతా 2 లో

# తెలంగాణలో మరోసారి మోగనున్న ఎన్నికల నగారా

- తెలంగాణలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు ఈసీ కసరత్తు
- జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు ఎస్ఈసీ సన్నాహాలు
- ఓటర్ల జాబితా తయారీకి రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ
- మే నెలలోనే పోలింగ్ నిర్వహించేందుకు వేగంగా కసరత్తు
- అదనపు ఓటర్ల వివరాలను మండలాల వారీగా గుర్తించి పోలింగ్ కేంద్రాల వారీగా జమ చేయాలని ఆదేశం
- ఈ జాబితాలను పోలింగ్ కేంద్రాలకు అనుసంధానించాలని ఉత్తర్వులు
- బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు గ్రీన్ సిగ్నల్‌తో ముందుకు సాగుతున్న ప్రక్రియ



**హైదరాబాద్ :**

తెలంగాణ రాష్ట్రంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి రంగం సిద్ధమైంది. ఈ నేపథ్యంలోనే ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని ఎస్ఈసీ (రాష్ట్ర ఎన్నికల సంఘం) ఉత్తర్వులు జారీ చేసింది. అన్నీ అనుకూలించినట్లయితే మే నెలలోనే ఎన్నికలు జరిగే అవకాశాలున్నాయి. 10.07.2025 నుంచి 05.02.2026 వరకు కేంద్ర ఎన్నికల సంఘం నవీకరించిన జాబితాలో నియోజకవర్గాల్లోని అదనపు ఓటర్ల వివరాలను మండలాల వారీగా గుర్తించి, వాటిని సంబంధిత పంచాయతీ, పోలింగ్ కేంద్రాల వారీగా ఉన్న జాబితాలకు జత చేయాలని హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి మినహా అన్ని జిల్లాల కలెక్టర్లను ఎస్ఈసీ ఆదేశాలు జారీ చేసింది.వీటి ఆధారంగా ఎంపీటీసీ, జడ్పీటీసీల పరిధిలోని గ్రామ పంచాయతీలు, పోలింగ్ స్టేషన్ల వారీగా కొత్త జాబితాలను రూపొందించాలని తాజాగా ఉత్తర్వులను జారీ చేసింది. ఈ జాబితాలను జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) ధ్రువీకరణ అనంతరం, సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ) యూజర్ మాన్యువల్ సూచనల ప్రకారం పోలింగ్ సెంటర్లకు అనుసంధానించాలని పేర్కొంది. ఆ డేటాలో ఏవైనా తేడాలున్నట్లు గమనిస్తే, వాటిని ఈ నెల - మిగతా 2 లో

# సంపాదకీయం

## చమురు విపత్తు

రష్యా, ఇరాన్‌ల నుంచి ముడిచమురు దిగుమతికి ఇచ్చిన ఆ వెసులుబాటును ఇకపై కొనసాగించేది లేదని అమెరికా ప్రకటించింది. తాను విధించిన ఆంక్షలమీద తానే ఇచ్చిన మినహాయింపులను మళ్ళీ తానే రద్దుచేయబోతోంది. అమెరికా నిర్ణయం మిగతా దేశాలతో పాటు, ప్రధానంగా దిగుమతుల మీదే ఆధారపడిన భారత్‌పై తీవ్ర ప్రభావం చూపడం ఖాయం. యుద్ధంతో తాను సృష్టించిన సంక్షోభాన్ని పరిష్కరించాల్సిన అమెరికా ఇలా కొత్త విపత్తుకు తెరదీస్తోంది. గత నెలలో ట్రంప్ మినహాయింపులు ఇచ్చినందుకు ఎగిరిగంతేసి, రష్యా నుంచి భారీ చమురు దిగుమతులతో ఈ యుద్ధకాలాన్ని జాగ్రత్తగా నెట్టుకొచ్చిన మనకు పరిస్థితి మళ్ళీ మొదటికొచ్చింది. ఇంధన ధరలను, ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచగలిగిన మనకు ఇకపై డిమాండ్‌కు తగినంత సరఫరాలు లేకపోతే ఆ ప్రభావం నిత్యావసరాల మీద తీవ్రంగా ఉంటుంది. ఉక్రెయిన్‌పై యుద్ధానికి ఆజ్యం పోస్తున్నారంటూ రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకోకుండా భారత్‌ను బెదిరించిన అమెరికా అధ్యక్షుడు, తాను ఆరంభించిన మరో యుద్ధం కారణంగా తాత్కాలిక వెసులుబాటు ఇచ్చి, ఇప్పుడు మళ్ళీ తలుపులు మూసేస్తున్నారు. ఇరాన్ మీద మరింత ఒత్తిడిపెంచడం ఈ నిర్ణయానికి కారణం కావచ్చును కానీ, ఆంక్షల మినహాయింపు నుంచి భారతదేశం బాగానే లబ్ధిపొందింది. భారత రిఫైనరీలు ముప్పై మిలియన్ బ్యారెళ్ళ చమురు దిగుమతి చేసుకున్నాయి. దాదాపు ఏడేళ్ళ తరువాత ఇరాన్ నుంచి ముడిచమురుతో భారీ ట్యాంకర్లు భారత ఓడరేవులకు చేరుకున్న దృశ్యాలు కూడా చూశాం. 2019 మే నెలలో ఆంక్షలు కఠినతరం కాకముందు భారత్ మొత్తం చమురు దిగుమతుల్లో ఇరాన్ వాటా దాదాపు పన్నెండుశాతం. అమెరికాఇరాన్ మలి విడత చర్చలకు మార్గం సుగమం చేయడానికి టెహ్రాన్‌లో మళ్ళీ కాలూనిన పాకిస్థాన్ ఫీల్డ్‌మార్షల్ ఏమి ఉద్ధరిస్తారో తెలియదు కానీ, అమెరికా నిర్ణయం భారత్ ఆర్థికవ్యవస్థ మీద తీవ్ర ప్రభావం చూపబోతోంది. తొలివిడత చర్చలు విఫలం కావడంతో ఇరాన్ ఓడరేవులను దిగ్బంధించాలన్న ట్రంప్ ప్రయత్నం మళ్ళీ ఉద్రిక్తతలను పెంచడమే కాక, పరస్పరాధారిత ప్రపంచ ఆర్థికవ్యవస్థకు అనేక సమస్యలు తెచ్చింది. చైనా హెచ్చరికలతో ఘర్షణ విస్తరిస్తుందన్న అనుమానాలు, భయాలూ మరోపక్క ఉండనే ఉన్నాయి. అమెరికా శక్తిసామర్థ్యాలనీ, ఓర్పునీ ఎంతకాలమైనా పరీక్షించగలిగే శక్తియుక్తులు, ఆత్మస్థైర్యం ఇరాన్‌కు ఉండవచ్చునేమో కానీ, యుద్ధం ముగిసేంతవరకూ ఇంధనం కొరతను తట్టుకొని నిలబడగలిగే శక్తి మిగతాదేశాలకు ఉండదు. నలభైనిముషాల పాటు డోనాల్డ్ ట్రంప్‌తో టెలిఫోన్‌లో మాట్లాడి, ఆయనను మంచి మిత్రుడుగా అభివర్ణించి, నూటనలభైకోట్లమంది భారతీయుల పక్షాన ఆయనకు నరేంద్రమోదీ ప్రేమసందేశం పంపిన వెంటనే, అమెరికా అధ్యక్షుడు భారతదేశాన్ని మళ్ళీ ఇంధన సంక్షోభంలోకి నెట్టివేసే నిర్ణయం తీసుకున్నారు. మనదేశానికి చమురు మోసుకొస్తున్న నలభై ట్యాంకర్లు ఇంకా హోర్ముజ్‌లో చిక్కుబడివున్న సంగతి తెలిసిందే.ఇరాన్‌ను సులువుగా లొంగదీయగలననుకొని యుద్ధరంగంలోకి దిగిన ట్రంప్‌కు, అది ఆయుధాలకు లొంగకుండా, జలసంధిని గుప్పిట్లో పెట్టుకుంటూ యుద్ధం ప్రభావాలను ప్రపంచమంతటికీ చుట్టేయడంతో ఏమీ పాలుపోలేదు. దీనితో పాతశత్రువు రష్యా నుంచీ, తాను యుద్ధం చేస్తున్న ఇరాన్ నుంచీ మళ్ళీ చమురు దిగుమతులు చేసుకోనిచ్చాడు. అమెరికా హెచ్చరికలు, అదనపు సుంకాల దెబ్బతో గత ఏడాది నవంబరులో ఆగిపోయిన రష్యా ముడిచమురు దిగుమతులు మళ్ళీ మార్చిలో మొదలై, ఒక్కనెలలోనే రెట్టింపు జరిగాయి. రాబోయే కాలంలో మనం ఎంత భారీ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకున్నా కూడా, లోటు తీవ్రంగా ఎదుర్కోబోతున్నామని దీని అర్థం. రిజర్వుబ్యాంకు ప్రమాణాల రీత్యా ద్రవ్యోల్బణం ప్రమాదస్థాయిలో లేకున్నా, మార్చినాటికి అది ఏడాది గరిష్ఠస్థాయిని చేరింది. రవాణా, కూరగాయలు, ఆహారోత్పత్తుల ధరల వేడి సామాన్యుడిని ఇప్పటికే తాకింది. ప్రభుత్వం ఎన్ని చెప్పినా జనం గ్యాస్ కొరతను ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వరంగ సంస్థలు విక్రయించే చమురుమీద లక్షన్నర కోట్ల ఎక్సైజ్ సుంకాన్ని వదులుకోవడం ద్వారా బంకుల దగ్గర ధరలు భగ్గుమనకుండా మోదీ ప్రభుత్వం జాగ్రత్తపడింది. అయితే, ఇదంతా అసెంబ్లీ ఎన్నికల మహత్యమే కనుక, ఏప్రిల్ 29న పోలింగ్ ముగిసిన వెంటనే గతంలో మాదిరిగా జనానికి వాతలు తప్పవు. దీనికి తోడు ట్రంప్ మహాశయుడి సరికొత్త నిర్ణయం పర్యవసానాలను ఊహించడానికే భయంగా ఉంది.

## విపక్షాలు భారీ మూల్యం చెల్లించుకుంటాయ్

**మొదటిపేజీ తరువాయి -** చెప్పాలని రిజిజు డిమాండ్ చేశారు. కేంద్రానికి మహిళా రిజర్వేషన్ అమలు చేయాలనే స్పష్టమైన సంకల్పం ఉన్నప్పటికీ, విపక్షాలు అడ్డంకులు సృష్టించాయని ఆరోపించారు. డీలిమిటేషన్ అంశాన్ని సాకుగా చూపిస్తూ బిల్లును అడ్డుకోవడం సరైన విధానం కాదని అన్నారు.మహిళా రిజర్వేషన్ బిల్లుకు సంబంధించిన ఓటింగ్ లోక్‌సభలో తీవ్ర ఉద్రిక్తతల మధ్య జరిగింది. మొత్తం 528 మంది సభ్యులు ఓటింగ్‌లో పాల్గొన్నారు. అందులో 298 మంది బిల్లుకు అనుకూలంగా ఓటు వేయగా, 230 మంది వ్యతిరేకంగా ఓటు వేశారు. అయితే రాజ్యాంగ సవరణ బిల్లుకు అవసరమైన రెండు మూడవ వంతు మెజారిటీ (352 ఓట్లు) రాకపోవడంతో బిల్లు తిరస్కరణకు గురైంది. బిల్లు ద్వారా లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలనే లక్ష్యంతో పాటు, డీలిమిటేషన్ ప్రక్రియ అనంతరం స్థానాల సంఖ్యను పెంచే ప్రతిపాదన కూడా ఉంది. 2029 ఎన్నికల నాటికి ఈ రిజర్వేషన్ అమల్లోకి తీసుకురావాలని కేంద్రం భావించింది. అయితే విపక్షాలు ఈ విధానంపై అనేక అభ్యంతరాలు వ్యక్తం చేశాయి.ప్రధానంగా, డీలిమిటేషన్ తర్వాత దక్షిణ రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గే అవకాశం ఉందని విపక్షాలు ఆందోళన వ్యక్తం చేశాయి. అలాగే, కేంద్రం రాజకీయ లాభం కోసం ఈ బిల్లును ఉపయోగించుకుంటోందని కూడా ఆరోపించాయి. మహిళా రిజర్వేషన్‌కు తమ మద్దతు ఉన్నప్పటికీ, అమలు విధానం పట్ల అభ్యంతరాలు ఉన్నాయని విపక్షాలు స్పష్టం చేశాయి. ఇక కేంద్రం మాత్రం ఈ ఆరోపణలను ఖండించింది. మహిళల సాధికారత కోసం తీసుకొచ్చిన చట్టాన్ని అడ్డుకోవడం ద్వారా విపక్షాలు తమ నిజ స్వరూపాన్ని చూపించాయని పేర్కొంది. మహిళల ఆగ్రహాన్ని వారు తప్పక ఎదుర్కోవాల్సి వస్తుందని కిరణ్ రిజిజు హెచ్చరించారు. ఈ పరిణామం దేశ రాజకీయాల్లో పెద్ద చర్చకు దారితీసింది. మహిళా రిజర్వేషన్ అంశం మరోసారి జాతీయ రాజకీయాల్లో ప్రధాన అజెండాగా మారింది. ముందున్న రోజుల్లో ఈ అంశంపై కేంద్రం, విపక్షాల మధ్య మరింత రాజకీయ పోరు కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## రైతు భరోసా నిధులపై తెలంగాణ ప్రభుత్వం శుభవార్త

**మొదటిపేజీ తరువాయి -** నర్మెటలో జరిగిన బహిరంగ సభలో తొలి విడతగా 1.50 కోట్ల ఎకరాలకు రూ.3,590 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశారు. ఈ క్రమంలో, రైతులు రెండో విడత రైతు భరోసా నిధుల కోసం ఎదురుచూస్తున్నారు.

## దక్షిణాదికి విపక్షాల చారిత్రక ద్రోహం

**మొదటిపేజీ తరువాయి -** నియోజకవర్గాల పునర్విభజన నేపథ్యంలో దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలను కాపాడేందుకు కేంద్రం ప్రతిపాదించిన రాజ్యాంగ సవరణ బిల్లును విపక్షాలు అడ్డుకోవడాన్ని కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్రంగా తప్పుబట్టారు. ఎక్స్ వేదికగా ఆయన స్పందిస్తూ... కాంగ్రెస్, ఇండియా కూటమిపై నిప్పులు చెరిగారు. బయట 'దక్షిణాది గౌరవం' అంటూ డ్రామాలు ఆడే విపక్షాలు, పార్లమెంటులో మాత్రం ఆ ప్రాంత గొంతు నొక్కేలా వ్యవహరించడం వారి ద్వంద్వ నీతికి నిదర్శనమని సంజయ్ మండిపడ్డారు.2026 తర్వాత జరగబోయే పునర్విభజన వల్ల జనాభా నియంత్రణ పాటించిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలు రాజకీయ ప్రాధాన్యత కోల్పోయే ప్రమాదం ఉందని, దానిని అడ్డుకునేందుకే ప్రధాని మోదీ ఈ 'రక్షణ కవచం' లాంటి బిల్లును తెచ్చారని బండి సంజయ్ వివరించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా దక్షిణాది సీట్లను 50 శాతం పెంచేందుకు సిద్ధమని స్పష్టమైన హామీ ఇచ్చినా విపక్షాలు స్పందించకపోవడం దారుణమన్నారు. కేవలం రాజకీయ స్వార్థం కోసమే ఈ చారిత్రక సంస్కరణను అడ్డుకుని, దక్షిణాది ప్రజలకు కాంగ్రెస్ తీరని అన్యాయం చేసిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో జరగబోయే సీట్ల కోతకు విపక్షాలే బాధ్యత వహించాలని, ఈ ద్రోహాన్ని ప్రజలు క్షమించరని ఆయన హెచ్చరించారు.

## తెలంగాణలో మండుతున్న ఎండలు

**మొదటిపేజీ తరువాయి -** కొమురంభీమ్ జిల్లాలోని కెరమెరిలో అత్యధికంగా 44.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. నిజామాబాద్ జిల్లాలోని మెండోరాలో 44.5 డిగ్రీలు, జగిత్యాల జిల్లా ఎండపల్లిలో 44.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.తెలంగాణలోని అన్ని ప్రాంతాల్లో గత సంవత్సరం ఇదే రోజుతో పోలిస్తే ఉష్ణోగ్రతలు మూడు నుంచి నాలుగు డిగ్రీలకు పైగా పెరిగాయి. గత సంవత్సరం ఇదే రోజున అత్యధిక ఉష్ణోగ్రత 43.4 డిగ్రీలు కాగా, ఈ సంవత్సరం నేడు 44.6 డిగ్రీలుగా నమోదైంది. రోజురోజుకు ఎండలు పెరుగుతున్నందున చిన్నారులు, వృద్ధులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ సూచించింది. అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని కోరింది.



## మహిళా రిజర్వేషన్ల సవరణ బిల్లును ఓడించడం దుర్మార్గం

**మొదటిపేజీ తరువాయి -** రాష్ట్రాలకు అన్యాయం జరగదని కేంద్రం స్పష్టత ఇచ్చిందన్నారు. మహిళల రిజర్వేషన్ల కోసం మూడు దశాబ్దాలుగా పోరాడుతున్నామని గుర్తు చేశారు. పోరాడి సాధించుకునే సమయంలో అడ్డుకోవడం క్షమించరాని నేరమని ఆగ్రహం వ్యక్తం చేశారు. విపక్ష పార్టీలు ఎన్నికల్లో ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతాయని విమర్శించారు. ఆడబిడ్డలను కేవలం ఇంటి వరకే పరిమితం చేయాలని దుర్మార్గ ఆలోచన తగదని సీఎం హితవు పలికారు.నిన్న విద్రోహ దినం, విపక్షాల ద్రోహాన్ని ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలన్నారు. మహిళా సాధికారత కోసం అడ్డంకులు సృష్టించకూడదనే కర్తవ్యం విపక్షాలపై ఉందనిపేర్కొన్నారు. 2017లో అసెంబ్లీలో తీర్మానం చేసి పంపామని, 2029 నాటికి మహిళలకు రిజర్వేషన్ల అమలు యోచనతో కేంద్రం సహృదయంతో ముందుకొచ్చిందని తెలిపారు. ఇంట్లో ఆడబిడ్డలు పైకి వస్తే చూడలేని




పరిస్థితి ఉందని సీఎం బాధపడ్డారు.మహిళా రిజర్వేషన్ల సవరణ బిల్లును ఓడించడం దుర్మార్గమైన చర్యని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. అయితే దీన్ని వదిలిపెట్టే సమస్య లేదని, విపక్షాలకు డిపాజిట్లు రాకుండా చేయాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. అప్పుడే మహిళలకు న్యాయం జరుగుతుందన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకున్న విపక్షాల వైఖరికి నిరసనగా చేపట్టిన ర్యాలీ హెలీప్యాడ్ నుంచి స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర సభా వేదిక వరకు సాగింది. ఈ నిరసన ర్యాలీలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, మంత్రులు కందుల దుర్గేశ్, నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, కూటమి నేతలంతా పాల్గొన్నారు."మహిళలకు ద్రోహం చేయడం జాతి విద్రోహంతో సమానం. మహిళలను గౌరవించి అన్ని రంగాల్లో ఆదరించడం మన సంస్కృతి. పోరాడి సాధించుకునే సమయంలో మహిళా రిజర్వేషన్లు అడ్డుకోవడం క్షమించరాని నేరం. మహిళలు ఆత్మగౌరవంతో బతకాలనే నినాదంతో ముందుకెళ్లాలి. ఇది ప్రారంభం మాత్రమే, అందుకు నిరసనగా మహిళా లోకమంతా ఏకమైంద్న చంద్రబాబు.

## దత్తపుత్రుడు జగన్ గారి తెర తొలగింది

**మొదటిపేజీ తరువాయి -** వైసీపీ అధ్యక్షుడు జగన్ పై ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బీజేపీతో జగన్ అక్రమ పొత్తు బట్టబయలైందని, విపక్షం ముసుగులో ఉన్నది ఆర్ఎస్ఎస్ పక్షమేనని తేలిపోయిందని ఆమె ధ్వజమెత్తారు. "దత్తపుత్రుడు జగన్ గారి తెర తొలగింది" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. రాజ్యాంగ పరిరక్షణ కంటే బీజేపీ భజనే జగన్‌కు ముఖ్యమా అని ఆమె ప్రశ్నించారు. పార్లమెంటులో ప్రవేశపెట్టిన అక్రమ డీలిమిటేషన్ బిల్లుకు మద్దతు పలికినందుకు జగన్ సిగ్గుపడాలని అన్నారు.తన ఐదేళ్ల పాలనలో చేసిన అవినీతి, కేసుల నుంచి రక్షణ పొందేందుకే జగన్ బీజేపీకి బానిసగా మారారని షర్మిల తీవ్ర ఆరోపణలు చేశారు. "కేసుల నుంచి రక్షణ కోసం బానిసగా బ్రతకాలా? బీజేపీ బిల్లులకు గొర్రెలా గుడ్డిగా తలాడించాలా? మోదీ మెప్పుకోసం సొంత కాకిలెక్కలు అల్లాలా?" అని నిలదీశారు. మహానేత వైఎస్ఆర్ సిద్ధాంతాలను, విలువలను జగన్ మంటగలిపారని, దీనిపై ఆయన ఆత్మవిమర్శ చేసుకోవాలని హితవు పలికారు. రాజ్యాంగానికి విఘాతం కలిగించే బిల్లును విపక్షాలు అడ్డుకుంటే, ఆ బిల్లును అడ్డుకోవడం ద్వారా ఏం సాధించారని జగన్ ప్రశ్నించడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. ఈ దొంగ బిల్లుకు ఓటేసి జగన్ ఏం సాధించారని, కోట్లాది ఆంధ్రప్రదేశ్ ప్రజల మనోభావాలను గాయపరిచారని మండిపడ్డారు.మహిళా రిజర్వేషన్ బిల్లును డీలిమిటేషన్‌కు ముడిపెట్టడం జగన్ అవివేకానికి నిదర్శనమని షర్మిల అన్నారు. మహిళల 33 శాతం రిజర్వేషన్లకు కాంగ్రెస్ పార్టీ సహా ఎవరూ వ్యతిరేకం కాదని, కానీ బీజేపీ ప్రభుత్వం దాని అమలును ఆలస్యం చేసేందుకే డీలిమిటేషన్, జనాభా లెక్కలు అనే నిబంధనలు పెట్టిందని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజనపై తమ పార్టీ వైఖరి స్పష్టంగా ఉందని తెలిపారు. 2026 జనాభా లెక్కలు, కులగణన పూర్తయ్యాక, ఆ గణాంకాల ఆధారంగా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు న్యాయం చేస్తూ రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే ప్రస్తుతమున్న 543 లోక్‌సభ స్థానాలకే మహిళా రిజర్వేషన్లను వర్తింపజేయాలని కాంగ్రెస్ పార్టీ కోరుతోందని వివరించారు.అధికారిక గణాంకాలు లేకుండానే సీట్లు పెంచి దేశాన్ని ఉద్ధరిస్తున్నామని బీజేపీ చెబితే, జగన్ గుడ్డిగా నమ్మడం రాష్ట్ర ప్రజలను మోసం చేయడమేనని షర్మిల అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ అంటే బాబు, జగన్, పవన్ అని, ఈ మూడు పార్టీలూ మోదీ మెప్పుకోసమే పనిచేస్తున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో నిజమైన ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని, ప్రజల హక్కుల కోసం పోరాడుతున్నది తామేనని ఆమె పేర్కొన్నారు.

## రూ.16 కోట్ల ఇంజెక్షన్‌తో పునర్జన్మ

**మొదటిపేజీ తరువాయి -**

లక్షల హృదయాల ప్రార్థనలు ఓవైపు, మంత్రి నారా లోకేశ్ కృషి మరోవైపు... అరుదైన వ్యాధితో బాధపడుతున్న చిన్నారి పునర్విక ప్రాణాన్ని నిలబెట్టాయి. కొన్ని నెలలుగా 'సేవ్ పునర్విక' అంటూ సామాజిక మాధ్యమాల్లో సాగిన మానవతా ఉద్యమానికి సార్థకత లభించింది. ఆ పసిమొగ్గకు ప్రాణం నిలిచింది. అరుదైన స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ (ఎస్ఎమ్ఏ టైప్-1) వ్యాధితో ప్రాణాలతో పోరాడుతున్న ఏడాది చిన్నారి పునర్వికకు మంత్రి నారా లోకేశ్ రూపంలో అందిన ఆపన్నహస్తం, పునర్జన్మను ప్రసాదించింది. మాటలతో చెప్పలేని ఆవేదన నుంచి ఆనందభాష్పాలు రాల్చే క్షణాలకు ఈ కథ నిలువుటద్దం. అన్నగా అండగా నిలుస్తానని ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ, రూ.16 కోట్ల విలువైన జీవన సంజీవనిని అందించి, ఆ చిట్టి చెల్లెలి చిరునవ్వును కాపాడారు లోకేశ్. హైదరాబాద్‌లోని రెయిన్‌బో ఆసుపత్రిలో మంత్రి లోకేశ్ సమక్షంలోనే వైద్యులు శనివారం ఉదయం ఆ ఇంజెక్షన్ ను పునర్వికకు అందించారు. ఈ ఘట్టంతో కొన్ని నెలలుగా సాగిన "సేవ్ పునర్విక" ఉద్యమం విజయవంతంగా ఫలించింది.కర్నూలు జిల్లా వెల్దుర్తికి చెందిన జంపాల మంగళ సురేష్ కుమార్, పుష్పావతి దంపతుల కుమార్తె పునర్విక. క్షవరం వృత్తి చేసుకుని జీవనం సాగించే సురేష్ కుమార్ కుటుంబానికి, తమ కుమార్తెకు ప్రాణాంతక వ్యాధి సోకిందని తెలియడంతో మిన్ను విరిగి మీద పడ్డట్టయింది. పుట్టిన ఆరు నెలలైనా చిన్నారిలో కదలికలు లేకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు, హైదరాబాద్ రెయిన్‌బో ఆసుపత్రిని ఆశ్రయించారు. అక్కడ వైద్యులు పునర్వికకు స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ సోకినట్టు నిర్ధారించారు. ఈ వ్యాధికి అమెరికా నుంచి తెప్పించే రూ.16 కోట్ల విలువైన ఇంజెక్షన్ ఒక్కటే మార్గమని తేల్చిచెప్పారు.దీంతో కన్నీరుమున్నీరైన ఆ తల్లిదండ్రులు, తమ కుమార్తెను కాపాడుకోవడానికి దాతల సహాయం కోరుతూ ఈ ఏడాది జనవరిలో సోషల్ మీడియా వేదికగా అభ్యర్థించారు. "సేవ్ పునర్విక" పేరుతో సాగిన ఈ ప్రచారానికి లక్షలాది హృదయాలు స్పందించాయి. ఫిబ్రవరి నాటికి సుమారు రూ.10 కోట్ల విరాళాలు సమకూరాయి. అయినా, ఇంకా భారీ మొత్తంలో డబ్బు అవసరం కావడంతో, తల్లిదండ్రులు ఎక్స్ ద్వారా మంత్రి నారా లోకేశ్‌ను సాయం కోరారు.వారి విజ్ఞప్తికి తక్షణమే స్పందించిన మంత్రి లోకేశ్, చిన్నారి బాధ్యతను తాను తీసుకుంటానని, చికిత్సకు అవసరమైన పూర్తి సాయం అందిస్తానని భరోసా ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం, కేవలం ఆర్థిక సహాయం ప్రకటించడమే కాకుండా, చికిత్స ప్రక్రియను మొదటి నుంచి చివరి వరకు అన్నీతానై పర్యవేక్షించారు. రూ.16 కోట్ల ఇంజెక్షన్‌ను అమెరికా నుంచి హైదరాబాద్‌కు వేగంగా రప్పించేందుకు తన సిబ్బంది ద్వారా నిరంతరం సమన్వయం చేశారు. ఔషధ తయారీ సంస్థ నోవార్టిస్, రెయిన్‌బో ఆసుపత్రి యాజమాన్యం, వైద్యులతో మాట్లాడి ప్రక్రియను వేగవంతం చేశారు. ప్రభుత్వ ధృవపత్రాలు, చెల్లింపులు, రవాణా వంటి అన్ని అడ్డంకులను తొలగించి, ఇంజెక్షన్ సకాలంలో అందేలా చూశారు.చిన్నారికి ఇంజెక్షన్ ఇస్తున్న సమయంలో ఆసుపత్రిలోనే ఉన్న లోకేశ్, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఏడుస్తున్న పునర్వికను ఎత్తుకుని లాలించారు. అనంతరం వైద్యులతో మాట్లాడి చికిత్స వివరాలు తెలుసుకున్నారు. తమ కుమార్తెకు జన్మనిచ్చింది తామైతే, పునర్జన్మ ప్రసాదించింది మంత్రి లోకేశ్, దాతలని పునర్విక తల్లిదండ్రులు భావోద్వేగంతో కృతజ్ఞతలు తెలిపారు. లోకేశ్ చేసిన సహాయాన్ని జీవితాంతం మరువలేమని, భవిష్యత్తులోనూ అండగా ఉంటానని ఆయన భరోసా ఇచ్చారని సంతోషం వ్యక్తం చేశారు. వైద్యులు, దాతలు, ప్రార్థించిన ప్రతి ఒక్కరికీ వారు శిరస్సు వంచి నమస్కారాలు తెలియజేశారు.

## తెలంగాణలో మరోసారి మోగనున్న ఎన్నికల నగారా

**మొదటిపేజీ తరువాయి -** 23వ తేదీలోపు ఎన్నికల సంఘానికి నివేదించాలని ఎస్ఈసీ సూచించింది. వాటిని ఆమోదించిన తర్వాత ముసాయిదా జాబితాలను గ్రామాల వారీగా విడుదల చేయనున్నారు. అభ్యంతరాలు, సలహాలు, సూచనలు పరిగణనలోకి తీసుకొని తుది జాబితాను విడుదల చేస్తారు. ఆ తర్వాత పోలింగ్ సెంటర్లు, బ్యాలెట్ బాక్సులు, ఇతర ఏర్పాట్లను చేయనున్నారు.

**సెప్టెంబరులోనే ప్రక్రియ చేపట్టినప్పటికీ :**

ఎంపీటీసీ, జడ్పీటీసీలకు చివరిసారిగా 2019 మే 6, 10, 14వ తేదీల్లో ఎన్నికలు జరగ్గా, వెంటనే రిజల్ట్స్ ప్రకటించారు. జూన్‌లో ఎంపీపీ, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్లను ఎన్నుకున్నారు. గత ఏడాది జూన్ నెలతో వారి పదవీ కాలం ముగిసింది. అప్పటి నుంచి స్పెషల్ ఆఫీసర్ల పాలన నడుస్తోంది. వాస్తవానికి రెండు దశల్లో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణకు గత సెప్టెంబరు 29న నోటిఫికేషన్ విడుదల చేయగా, నామినేషన్ల స్వీకరణ మొదలైంది. బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా అక్టోబరు 9వ తేదీన హైకోర్టు ఆదేశాల మేరకు ఈ ప్రక్రియ నిలిచిపోయింది. ఆ తర్వాత రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం అనుమతితో గ్రామ పంచాయతీలు, పురపాలక సంఘాలకు ఎన్నికలను నిర్వహించారు. రిజర్వేషన్ల విధానాన్ని ప్రకటించిన అనంతరం దానికి అనుగుణంగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సైతం హైకోర్టు అనుమతితో మే నెలలో నిర్వహించాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లుగా సమాచారం.

**5,773 ఎంపీటీసీలు, 566 జడ్పీటీసీలు :**

తాజాగా మళ్లీ వచ్చే ఎన్నికలకు సంబంధించి ఇప్పటికే రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల జాబితాను రూపొందించి ఎస్ఈసీ (రాష్ట్ర ఎన్నికల సంఘానికి) నివేదించింది. ఈ మేరకు మొత్తం 566 జడ్పీటీసీ స్థానాలు, ఆ మేరకు మండల ప్రజాపరిషత్ ఛైర్‌పర్సన్ల (ఎంపీపీలు), 5,773 ఎంపీటీసీ స్థానాలను ఖరారు చేసింది. మేడ్చల్-మల్కాజిగిరిని అర్బన్ జిల్లాగా మార్చడం వల్ల జిల్లా పరిషత్‌ల జాబితా నుంచి దానిని తొలగించారు. దీంతో ప్రస్తుతం మొత్తం 31 జిల్లా పరిషత్‌లున్నాయి. 2019 తర్వాత మున్సిపాలిటీలు, నగరపాలికల్లో చాలా గ్రామ పంచాయతీలు విలీనమయ్యాయి. ఫలితంగా గ్రామాల సంఖ్య తగ్గుదల కారణంగా 44 ఎంపీటీసీలు, నాలుగు జడ్పీటీసీ, నాలుగు ఎంపీపీ స్థానాలు తగ్గాయి.ఎన్నికలు జరగనున్నాయనే సంకేతాలు వస్తున్న వేళ ఆశావహుల్లో ఉత్సాహం నెలకొంది. ఈసారి ఎలాగైనా సీటు దక్కించుకుని గెలుపే లక్ష్యంగా ముందుకు సాగేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే సర్పంచ్, నగరపాలక ఎన్నికలు పూర్తయిన వేళ జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు రెడీ అవుతున్నారు.

## హర్మూజ్ జలసంధిలో ఇరాన్ సైన్యం కాల్పులు

**మొదటిపేజీ తరువాయి -** వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిలో మరోసారి తీవ్ర ఉద్రిక్తతలు చెలరేగాయి. ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ (ఐఆర్జీసీ) బలగాలు ఒక ఆయిల్ ట్యాంకర్‌పై కాల్పులు జరపగా, రెండు భారత జెండా కలిగిన నౌకలు సహా పలు వాణిజ్య నౌకలు వెనక్కి మళ్లాయి. ఈ పరిణామం ప్రపంచవ్యాప్తంగా చమురు సరఫరాపై ఆందోళనలను రేకెత్తిస్తోంది. ఈ ఘటన ఒమన్‌కు 20 నాటికల్ మైళ్ల దూరంలో శనివారం చోటుచేసుకున్నట్లు యూకే మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ ధృవీకరించింది. తమ కథనం ప్రకారం, ఇరాన్‌కు చెందిన రెండు గన్‌బోట్లు ఎలాంటి రేడియో హెచ్చరికలు జారీ చేయకుండా ఒక ట్యాంకర్‌ను సమీపించి కాల్పులకు తెగబడ్డాయి. అయితే, ఈ ఘటనలో నౌకకు గానీ, సిబ్బందికి గానీ ఎలాంటి హాని జరగలేదని, అంతా సురక్షితంగా ఉన్నారని ట్యాంకర్ మాస్టర్ నివేదించినట్లు యూకేఎంటీవో తెలిపింది. ఇదే సమయంలో, హర్మూజ్ జలసంధిపై తిరిగి తమ పూర్తిస్థాయి నియంత్రణను పునరుద్ధరించినట్లు ఇరాన్



సంచలన ప్రకటన చేసింది. అమెరికా తమ నౌకలపై కొనసాగిస్తున్న దిగ్బంధనానికి ప్రతిస్పందనగా ఈ మూసివేత చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేసింది. అమెరికా ఆంక్షలు ఎత్తివేసేంత వరకు ఈ నియంత్రణ కొనసాగుతుందని ఇరాన్ అధికారిక వార్తా సంస్థ తస్నిమ్ పేర్కొంది.ఇరాన్ కాల్పుల నేపథ్యంలో వెనక్కి మళ్లిన నౌకల్లో రెండు భారతీయ జెండా నౌకలు ఉన్నట్లు సమాచారం. వీటిలో ఒకటి 20 లక్షల బ్యారెల్స్ ఇరాక్ చమురును తరలిస్తున్న భారీ సూపర్ ట్యాంకర్ కావడం గమనార్హం. ఇరాన్ తాజా చర్యలతో హర్మూజ్ జలసంధి గుండా ప్రయాణిస్తున్న సుమారు 10 వాణిజ్య నౌకలు తమ మార్గాలను మార్చుకుని వెనక్కి మళ్లినట్లు జిన్హువా వార్తా సంస్థ నివేదించింది. ఇరాన్ సముద్ర ట్రాఫిక్‌ను పర్యవేక్షించే లారక్ ద్వీపం సమీపంలో ఈ నౌకలు తమ దిశను మార్చుకున్నట్లు మెరైన్ ట్రాఫిక్ డేటా సూచిస్తోంది. మధ్యప్రా చ్యంలో ఇప్పటికే నెలకొన్న యుద్ధ వాతావరణాన్ని ఈ తాజా పరిణామాలు మరింత తీవ్రతరం చేశాయి. ఈ ఘటన ప్రపంచ చమురు సరఫరాపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ, నౌకాదళం పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నాయని, భారతీయ నౌకల భద్రతకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాయని అధికార వర్గాలు తెలిపాయి.

## హర్మూజ్ మళ్లీ మూసివేత

**మొదటిపేజీ తరువాయి -**

అమెరికాతో ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరాన్ సంచలన నిర్ణయం తీసుకుంది. వ్యూహాత్మకమైన హర్మూజ్ జలసంధిని మళ్లీ మూసివేసింది. హర్మూజ్ పై మళ్లీ కఠిన నియంత్రణ విధిస్తున్నట్లు నేడు ఓ ప్రకటనలో తెలిపింది. తమ ఓడరేవులకు వచ్చే నౌకలపై అమెరికా నేవీ దిగ్బంధనాన్ని కొనసాగించడమే ఈ నిర్ణయానికి కారణమని, ఇచ్చిన మాటను అమెరికా ఉల్లంఘించిందని ఇరాన్ ఆరోపించింది."ఇరాన్ నౌకలకు స్వేచ్ఛా రవాణాను అమెరికా పునరుద్ధరించే వరకు ఈ పరిస్థితిలో మార్పు ఉండదు. హర్మూజ్ జలసంధి కఠినంగా నియంత్రించబడుతుంది" అని ఇరాన్ సైనిక కమాండ్ తమ అధికారిక టెలివిజన్‌లో స్పష్టం చేసింది.ఇజ్రాయెల్-లెబనాన్ కాల్పుల విరమణ ఒప్పందం తర్వాత, కేవలం రెండు రోజుల క్రితమే ఇరాన్ ఈ జలసంధిని తెరిచింది. అయితే, ఇరాన్‌తో విస్తృత ఒప్పందం కుదిరే వరకు నేవీ దిగ్బంధనం కొనసాగుతుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేయడంతో పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది.పర్షియన్ గల్ఫ్ నుంచి ఆయిల్ ఎగుమతులకు హర్మూజ్ జలసంధి ప్రధాన మార్గం. ప్రపంచ ఆయిల్ రవాణాలో దాదాపు 20 శాతం ఇక్కడి నుంచే జరుగుతుంది. ఇరాన్ తాజా నిర్ణయంతో మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు మళ్లీ పెరిగే అవకాశం ఉందని, ఇది ప్రపంచ ఆయిల్ ధరలపై ప్రభావం చూపే ప్రమాదం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.




# నకిలీ వైద్య కేంద్రాలపై ఉక్కుపాదం రెండు కేంద్రాలు సీజ్






**మేడ్చల్ మల్కాజ్గిరి, ఏప్రిల్18. అక్షర టైమ్స్:-** మేడ్చల్మల్కాజిగిరి జిల్లాలో అనధికారికంగా నడుస్తున్న వైద్య కేంద్రాలపై జిల్లా యంత్రాంగం ఉక్కుపాదం మోపింది. సఫిల్గూడ, ఉత్తమ్నగర్ ప్రాంతాల్లో నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో "శ్రీ వెంకటేశ్వర వెల్నెస్ సెంటర్"లో తీవ్ర అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. గతంలో నకిలీ పత్రాలతో క్లినిక్ నిర్వహిస్తూ సీజ్ చేయబడిన ఈ యాజమాన్యం, కొత్త పేరుతో మళ్లీ కార్యకలాపాలు ప్రారంభించడం అధికారులను ఆశ్చర్యానికి గురిచేసింది. తాజా తనిఖీల్లో అర్హతలు లేని వ్యక్తులు ప్రమాదకర వైద్య చికిత్సలు నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. రోగుల నుంచి ఒక్కోసారి భారీగా డబ్బులు వసూలు చేయడంతో పాటు, ప్యాకేజీల పేరుతో ముందుగానే పెద్ద మొత్తాలు తీసుకుంటున్నట్లు బాధితులు వెల్లడించారు. ఇది వైద్య నైతికతకు విరుద్ధమని అధికారులు స్పష్టం చేశారు.ఈ చర్యలు చట్టాలకు విరుద్ధంగా ఉండటంతో పాటు ప్రజల ఆరోగ్య భద్రతను ప్రమాదంలోకి నెట్టుతున్నాయని నిర్ధారించి, ఆ కేంద్రాన్ని వెంటనే సీజ్ చేశారు. ఇదే క్రమంలో ఏఎస్ రావు నగర్లోని మరో చర్మ వైద్య కేంద్రంపై కూడా తనిఖీలు నిర్వహించగా, అర్హతలు లేని వ్యక్తులు చర్మ సంబంధిత చికిత్సలు అందిస్తున్నట్లు గుర్తించారు. దీంతో ఆ కేంద్రాన్ని కూడా అధికారులు సీజ్ చేశారు.జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి డా. సి. ఉమా గౌరి హెచ్చరిస్తూ, కేవలం నమోదు ఉండటం సరిపోదని, ప్రతి వైద్య సేవ అర్హత కలిగిన వైద్యులచేనే అందించాల్సి ఉంటుందని తెలిపారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.ప్రజలు చికిత్స పొందే ముందు వైద్యుల అర్హతలను తప్పనిసరిగా పరిశీలించాలని, అనుమానాస్పద కేంద్రాలపై వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

www.akshratimes.com
తెలుగు దినపత్రిక
అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
గ్రేటర్ హైదరాబాద్, ఈస్ట్ గోదావరి,
కాకినాడ జిల్లా, వెస్ట్ గోదావరి, ఏలూరు జిల్లా


## పీర్జాదిగూడ చెరువులలో దోమల మందు పిచికారీ

**- మున్సిపల్ అధికారులకు కృతజ్ఞతలు తెలియజేసిన తుంగతుర్తి రవి**






ఉప్పల్,ఏప్రిల్18.అక్షర టైమ్స్:-మేడ్చల్ మల్కాజిగిరి, ఉప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బోడుప్పల్ సర్కిల్, పీర్జాదిగూడ డివిజన్ చెరువులలో ఈరోజు మున్సిపల్ అధికారులు డ్రోన్ సహాయంతో దోమల మందు పిచికారీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇటీవల దోమలు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో దోమల మందు పిచికారీ చర్య కార్యక్రమాన్ని చేపట్టినట్లు అధికారులు తెలిపారు.అదేవిధంగా, చెరువులో పేరుకుపోయిన గుర్రపు డెక్కను తొలగించేందుకు టెండర్ ప్రక్రియ పూర్తయ్యిందని, అతి త్వరగా పూర్తిస్థాయిలో శుభ్రపరిచే చర్య తీసుకుంటామని ఎంఎంసీ అధికారులు వెల్లడించారు. దోమల నివారణ కోసం చేపట్టిన ఈ చర్యలను అభినందిస్తూ,ఎంఎంసీ బోడుప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఏ .శైలజ కి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మరియు ఆర్.వి ఫౌండేషన్ చైర్మన్ తుంగతుర్తి రవి కృతజ్ఞతలు తెలిపారు.అలాగే పీర్జాదిగూడ, మేడిపల్లి, పర్వతపూర్ ఏరియాలో దోమల నివారణకు శాశ్వత పరిస్కారం చూపించాలని మున్సిపల్ అధికారులకు మనవి చేశారు. ఈ కార్యక్రమంలో డిఈ జాహ్నవి, ఏఈఈ మహేష్, ఎంటమాలజిస్ట్ రాంబాబు, స్ ఫ్ఏ నరేష్ తదితర ఎంఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

## నాగారం కాలనీల అభివృద్ధికి కార్యవర్గం సమగ్ర కార్యాచరణ



**నాగారం,ఏప్రిల్18.అక్షర టైమ్స్:-నాగారం** మున్సిపల్ పరిధిలోని అన్ని కాలనీల కార్యవర్గ సమావేశం శనివారం ఘనంగా నిర్వహించబడింది. సమావేశానికి అధ్యక్షత వహించిన మాజేటి వేణుగోపాల్ మాట్లాడుతూ కాలనీల సమగ్ర అభివృద్ధి కోసం ప్రతీ సభ్యుడు బాధ్యతాయుతంగా పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. వర్కింగ్ అధ్యక్షుడు సిహెచ్ సాయినాథ్ గౌడ్ సమావేశాన్ని సమన్వయం చేస్తూ వివిధ అంశాలపై సభ్యుల అభిప్రాయాలను సేకరించారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షుడు చదలవాడ దేవి ప్రసాద్ రావు, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ రాజు, సహాయ కార్యదర్శి పి. కుమార్ యాదవ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎస్. భాస్కర్ రెడ్డి, ఖజాంచి టి. రామ్ రెడ్డి పాల్గొని తమ సూచనలు తెలిపారు. కార్యవర్గ సభ్యులు ఎం. శ్రీనివాస్ రావు, వై. హనుమంత్ రావు, పి.వి. రాఘవ రావు కూడా చర్చల్లో చురుకుగా పాల్గొన్నారు.సమావేశంలో కాలనీల్లో నెలకొన్న తాగునీటి కొరత, పారిశుద్ధ్య సమస్యలు, రహదారుల దుస్థితి, వీధి దీపాల పనితీరు, చెత్త సేకరణలో లోపాలు వంటి పలు ప్రజా సమస్యలను సభ్యులు ప్రస్తావించారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో సమన్వయం పెంచి త్వరితగతిన చర్యలు చేపట్టాలని నిర్ణయించారు.అదనంగా కాలనీల్లో పచ్చదనం పెంపు, భద్రతా చర్యల బలోపేతం, ప్రజల అవగాహన కార్యక్రమాల నిర్వహణపై కూడా చర్చించారు. భవిష్యత్తులో ప్రతి కాలనీలో తరచూ సమావేశాలు నిర్వహించి సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించే విధంగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. సమావేశం సజావుగా కొనసాగి కాలనీల అభివృద్ధికి దోహదపడే పలు కీలక నిర్ణయాలు

## తూముకుంట జడ్పీహెచ్ఎస్ పాఠశాలపై కలెక్టర్ సమగ్ర తనిఖీ





**షామీర్పేట్,ఏప్రిల్18.అక్షర టైమ్స్:-**మేడ్చల్మల్కాజ్గిరి జిల్లా షామీర్పేట్ మండలం తూముకుంట జడ్పీహెచ్ఎస్ పాఠశాలను శనివారం జిల్లా కలెక్టర్ మను చౌదరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో ప్రాథమిక మరియు హైస్కూల్ తరగతులు కలిసి నిర్వహిస్తున్నందున విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు సమృద్ధిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు స్పష్టం చేశారు.తనిఖీ సందర్భంగా తరగతి గదులు, కంప్యూటర్ ల్యాబ్, పాఠశాల ప్రాంగణాన్ని పరిశీలించిన కలెక్టర్, విద్యార్థుల అభ్యాసానికి అనుకూల వాతావరణం కల్పించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అదనపు తరగతి గదులు, మరుగుదొడ్ల నిర్మాణంపై ప్రిన్సిపల్ చేసిన వినతికి సానుకూలంగా స్పందించిన ఆయన, సంబంధిత ప్రతిపాదనలు వెంటనే పంపించాలని ఆదేశించారు. పాఠశాలలో తీవ్రంగా ఉన్న నీటి కొరత సమస్యపై కలెక్టర్ ఆందోళన వ్యక్తం చేశారు. మున్సిపల్ వాటర్ సరిపోకపోవడంతో బోర్వెల్ త్రవ్వకానికి వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే పాఠశాలలో అత్యవసరంగా చేయాల్సిన మరమ్మత్తులను ప్రాధాన్యతగా పూర్తి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి విజయ్ కుమారి, షామీర్పేట్ తాహసిల్దార్ సుచరిత, పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి..

**రామంతాపూర్ ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి పరమేశ్వర్‌రెడ్డి**






**ఉప్పల్,ఏప్రిల్18.అక్షర టైమ్స్:-** ప్రభుత్వ పాఠశాలలో అదనపు గదుల నిర్మాణంతో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయనున్నట్టుగా ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జీ మందుముల పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. పరమేశ్వర్‌రెడ్డి శనివారం రామంతాపూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. అక్కడి ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో పరమేశ్వర్‌రెడ్డి మాట్లాడారు. పరమేశ్వర్‌రెడ్డి దృష్టికి ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలలోని సమస్యలను తెచ్చారు. ప్రస్తుతం ఉన్న తరగతి గదులు సరిపోవడంలేదని పరమేశ్వర్‌రెడ్డికి వివరించారు. ఇదే కాకుండా మూత్రశాలలు, మరుగుదొడ్లు కూడా లేవన్నారు. వీటితో పాటు ఇతర మౌలిక సదుపాయాలను కూడా కల్పించాలని కోరారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టారని ఈ సందర్భంగా పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. రామంతాపూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలోనూ అదనపు గదుల నిర్మాణంతో పాటు మరుగుదొడ్లు, మూత్రశాలలను సైతం ఏర్పాటు చేయనున్నట్టుగా చెప్పారు. ఇదే కాకుండా అన్ని రకాల సదుపాయాలను కూడా కల్పించనున్నట్టుగా తెలిపారు.కార్యక్రమంలో రామంతాపూర్ జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రిన్సిపాల్ లత గ,మండల్ ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం రేణుక ,డాన్ బిక్షపతి ,ఎర్రం శ్రీనివాస్ ,విజయ్ కుమార్ ,సిద్దగోని రాజు రవీందర్ రావు ,కిరణ్ రమేష్,

రామంతాపూర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు

రామంతాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎండ్ రఫీక్, ఎండ్ తాఫీక్, వర్కింగ్ ప్రెసిడెంట్ వల్లపు శ్రీకాంత్ యాదవ్,లూకాస్, శామ్యూల్, జంగయ్య, సందీప్, కంది శ్రవణ్, ఉపేందర్ రెడ్డి, పూస సతీన్న, బాబురావు, శ్రీధర్, బుల్లెట్ అశోక్, భాస్కర్, సచిన్, జిల్లు,నాగ మల్లయ్య, కే శంకర్, శ్రీనివాస్ గౌడ్, లింగం, నయీమ్, రాజు, సతీష్ గౌడ్, నర్సిమ, మహేష్, రవి, అంబికా, శోభతదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ సమస్యలు వెంటనే పరిష్కరించాలి సమ్మె నివారణనకు సంఘం విజ్ఞప్తి



**కుషాయిగూడ,ఏప్రిల్18.అక్షర టైమ్స్:-**రాష్ట్ర రవాణా సంస్థ ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించి ప్రతిపాదిత సమ్మెను నివారించాలని బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిరంజన్ ప్రభుత్వానికి, యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు. సంయుక్త చర్యా సమితి పిలుపు మేరకు ఈ నెల 22 నుంచి సమ్మెకు సన్నద్ధమవుతున్న నేపథ్యంలో ఉద్యోగుల్లో అసంతృప్తి పెరుగుతోందని ఆయన పేర్కొన్నారు. అధిక పనిభారం, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఎలక్ట్రిక్ బస్సుల ప్రవేశం కారణంగా డ్రైవర్లు, నిర్వహణ సిబ్బందిలో భవిష్యత్తుపై అనిశ్చితి నెలకొన్నదని తెలిపారు. అదనపు సిబ్బందిని కండక్టర్లుగా మార్పు చేయడం, ఇతర ప్రాంతాలకు బదిలీలు చేపట్టడం వంటి నిర్ణయాలు ఉద్యోగుల్లో అభద్రతాభావాన్ని పెంచుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశాలపై యాజమాన్యం పునరాలోచన చేయాలని కోరారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అమలు అభినందనీయమని పేర్కొంటూ, ఆ పథకం విజయానికి ఉద్యోగుల కృషి ప్రధాన కారణమని అన్నారు. అయితే ప్రభుత్వ హామీలైన జీతభత్యాల సవరణలు, సంస్థను ప్రభుత్వంలో విలీనం చేయడం వంటి కీలక అంశాలను ఆలస్యం చేయకుండా అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా కుషాయిగూడ డిపో అధ్యక్షుడు గడ్డం యాదగిరి మాట్లాడుతూ, కార్మికుల సమస్యలను పట్టించుకుని తక్షణ పరిష్కారం చూపితేనే సమ్మె పరిస్థితి నివారించగలమన్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ తిరుపతయ్య, కోశాధికారి మంగమ్మ, స్థానిక ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## వెలుగుట్ట దేవాలయానికి కొత్త కమిటీ బాధ్యతలు స్వీకారం





**ఉప్పల్,ఏప్రిల్18.అక్షర టైమ్స్:-** ఉప్పల్ వెలుగుట్టలోని శ్రీ దుర్గ మల్లికార్జున స్వామి దేవాలయంలో నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించబడింది. భక్తుల నడుమ ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నూతన కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయాలు సామాజిక ఐక్యతకు కేంద్ర బిందువులుగా నిలుస్తాయని, భక్తుల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా కమిటీ సభ్యులు సేవా భావంతో పనిచేయాలని సూచించారు. ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనలో కొత్త కమిటీ కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో దేవాలయ చైర్మన్‌గా గౌరిగే మల్లేష్ బాధ్యతలు స్వీకరించగా, ధర్మకర్తలుగా తేజవత్ రాజు, మారం దిలీప్ కుమార్, చెన్‌రెడ్డి కృష్ణారెడ్డి, రౌండ్ల శ్రీకాంత్ రెడ్డి, గుండు రాజు, తేజావత్ జ్యోతి ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం పూజా కార్యక్రమాలు నిర్వహించి దేవుని ఆశీర్వాదాలు పొందారు.ఈ కార్యక్రమంలో ఈఓ శ్రీకాంత్, ఇన్స్పెక్టర్ ప్రణీత్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు బొప్పనపల్లి సుధాకర్ రెడ్డి, కంది శ్రవణ్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు విజయ్ కుమార్ తదితర నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు, స్థానికులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కొత్త కమిటీ ఆధ్వర్యంలో దేవాలయం మరింత అభివృద్ధి చెందాలని అందరూ ఆకాంక్షించారు.

## ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తలపెట్టిన మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయండి

**- టిడిపి శ్రేణులకు పిలుపునిచ్చిన రాష్ట్ర కార్యదర్శి కన్నబాబు**



గోకవరం,ఏప్రిల్18.అక్షర టైమ్స్:- జగ్గంపేటలో శాసనసభ్యులు, టిటిడి బోర్డు మెంబర్ జ్యోతుల నెహ్రూ ఈ నెల 20 న ముఖ్యమంత్రి చంద్రబాబు పుట్టినరోజు సందర్భంగా తలపెట్టినటువంటి మెగా వైద్య శిబిరాన్ని గోకవరం మండల టిడిపి శ్రేణులు విజయవంతం చేయాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కన్నబాబు పిలుపునిచ్చారు. ఏప్రిల్ 20వ తేదీ చంద్రబాబు పుట్టినరోజును అందరికీ గుర్తుండిపోయే విధంగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, కాకినాడ పార్లమెంటరీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ నిర్వహిస్తున్నారని అన్నారు. ఈ రాష్ట్రానికి ఒక సమర్థవంతమైన నాయకుడిని అందించిన రోజును అందరికీ ఉపయోగకరమైన విధంగా జగ్గంపేట తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఘనంగా పుట్టినరోజు వేడుకలు నిర్వహించి , 500 మందితో మెగా రక్తదానం శిబిరం ఏర్పాటు చేసి రక్తం 500 మందితో రక్తం అందించడం అందించే కార్యక్రమానికి ఎమ్మెల్యే జ్యోతులు శ్రీకారం చుట్టారని ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కన్నబాబు అన్నారు. రక్తదానం చేసిన వారికి ఎన్టీఆర్ ట్రస్ట్ నుంచి ఒక సర్టిఫికెట్, జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ నుండి ఐడి కార్డు అందుకోవడం మనకు గర్వ కారణం అని కన్నబాబు అన్నారు

## జర్నలిస్టు మోర్త రవిపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

**:ఏపీడబ్ల్యూజేఎఫ్**



**శంఖవరం/యు.కొత్తపల్లి,ఏప్రిల్18.అక్షర టైమ్స్:-** కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం లో యు. కొత్తపల్లి మండలంలో ఒక మీడియా సంస్థలో పని చేస్తున్న జర్నలిస్టు మోర్త రవిపై శుక్రవారం రాత్రి కొందరు దుండగులు విచక్షణారహితంగా దాడి చేయడాన్ని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) కాకినాడ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ దాడిలో గాయపడిన రవి ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనపై ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో కొత్తపల్లి మండలానికి చెందిన విలేకరులు ఎస్ఐ జి. వెంకటేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కార్యదర్శి ముమ్మిడి లక్ష్మణ్, స్థానిక పాత్రికేయులు ఎం. మూర్తి, గంప రాజు, చోడిశెట్టి సతీష్, తోట శాంతి, ఎం. రమణ, ఎం. చక్రధర్, కోకా సతీష్ బాబు, జి.కిషోర్, ఎం. వంశీ, ఆదిమూలం గంగాధర్ రావు, జ్యోతుల రాంబాబు, కృష్ణ తదితరులు మాట్లాడుతూ జర్నలిస్టులపై ఇలాంటి దాడులు జరగడం ప్రజాస్వామ్యానికి ముప్పు కలిగించే చర్యలని అన్నారు. ఇటీవలి కాలంలో జర్నలిస్టులపై దాడులు పెరుగుతున్న నేపథ్యంలో ఈ ఘటనపై పోలీసులు తక్షణమే స్పందించి పూర్తి స్థాయిలో, నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని వారు కోరారు. దాడికి పాల్పడిన వారిని గుర్తించి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా జర్నలిస్టుల భద్రతకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఈ సందర్భంగా మండలంలోని పలువురు విలేకరులు తమ ఆందోళన వ్యక్తం చేస్తూ సంఘీభావం తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో మణికంఠ, స్టాలిన్, దొరబాబు, బాబీ, రాజశేఖర్ తదితర పాత్రికేయులు పాల్గొన్నారు.

## ఏ.వి.నగరం గ్రామంలో బడి పిలుస్తుంది రా



**శంఖవరం/ఏ.వినగరం,ఏప్రిల్18.అక్షర టైమ్స్:-** కాకినాడ జిల్లా తుని నియోజకవర్గం తొండంగి మండలం లో ఏ .వి.నగరం గ్రామంలో "బడి పిలుస్తుంది" కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గాయత్రి దేవి, ఉపాధ్యాయిని, ఉపాద్యాయులు, స్కూల్ ఎస్.ఎం.సి చైర్మన్, వైస్ చైర్మన్, గ్రామ పెద్దలు తో ర్యాలీ గా ఎన్రోల్మెంట్ డ్రైవ్ ను చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే పిల్లలకు రాష్ట్ర ప్రభుత్వం ఉచిత పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, బెల్ట్, షూ లాంటి అనేక సౌకర్యాలను కల్పిస్తుందని, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయ బృందం ద్వారా తమ పాఠశాలలో డిజిటల్ విద్య బోధన జరుగుతుందని, ప్రైవేట్ స్కూల్లో లేని ఎన్నో సౌకర్యాలు తమ పాఠశాలలో అందిస్తున్నామని ఈ అవకాశాన్ని విద్యార్థిని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు యనమల నాగేశ్వర రావు, యనమల సత్తిబాబు,కొయ్య శ్రీను తదితరులు పాల్గొన్నారు. విలేకరులు తమ ఆందోళన వ్యక్తం చేస్తూ సంఘీభావం తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో మణికంఠ, స్టాలిన్, దొరబాబు, బాబీ, రాజశేఖర్ తదితర పాత్రికేయులు పాల్గొన్నారు.

## వెంకన్న సన్నిధిలో గొప్ప అన్నదానం

**- బద్దిరెడ్డి నాగ సూర్య సత్యనారాయణ చెంచులక్ష్మి దంపతులచే నిర్వహణ**





గోకవరం,ఏప్రిల్18.అక్షర టైమ్స్:- కోరిన కోరికలు తీర్చేవాడు తంటికొండ స్వయంభు పాద దర్శన వెంకటేశ్వరుడని బద్ధిరెడ్డి నాగ సూర్య సత్యనారాయణ చెంచులక్ష్మి దంపతులు అన్నారు. శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామికి సేవ చేసుకోవడం ఎంతో పుణ్యఫలమని వారు తెలిపారు. శనివారంను పురస్కరించుకొని శ్రీవారి దర్శనానికి భక్తులు కొండకు పోటెత్తారు. సుమారు 4 వేల మంది భక్తులకు శ్రీ వెంకటేశ్వర స్వామి సన్నిధిలో గొప్ప అన్నదానంను సత్యనారాయణ దంపతులచే ఘనంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ శ్రీవారికి సేవ చేసుకోవడం ఏడేడు జన్మల పుణ్యఫలమని ఆయన అన్నారు. దేవస్థానం చైర్మన్ అచ్చన్న దొర ఆధ్వర్యంలో శ్రీవారికి సేవలు విశేషంగా జరుగుతున్నాయన్నారు. శ్రీ వాసవి మాత సంఘం ఆధ్వర్యంలో కొయ్యలగూడెం వాస్తవ్యులు మధు సాయి నితిన్ జ్యోతి అని వారు చల్లని మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేపట్టారు.

## అన్నవరం గ్రామం లో పోషణ పక్వాడ కార్యక్రమం





**శంఖవరం,ఏప్రిల్18.అక్షర టైమ్స్:–** 8వ పోషణ పక్వాడ ఏప్రిల్ 9వ తారీకు 23వ తారీకు వరకు జరుగుతుంది. దీనిలో భాగంగా ఈ రోజు కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం అన్నవరం గ్రామంలో గర్భవతులకు మరియు బాలింతలకు గర్భధారణ సమయంలో ఆహారం మరియు సంరక్షణ, గర్భిణీ స్త్రీ లకు పరీక్షల ప్రాముఖ్యత, గర్భధారణ సమయంలో తీసుకోవలసిన పోషకాహారం, బిడ్డ పుట్టిన వెంటనే ముర్రిపాలు పట్టించటం, ఆరు నెలల నిండే వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వటం,ఆరు నెలలు నిండిన తర్వాత అదనపు ఆహారాన్ని ఇస్తూ తల్లిపాలు కొనసాగించడం,అదేవిధంగా పిల్లల్లో సున్నా నుండి రెండు సంవత్సరాలు లో ఎక్కువగా మెదడు అభివృద్ధి చెందుతుంది.కాబట్టి ఆరోగ్యకరమైన డిజిటల్ అవలవాట్లపై అవగాహన, మరియు సమాజంలో నో స్క్రీన్ అవర్ అనగా పిల్లలకు మొబైల్ ఫోన్లు అలవాటు చేయకూడదని దానివల్ల మెదడు అభివృద్ధి కుంటుపడుతుందని మొబైల్ అలవాటు లేకుండా కుటుంబ సభ్యులతో ఆట సమయం మరియు కార్యక్రమాలు నిర్వహణ కుటుంబ సభ్యులతో తాతయ్య నాన్నమ్మ అమ్మమ్మ వాళ్లతో సమయాన్ని గడపడం,తోటి పిల్లలతో ఆటలు, శారీరక వ్యాయామాలు, క్రీడలు, యోగ లాంటివి అలవాటు చేసినట్లయితే వారి మెదడు వికసిస్తుందని పిల్లలందరినీ స్క్రీన్ నుండి దూరంగా ఉంచాలని అదేవిధంగా జంక్ ఫుడ్ అలవాటు చేయకూడదని వాటి వల్ల కిడ్నీలు, మధుమేహం, ఒబెసిటీ,జీర్ణక్రియ సక్రమంగా లేకపోవడం, క్యాన్సర్ వంటి వ్యాధులు వస్తాయని కాబట్టి పిల్లలకు ఇంటిలో తయారుచేసిన ఆహారము స్నాక్స్ పళ్ళు వంటివి అలవాటు చేయాలని శంకవరం సిడిపిఓ పర్వత వెంకటలక్ష్మి తల్లులందరికీ అవగాహన కల్పించారు. స్త్రీలు బాలింతలు తీసుకోవలసిన జాగ్రత్తలు, వేసవి లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు మరియు పోషకాహారం గురించి వివరించారు. ఉప్పు,పంచదార నూనె వాడకం తగ్గించాలని పేర్కొన్నారు. అంగన్వాడీ కార్యకర్తలు సెక్టార్ సూపర్వైజర్ బీవీ రజని, తల్లితండ్రులు పాల్గొన్నారు.

## చలివేంద్రం ప్రారంభించిన అడిషనల్ కలెక్టర్




**మంచిర్యాల,ఏప్రిల్18.అక్షర టైమ్స్:–** జైపూర్ మండలంలోని కుందారంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఎదురుగా ఉన్న మీసేవ కేంద్రం వద్ద సర్పంచ్ కుక్కల వినోద కిష్టయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శనివారం అడిషనల్ కలెక్టర్ పి. చంద్రయ్య ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన చలివేంద్రం పరిసరాలను పరిశీలించి, పరిశుభ్రతపై పలు సూచనలు చేశారు. అనంతరం బ్యాంకుకు వచ్చిన గ్రామస్తులతో మాట్లాడి, వారికి అందుతున్న సేవలపై అడిగి తెలుసుకున్నారు.గ్రామంలో ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. వేసవిలో ప్రజల దాహం తీర్చడానికి సర్పంచ్ తీసుకున్న ఈ చొరవ అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి డి వెంకటేశ్వరరావు ,ఎంపిడిఓ సత్యనారాయణ,ఎంపిఓ శ్రీపతి బాబురావు,స్థానిక ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కిష్టా పూర్ గ్రామ పంచాయతీ ని ఆకస్మికంగా సందర్శించిన అదనపు కలెక్టర్




**మంచిర్యాల,ఏప్రిల్18.అక్షర టైమ్స్:–**మంచిర్యాల జిల్లా జైపూర్ మండలంలోని కిష్టాపూర్ గ్రామపంచాయతీ ని ఆకస్మికంగా సందర్శించడం జరిగింది, గ్రామపంచాయతీలో ఇందిరమ్మ ఇండ్ల పురోగతి, గృహ జ్యోతి ,గ్యాస్ సబ్సిడీ, రైతు భరోసా,రుణమాఫీ ,ఉచిత రేషన్ పంపిణీ ఎన్ఆర్ఈజీఎస్ కూలీల హాజరు మరియు మొదలగు పథకాల అమలు తీరుపై క్షేత్రస్థాయిలో ప్రజలను అడిగి తెలుసుకోవడం జరిగింది, లిరుమ్మిపూర్ రెవెన్యూ గ్రామం ప్రధానమంత్రి అను సుచిత్ జాతి అభ్యుదయ యోజన పథకంలి కింద ఎంపిక కావడం చేత వాడ వాడ తిరిగి గ్రామంలోని మౌలిక సదుపాయాలను గ్రామ అవసరాలను క్షేత్రస్థాయిలో గుర్తించడం జరిగింది, అదేవిధంగా అంగన్వాడి సెంటర్ కి వెళ్లి పిల్లల హాజరు నమోదు వారి భోజన పట్టికను మరియు ఇతర రిజిస్టర్లను చెక్ చేయడం జరిగింది. గ్రామంలోని 99 రోజుల ప్రణాళికలో భాగంగా జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించి త్వరితగతమున గ్రామం మొత్తం నాళీలు పూడికతీత తీయాలని గ్రామంలో ప్లాస్టిక్ వ్యర్థాలు లేకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించడం జరిగింది. ఈ కార్యక్రమంలో చెన్నూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చందుపట్ల పాప రెడ్డి కిష్టాపూర్ గ్రామ సర్పంచ్ దుర్గం మహేష్, ఎంపీడీవో గుర్రం సత్యనారాయణ , ఎంపీ ఓ బాపూరావు ఉపసర్పంచ్ మాయ శ్రీధర్ పంచాయతి కార్యదర్శి ప్రశాంత్ , వార్డు సభ్యులు సుందిల్ల సమ్మయ్య మరియు గ్రామస్తులు పాల్గొనడం జరిగింది.

## శ్రీ సాయినాథ్ స్కూల్ లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు..






**పొదలకూరు,ఏప్రిల్18.అక్షర టైమ్స్:–**పొదలకూరు మండలం వరదాపురంలోని శ్రీ సాయినాథ్ స్కూల్ లో శనివారం గ్రాడ్యుయేషన్ డేను విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమక్షంలోనే ఘనంగా నిర్వహించటం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి. శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు పునాది ,విద్యార్థి భవిష్యత్తు ను తీర్చిదిద్దేది హై స్కూల్ విద్య కనుక విద్యార్థులను ప్రోత్సహించుటకు ఈ గ్రాడ్యుయేషన్ డే నిర్వహించటం జరిగింది. అందులో భాగంగా యూకేజీ నుండి 1వ తరగతికి,5వ తరగతి నుండి 6వ తరగతికి వచ్చే విద్యార్థులకు తల్లిదండ్రుల సమక్షంలో సర్టిఫికెట్ మరియు మెడల్ అందజేసి ప్రోత్సహించటం జరిగింది.ఈ కార్యక్రమంలో కరెస్పాండంట్ డి.మురళీకృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ ,డి శ్రీనివాసులురెడ్డి, హెడ్మాస్టర్, ఏ. గంగిరెడ్డి, ఇంచార్జ్ టీచర్లు,జ్ఞానం,ఆదిలక్ష్మి, టీచర్లు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోండి

– ట్రాఫిక్ అదనపు డీసీపీ ప్రభాకర్ రావు



**మంచిర్యాల,ఏప్రిల్18.అక్షర టైమ్స్:–**ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని ట్రాఫిక్ అదనపు డీసీపీ తెలిపారు. కాజీపేట ట్రాఫిక్ పోలీసుల వినూత్న అవగాహన కార్యక్రమం రోడ్డు ప్రమాదాల నివారణను ప్రధాన ధ్యేయంగా తీసుకుని నిర్వహిస్తున్న "అరైవ్ అలైవ్" కార్యక్రమంలో భాగంగా కాజీపేట ట్రాఫిక్ పోలీసులు వినూత్న అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. తరహాలో అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సుబేదారి అదాలత్ సెంటర్లో హెల్మెట్ ధరించని వాహనదారులకు అవగాహన కల్పించేందుకు యమధర్మరాజు, చిత్రగుప్తుడి వేషధారణలో ఉన్న కానిస్టేబుళ్లు రహదారులపై ప్రచారం నిర్వహిస్తూ వాహనదారుల దృష్టిని ఆకర్షించి, హెల్మెట్ ధరించాల్సిన అవసరాన్ని స్పష్టంగా తెలియజేసింది. ట్రాఫిక్ నియమాలను పాటించకపోతే ఎదురయ్యే ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అదనపు డీసీపీ ప్రభాకర్ రావు మాట్లాడుతూ, "రోడ్డు ప్రమాదాలు అనేవి క్షణాల్లో ప్రాణాలను కోల్పోయే ప్రమాదకర సంఘటనలు. వాటిని నివారించాలంటే ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలి. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం తమ ప్రాణ రక్షణకు అత్యంత కీలకం. అలాగే కారులో ప్రయాణించే వారు సీట్‌బెల్ట్ ధరించడం అలవాటు చేసుకోవాలి. ట్రాఫిక్ నియమాలు మన భద్రత కోసం రూపొందించబడ్డాయి కాబట్టి వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయకూడదు" అని తెలిపారు. అదేవిధంగా, "ప్రతి ఒక్కరూ క్షేమంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవడం మా లక్ష్యం. 'అరైవ్ అలైవ్' కార్యక్రమం ద్వారా ప్రజల్లో అవగాహన పెంపొందించి రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు కృషి చేస్తున్నాము. ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరించి ట్రాఫిక్ నియమాలను పాటిస్తేనే ఈ లక్ష్యం సాధ్యమవుతుంది" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, కాజీపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకన్నతో పాటు ఇతర ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## గత ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిపై అధికారపక్షం కళ్ళు తెరిపించేందుకే

కైలే అనిల్ కుమార్




**పామర్రు,ఏప్రిల్18. అక్షర టైమ్స్:–** గత 20 నెలలుగా ఈ కూటమి ప్రభుత్వం ఏర్పడిన దగ్గర నుంచి పామర్రు నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని ప్రస్తుత ఎమ్మెల్యే మరియు ఆయన అనుచరులు డబ్బాలు కొట్టుకోవడం తప్పితే నియోజకవర్గంలో కొత్తగా ఒరగపెట్టింది ఏమి లేదని కూటమి ప్రభుత్వాన్ని విమర్శించిన పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..., క్రెడిట్ చోరీ చంద్రబాబు నాయకత్వంలో పని చేస్తున్న ఇక్కడి ఎమ్మెల్యే, ఆయన అనుచరగణం కూడా అదే దారిలో పయనిస్తూ పామర్రు నియోజకవర్గంలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన కొన్ని అభివృద్ధి పనులను కూడా వారి ఖాతాలోకి వేసుకుని ఇది మేమే చేసాం ఇది మేమే చేసాం అని మీడియా ముందు గొప్పలు వాపోతున్నారని అన్నారు. వీరు చెబుతున్న అభివృద్ధి అంతా వీరి మాటల్లోనే తప్ప, క్షేత్ర స్థాయిలో వీరు చేస్తుందంతా ప్రజలకు ఇచ్చిన హామీలని గాలికి వదిలేసి ప్రజలను మోసం చేస్తూ దోచుకో పంచుకో తినుకో అనే తరహాలో నియోజకవర్గంలో ఉన్న వనరులని ఇసుక, మట్టి, రేషన్ బియ్యం ఇలా దోచుకోవడానికి కాదేది అనర్హం అనే రీతిలో ప్రతిదాంట్లో కమిషన్ల రూపంలో దండుకుంటూ ఇక్కడి ఎమ్మెల్యే ఆయన అనుచరులు వారి జేబులు నింపుకుంటూ అభివృద్ధి చెందుతున్నారు. ప్రతిపక్షంగా ప్రజల తరుపున, వారు ప్రజలకు ఇచ్చిన హామీల మీద, వారి దోపిడీ మీద ప్రశ్నిస్తున్న నాపై మా పార్టీ నాయకులు, కార్యకర్తలపై నిరాధారమైన అవినీతి ఆరోపణలు చేస్తూ, అక్రమ కేసులు బనాయిస్తూ భయపెట్టాలని చూస్తున్నారని అన్నారు. గత రెండు సంవత్సరాలుగా రాష్ట్రంలో మరియు నియోజకవర్గంలో ఒక్క క్రొత్త పెన్షన్ ఇచ్చిన పాపాన పోలేదు, ఒక్క క్రొత్త ఇంటి లోన్ ఇచ్చింది లేదు, రైతులకు ఇస్తానన్న అన్నదాత సుఖీభవ పూర్తిగా ఇచ్చింది లేదు , తల్లికి వందనం డబ్బులు పడలేదని ఎంతోమంది తల్లులు ఆఫీస్ ల చుట్టూ తిరిగినా వారి గోడు పట్టించుకునే నాధుడు లేదు, నిరుద్యోగ భృతి ఊసే ఎత్తడం లేదు, ఆడబిడ్డ నిధి అడిగితే పి4 పథకం స్త్రీ శక్తి పథకంతో లింకు పెడుతున్నారు , రాష్ట్రానికి ఇస్తానన్న 20 లక్షల ఉద్యోగాలలో పామర్రుకు ఇప్పటివరకు ఎన్ని ఉద్యోగాలు కల్పించారో తెలియదు , పామర్రుకు తెస్తానన్న సాఫ్ట్ వేర్ కంపెనీ ఎక్కడివరకు వచ్చిందో తెలియదు, పేద ప్రజలకు ఉచితంగా ఇస్తామన్న ఉచిత ఇసుకకు డబ్బులు ఎందుకు చెల్లించాల్సి వస్తుందంటే సమాధానం ఉండదని అన్నారు. ఇలా ఒకటేమిటి ప్రతిదాన్లో వీరు చేసేదంతా దోపిడీ, మోసం, భూ కబ్జాలు , అబద్దపు ప్రచారాలు మించి నియోజకవర్గానికి కొత్తగా చేసిందేమి లేదని అన్నారు. వీరు చేసేదల్లా మా ప్రభుత్వ హయాంలో అనుమతులు తీసుకుని నిధులు మంజూరు చేపించి నిర్మాణాలు చేపట్టిన పామర్రు బస్టాండ్ మరియు హాస్పిటల్ మేమే తెచ్చాము మేమే తెచ్చాము అని క్రెడిట్ చోరీ చెయ్యడమేనని అన్నారు. అందుకే వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ పామర్రు నియోజకవర్గం సమన్వయ కర్తగా ఇక్కడ పనిచేసిన మాజీ ఎమ్మెల్యేగా నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో పర్యటించి గత మా ప్రభుత్వ హయాంలో ఏ గ్రామంలో ఏమేం అభివృద్ధి పనులు చేపట్టామో, సంక్షేమ పథకాల పేరుతో ఒక్కో గ్రామానికి ఎంత లబ్ధి చేకూర్చామో నేనే స్వయంగా ప్రతి గ్రామానికి వెళ్ళి పూర్తి ఆధారాలతో మీడియా ద్వారా ప్రజలకు వాస్తవాలను వివరించాలనుకుంటున్నాని అన్నారు. ఇప్పటికైనా ఇప్పటి ఎమ్మెల్యే, ఆయన అనుచరులు వారి నాయకుడు చంద్రబాబు లాగా అబద్దాలు చెప్పడం క్రెడిట్ చోరీ చేయడం వదిలి, అనుకోని అదృష్టంగా వచ్చిన పదవిని చూసి మురిసిపోకుండా ప్రజాస్వామ్యంలో ఎప్పటికైనా ప్రజలే రారాజులు అనే వాస్తవాన్ని గ్రహించి నోటి దురుసు తగ్గించుకుని ప్రజలకు జవాబుదారీ తనంతో పనిచేయాలని , ప్రతిపక్షాన్ని దూషించడం, మా మీద అక్రమ కేసులు ఎలా పెట్టాలి అనే శ్రద్ధని, అధికారంలోకి రావడానికి ప్రజలకు ఇచ్చిన హామీలని ఎలా నెరవేర్చాలి అనే దానిమీద దృష్టి పెడితే బాగుంటుందని కోరుకుంటున్నానని అన్నారు. క్షేత్ర స్థాయి పర్యటనకు సంబంధించిన వివరాలు మరో రెండు రోజుల్లో ప్రజలందరికి తెలియజేస్తానని తెలిపారు.

## డీలిమిటేషన్ పేరుతో రాష్ట్రానికి అన్యాయం చేయాలనే కుట్ర

గుజ్జుల ఈశ్వరయ్య




**విజయవాడ,ఏప్రిల్18.అక్షర టైమ్స్:–**ఎన్టీఆర్ జిల్లా విజయవాడ గాంధీ నగర్ లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ సమావేశం రాష్ట్ర అధ్యక్షుడు జి. సంతోష్ కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..., డీలిమిటేషన్ పేరుతో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేయాలనే కుట్ర జరుగుతోందని తీవ్రంగా విమర్శించారు. మహిళా రిజర్వేషన్ల ముసుగులో దేశ ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆడిన రాజకీయ నాటకం లోక్‌సభలో పూర్తిగా బట్టబయలై అట్టర్ ఫ్లాప్ అయిందన్నారు. అబద్ధాలు, కుట్రలు, రహస్య అజెండాలతో ప్రజాస్వామ్యాన్ని బలహీనపరచాలన్న మోదీ సర్కార్ యత్నానికి పార్లమెంట్ గట్టి సమాధానం చెప్పిందని పేర్కొన్నారు. డీలిమిటేషన్ ప్రక్రియను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం దేశ సమగ్రతకు, రాష్ట్రాల సమానత్వానికి విరుద్ధమని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలకు జనాభా ప్రమాణాల పేరుతో పార్లమెంట్ ప్రతినిధిత్వాన్ని తగ్గించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రాష్ట్రానికి రావాల్సిన రాజకీయ హక్కులను కోల్పోయేలా చేసే ఈ చర్యకు మద్దతు తెలుపుతున్న ఎన్డీఏ కూటమి, వైఎస్సార్సీపీ నాయకత్వం రాష్ట్ర ప్రజల నమ్మకాన్ని ద్రోహం చేస్తున్నాయని ఆయన ఘాటుగా విమర్శించారు. ఇది కేవలం రాజకీయ వైఫల్యం కాదని, రాష్ట్ర భవిష్యత్తును తాకట్టు పెట్టే ప్రమాదకర నిర్ణయమని స్పష్టం చేశారు. బీహార్, రాజస్థాన్ రాష్ట్రాల్లో కనిపించే బాడుగ కన్నీళ్ల కర్చే "రుదాయలి" సంప్రదాయం మాదిరిగా, ప్రజల బాధలను నాటకంగా మార్చి రాజకీయ లాభాల కోసం నకిలీ కన్నీళ్లు కారుస్తున్న పాలక వర్గాల ద్వంద్వ వైఖరిని ఆయన ఎండగట్టారు. ప్రజల సమస్యలకు నిజమైన పరిష్కారాలు ఇవ్వకుండా భావోద్వేగాలతో మోసం చేయడం దురదృష్టకరమని విమర్శించారు. డీలిమిటేషన్ ప్రక్రియలో రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాలనీ,ప్రజల హక్కులు, రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణ కోసం సీపీఐ నిరంతరం పోరాటంలో ముందుంటునదని స్పష్టం చేశారు. అనంతరం ఏ.ఐ.వై.ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.యుగంధర్ మాట్లాడుతూ..., ఆంధ్రప్రదేశ్‌లో ప్రైవేట్ ఆసుపత్రులు, డయాగ్నస్టిక్ కేంద్రాలు అధిక చార్జీలు వసూలు చేయడం, అవసరం లేని పరీక్షలు చేయించడం, రోగులను దోపిడీ చేయడం వంటి ఘటనలు పెరుగుతున్నాయని ఆరోపించారు. కొంతమంది వైద్యులు, ఆసుపత్రుల అక్రమ చర్యల వల్ల ప్రజలు ఆర్థికంగా, మానసికంగా తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. నకిలీ వైద్యులు, అనధికారిక క్లినిక్‌లు ప్రజల ప్రాణాలతో ఆటలాడుతున్నాయని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిని తక్షణం అరికట్టకపోతే ప్రజల్లో ఆగ్రహం మరింత పెరుగుతుందని హెచ్చరిస్తూ, ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో అఖిల భారత యువజన సమాఖ్య ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఏప్రిల్ 30 తేదిన డ్రగ్స్ కంట్రోల్ కార్యాలయాలు, జిల్లా వైద్యాధికారుల కార్యాలయాల ముందు భారీ ధర్నాలు, నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ప్రైవేట్ ఆసుపత్రుల దోపిడీపై తక్షణ కఠిన చర్యలు తీసుకోవాలి,నకిలీ వైద్య సేవలను పూర్తిగా నిర్మూలించాలి,ప్రభుత్వ వైద్య వ్యవస్థను బలోపేతం చేసి ఉచిత, నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి షేక్ సుభహని, ఆఫీస్ బేరర్స్ కొంగర శ్రీనివాసులు, వై.బాబీ, కొన్న శ్రీనివాస్, లంకా గోవిందరాజులు, పోతుల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## నాగార్జున స్కూల్‌లో వైభవంగా 39వ వార్షికోత్సవ వేడుకలు..

– అలరించిన చిన్నారుల నృత్యాలు, కరాటే విన్యాసాలు








**పొదలకూరు,ఏప్రిల్18.అక్షర టైమ్స్:–**పొదలకూరు పట్టణంలోని నాగార్జున ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో శనివారం రాత్రి నిర్వహించిన 39వ వార్షికోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా, ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. విద్యార్థుల ప్రతిభ, సాంస్కృతిక కాంతులు, తల్లిదండ్రుల సందడి కలిసి ఈ వేడుకలను ప్రత్యేకంగా నిలబెట్టాయి.వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని స్కూల్‌లో నిర్వహించిన వివిధ క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. చదువులో మెరుగైన ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రత్యేకంగా సత్కరించారు. అలాగే లోయర్ క్లాస్ చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించి, చిన్న వయసులోనే విజయానుభూతి కలిగించేలా ప్రశంసా పత్రాలు అందజేయడం ఆకర్షణగా నిలిచింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పొదలకూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ గుత్తి వెంకట్రావు, ఎస్సై షేక్ మహమ్మద్ హనీఫ్, ఎంపీడీవో వి. నరసింహరావు, పాఠశాల వ్యవస్థాపకులు ఎన్. బాలసుబ్రమణ్యం, గాయత్రీ దేవి హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రేరణాత్మక ప్రసంగాలు చేశారు.విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతో పాటు సాంస్కృతిక రంగాల్లో కూడా రాణించాలని సూచించారు.సమావేశం అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు వేడుకలకు హైలైట్‌గా నిలిచాయి. చిన్నారులు ప్రదర్శించిన అందమైన నృత్యాలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. ప్రధానంగా విద్యార్థులు ప్రదర్శించిన కరాటే విన్యాసాలు అందరినీ ఆశ్చర్యానికి గురి చేసి,కరతాళ ధ్వనులు పొందాయి. విద్యార్థుల్లోని ఆత్మవిశ్వాసం, శిక్షణ స్పష్టంగా ప్రతిబింబించింది.ఈ వేడుకలను పాఠశాల కరస్పాండెంట్లు ఎం.వి. సుధాకర్ రెడ్డి, అన్నం సుబ్బారావు, అకడమిక్ ఇన్‌చార్జ్‌లు ఏ. చంద్రశేఖర్ యాదవ్, జి.ఎన్. రెడ్డి, జి.వి.ఆర్., పాపయ్య, కృష్ణ, ప్రిన్సిపల్ ఎన్. లక్ష్మీ దుర్గలు సమర్థవంతంగా పర్యవేక్షించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది కృషితో కార్యక్రమం విజయవంతమైంది. విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరై వేడుకలను మరింత ఉత్సాహభరితంగా మార్చారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ పాఠశాల యాజమాన్యం హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపింది.నాగార్జున స్కూల్ వార్షికోత్సవం విద్యార్థుల్లో దాగిన ప్రతిభను వెలికితీసిన, సాంస్కృతిక వేడుకగా నిలిచి పలువురి మన్ననలను పొందింది.

## మహిళా రిజర్వేషన్లపై కేంద్రానిది 'రాజకీయ కపట నాటకం"

: ఏఐవైఎఫ్ నేత గంట మమత



**విజయవాడ,ఏప్రిల్18.అక్షర టైమ్స్:–** పార్లమెంట్ మరియు రాష్ట్ర అసెంబ్లీలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లు అమలు విషయంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును విజయవాడ గాంధీ నగర్ లోని పార్టీ కార్యాలయం నుండి అఖిల భారత యువజన సమాఖ్య జాతీయ సమితి (ఏఐవైఎఫ్) సభ్యురాలు గంట మమత తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..., శుక్రవారం జరిగిన పరిణామాలను గమనిస్తే ఎవరు, ఏ రాజకీయ పార్టీ మహిళా రిజర్వేషన్ ను వ్యతిరేకించటం లేదని, కేవలం బిల్లు ప్రవేశపెట్టిన సందర్భాన్ని మాత్రమే వ్యతిరేకించారని తెలిపారు. బోడి గుండుకి – బట్టతలకు ముడి పెట్టిన చందంగా డిలిమిటేషన్, జనగణనకు ముడి పెడుతూ ఉమ్మడి బిల్లును పార్లమెంటు ముందుకు తీసుకువచ్చి డిలిమిటేషన్ విధానంపై వ్యతిరేకంగా జరిగిన ఓటింగ్ ప్రక్రియలో గెలవకపోతే మహిళా రిజర్వేషన్ బిల్లుని ప్రతిపక్షాలు అడ్డుకున్నాయని సిగ్గు లేకుండా ప్రచారం చేస్తూ ఎన్నికల్లో రాజకీయ లబ్ధి పొందాలని చూస్తుందని ఆమె అన్నారు. బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున విధానం కేవలం మహిళా బిల్లు అమలును జాప్యం చేసేలా కేంద్రం చేస్తున్న ప్రయత్నాలలో భాగమే అని, ఇది ముమ్మాటికి మహిళా లోకాన్ని వంచించడమేనని ఆమె ధ్వజమెత్తారు. "మహిళా సాధికారత గురించి గొప్పలు చెప్పే మోదీ ప్రభుత్వం, తీరా ఓటింగ్ సమయానికి వచ్చేసరికి కుంటి సాకులు చెబుతూ బిల్లును నీరుగార్చడం సిగ్గుచేటని తెలిపారు. మహిళల ఓట్లు కావాలి కానీ, వారికి చట్టసభల్లో అధికారం ఇవ్వడానికి బిజెపికి మనసు రావడం లేదు" అని మండిపడ్డారు. ఇది ముమ్మాటికి రాజకీయ కుట్రే నని, "డీలిమిటేషన్ (నియోజకవర్గాల పునర్విభజన), జనగణన పేరుతో రిజర్వేషన్లను 2029 వరకు లేదా అంతకంటే ఎక్కువ కాలం వాయిదా వేయాలని చూడటం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలకు తక్షణమే రిజర్వేషన్లు కల్పించాలనే చిత్తశుద్ధి ఈ ప్రభుత్వానికి లేదని, దశాబ్దాలుగా మహిళలు పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాయడం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టని తెలిపారు. పాలకవర్గాలు కేవలం ఎన్నికల స్టంట్లుగా మహిళా రిజర్వేషన్లను వాడుకుంటున్నాయి తప్ప, క్షేత్రస్థాయిలో అన్యాయానికి గురవుతున్న మహిళల అభివృద్ధి గురించి పట్టించుకోవడం లేదని అన్నారు. మహిళల పట్ల వివక్ష చూపిస్తూ, వారి రాజకీయ ఎదుగుదలను అడ్డుకుంటున్న బిజెపి ప్రభుత్వానికి రానున్న రోజుల్లో మహిళా లోకం తగిన బుద్ధి చెబుతుందని హెచ్చరించారు.

# శనివారం వచ్చిందంటే కూల్చివేతలే

**వీధి వ్యాపారులకు దడ పుట్టిస్తున్న బుల్డోజర్లు**
**ప్రతి శనివారం స్పెషల్ డ్రైవ్ పేరుతో ఫుట్‌పాత్‌పై ఆక్రమణల తొలగింపు**
**ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టేందుకు సర్కార్ నిర్ణయం**
**చిరు వ్యాపారాలకు ఇబ్బంది తలెత్తకుండా తొలగించాలన్న సీఎం సూచనలు బుట్టదాఖలు**



రాష్ట్ర రాజధానిలో బుల్డోజర్ల చప్పుడు అక్రమార్కుల్లోనే కాదు వీధి వ్యాపారుల గుండెల్లోనూ దడ పుట్టిస్తోంది. ఓ వైపు ప్రభుత్వ స్థలాలు, చెరువుల్లో ఆక్రమణలపై హైడ్రా ఉక్కుపాదం మోపుతుంటే, మరోవైపు ఫుట్‌పాత్‌ల ఆక్రమణలపై కూడా మూడు మున్సిపల్ కార్పొరేషన్లు ముప్పేట దాడి చేస్తున్నాయి. ప్రతి శనివారం స్పెషల్ డ్రైవ్ పేరుతో నిర్వహిస్తోన్న ఈ కూల్చివేతల పరంపరతో వేలాది మంది వీధి వ్యాపారుల జీవితాలు చిన్నాభిన్నం అవుతున్నాయి.

**ఫుట్‌పాత్‌లపై అక్రమ నిర్మాణాల తొలగింపు :** అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పిన మాటలకు క్షేత్రస్థాయిలో అధికారులు చేపడుతున్న చర్యలకు ఏ మాత్రం పొంతన లేదనడానికి ఈ దృశ్యాలే నిదర్శనం. నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడంలో భాగంగా ఫుట్‌పాత్‌ల ఆక్రమణలపై దృష్టి సారించిన ప్రభుత్వం, అంచెలంచెలుగా వాటిని తొలగించాలని నిర్ణయించింది. అదే సమయంలో బతుకుదెరువు కోసం ఫుట్‌పాత్‌లపై చిరు వ్యాపారాలు చేసుకునే వారికి ఇబ్బంది తలెత్తకుండా వారికి ప్రత్యామ్నాయం చూపించి, ఆక్రమణలను తొలగించాలని సీఎం ఆదేశించారు. ఆ ఆదేశాలను బుట్టదాఖలు చేస్తూ హైకోర్టు ఉత్తర్వుల పేరుతో ప్రధాన రహదారుల్లో కాకుండా వీధుల్లోని చిరు వ్యాపారులపై జీహెచ్ఎంసీ, సీఎంసీ, ఎంఎంసీ అధికారులు తమ ప్రతాపాన్ని చూపిస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులతో కలిసి ప్రతి శనివారం ఫుట్‌పాత్‌లపై ఉన్న వీధి వ్యాపారుల దుకాణాలు, షెడ్లను నేలమట్టం చేస్తూ వారి జీవితాలను చిన్నాభిన్నం చేస్తున్నారు.

**ఒక్కరోజే 798 దుకాణాలు, డబ్బాల తొలగింపు :** నగరంలో ఏళ్ల తరబడి ఫుట్‌పాత్‌లపై చిరు వ్యాపారం చేస్తూ జీవిస్తున్న వారి ఆవేదన మాటల్లో వర్ణించలేనిది. ఉన్నఫలంగా వారి జీవనోపాధిని దెబ్బ తీస్తే ఎలా బతకాలని ప్రశ్నిస్తున్నారు. ప్రధాన రహదారుల్లో లేని ట్రాఫిక్ సమస్య వీధుల్లో ఎలా వస్తుందని నిలదీస్తున్నారు. తమకు జరిగిన అన్యాయానికి ఎవరు బాధ్యత వహిస్తారని ఘాటుగా నిందిస్తున్నారు. ఏప్రిల్ 4 నుంచి ట్రై కార్పొరేషన్ల పరిధిలో ఫుట్‌పాత్ ఆక్రమణలపై విరుచుకుపడుతున్న అధికారులు, జీహెచ్ఎంసీ పరిధిలో ఒక్కరోజే 798 దుకాణాలు, డబ్బాలను తొలగించారు.

**పాదచారుల హక్కులను కాపాడుతున్న అధికారులు :** మియాపూర్, కూకట్‌పల్లి, శ్రీనగర్ కాలనీ, ఎంజీ మార్కెట్ ఇలా చాలా ప్రాంతాల్లో ఫుట్‌పాత్ ఆక్రమణలపై దృష్టి సారించిన మున్సిపల్ ఉన్నతాధికారులు స్థానిక ట్రాఫిక్ పోలీసుల సహకారంతో బుల్డోజర్లతో విరుచుకుపడుతూ దుకాణాలను ధ్వంసం చేస్తున్నారు. కూల్చివేసి 11 రోజులు గడిచినా, ఫుట్‌పాత్‌లపై ధ్వంసమైన శిథిలాలను తొలగించడంలో మాత్రం అడుగడుగునా నిర్లక్ష్యమే కనిపిస్తోంది. ఆక్రమణలు తొలగించి పాదచారుల హక్కులను కాపాడుతున్నామని అధికారులు చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం ఆ హక్కులు ఎక్కడా కనిపించడం లేదు. "ఫుట్‌పాత్ ఆక్రమణ తొలగింపు అనేది ప్రతి శనివారం చేస్తాం. ఫుట్‌పాత్‌పై బిజినెస్ చేస్తున్న దుకాణాలను తప్పకుండా తీసేస్తాం. వీధి వ్యాపారులకు మాత్రం ప్రత్యామ్నాయం చూపించి ఆక్రమణలను తొలగిస్తాం. ఈ కూల్చివేతలు ఫుట్‌పాత్‌పై నడిచే వారి సేఫ్టీ కోసం చేస్తున్నాం. దీనికి హైకోర్టు కూడా ఉత్తర్వులు ఇచ్చింది" - ఆర్వీ కర్ణన్, జీహెచ్ఎంసీ కమిషనర్

**నగరంలో 4,133 ఆక్రమణలు గుర్తింపు :** గతంలో జరిపిన సర్వే ప్రకారం నగరంలోని దాదాపు 127 కిలోమీటర్ల పొడవైన 48 ప్రధాన రహదారుల వెంట సుమారు 4,133 ఆక్రమణలను అధికారులు గుర్తించారు. ఇటీవల జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్‌తో పాటు హైదరాబాద్ కమిషనర్ సజ్జనార్ షేక్‌పేట నుంచి మాసబ్‌ట్యాంక్ రోడ్డును పరిశీలించారు. అక్కడి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు రోడ్డుకు ఇరువైపులా 7 కిలోమీటర్ల మేర ఆక్రమణలను తొలగించాలని నిర్ణయించారు. ఇప్పటికే నగరంలోని కీలక ప్రాంతాల్లో ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్న క్రమంలో ఈ శనివారం నగర వీధి వ్యాపారుల నుంచి ఎలాంటి ప్రతిఘటనలు ఎదురవుతాయనేది చూడాలి.

# భోజనంలో అన్నమే తింటారా ఇంకా ఏమైనా తీసుకుంటారా

**'జనగణన'లో ఈ ప్రశ్నకు కచ్చితమైన ఆన్సర్ ఇవ్వాల్సిందే**
**జనగణనలో ప్రజల భోజన అలవాట్లపై ఆరా**
**మొత్తం 34 ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాలి**
**ఈ నెల 26 నుంచి వచ్చే నెల 10 వరకు వివరాలు ఆన్‌లైన్‌లో నమోదుకు అవకాశం**



మీరు రోజూ తీసుకునే ఆహారంలో భాగంగా వరి అన్నం, గోధుమ రొట్టెలు కాకుండా సజ్జలు, జొన్నలు, మక్కలు లాంటి తృణ ధాన్యాలేమైనా తీసుకుంటారా? త్వరలో జరగబోయే జనాభా లెక్కల్లో ఈ ప్రశ్నకు ప్రతి కుటుంబం కూడా తప్పనిసరిగా సమాధానం తెలియజేయాల్సి ఉంటుంది. జనగణనలో భాగంగా ఈసారి కేంద్ర ప్రభుత్వం ఈ వివరాలను ప్రత్యేకంగా సేకరిస్తోంది. రేషన్‌కార్డులపై ప్రస్తుతం బియ్యం, గోధుమల పంపిణీనే ఎక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో దేశ చరిత్రలోనే తొలిసారిగా ఈ జనగణనలో వీటి వివరాలనూ సేకరించాలని నిర్ణయించింది. ఈ ఐదు మాత్రమే కాకుండా వేరే ఆహారం అయితే ఇతరాలు అని ఎంటర్ చేయాల్సి ఉంటుంది.ప్రజల ఆహారపు అలవాట్ల ఆధారంగా రేషన్‌కార్డులపై పంపిణీ చేయాల్సిన వాటిని నిర్ణయించాలన్న యోచనలో కేంద్ర ప్రభుత్వం ఉన్నట్లుగా సమాచారం. ఈ నెల 26వ తేదీ నుంచి వచ్చే నెల 10 వరకు ఆన్‌లైన్‌లో వివరాల నమోదుకు అవకాశం ఉండగా, రాష్ట్ర ప్రజలు మొత్తం 34 ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ వ్యక్తిగత వివరాలను ౦వ.ఎవఅంబం.స్త్రశీజ.అఅ పోర్టల్‌లో కుటుంబ యజమాని లేదా యజమాని తరఫున ఫ్యామిలీ మెంబర్లు ఎవరైనా నమోదు చేయాలి. కుటుంబంలో ఎవరో ఒకరి స్మార్ట్‌ఫోన్ నంబర్‌ను తప్పనిసరిగా ఇవ్వాల్సి ఉంటుంది. ఈ విధంగా నమోదు చేసినా, చేయకున్నా వచ్చే నెల 11వ తేదీ నుంచి జూన్ 9లోగా గణకులు ప్రతి ఇంటికి వస్తారు. ప్రజలు అప్పటికే వ్యక్తిగతంగా నమోదు చేస్తే అవి వాస్తవమా కాదా అనేది తనిఖీ చేసి కుటుంబ యజమాని సంతకాన్ని తీసుకుంటారు. నమోదు చేయనట్లయితే వివరాలను అడిగి తెలుసుకొని ఆన్‌లైన్‌లో ఎంటర్ చేస్తారు.

**ఎస్సీ, ఎస్టీలపై :** జనాభాలో ఎస్సీ (షెడ్యూల్డ్ క్యాస్ట్), ఎస్టీలు (షెడ్యూల్డ్ ట్రైబ్) ఎందరు? వారు ఏ మతాల్లో ఉన్నారనే వివరాలను కూడా పక్కాగా సేకరిస్తారు. హిందూ, బౌద్ధ, సిక్కు మతంలో ఉన్న దళిత వర్గాలనే ఎస్సీలుగా నమోదు చేయాలని, ఇతర మతంలో ఉన్నవారిని ఈ కేటగిరీలో ఎంటర్ చేయవద్దని 13వ ప్రశ్నలో కేంద్రం స్పష్టమైన ఆదేశాలిచ్చింది. గిరిజనులు ఏ మతంలో ఉన్నప్పటికీ వారిని ఎస్టీ అని నమోదు చేయాలని సూచించింది.ఇంటికి గ్యాస్ కనెక్షన్ ఉందా? ఉంటే సిలిండర్ ఆధారంగానే వంట చేస్తున్నారా లేదంటే కిరోసిన్, కట్టెల పొయ్యి, బయోగ్యాస్ లాంటి ఇతర వంట చెరకును వినియోగిస్తున్నారా అని ఈసారి స్పష్టమైన సమాధానం సేకరిస్తున్నారు. గతంలో జరిగిన జనాభా లెక్కల్లో గ్యాస్ కనెక్షన్ ఉందా లేదా అని మాత్రమే అడిగేవారు.

**ఇల్లు ఎక్కడున్నా చెప్పాలి :** కొంతమందికి వేరేచోట సొంత ఇల్లు ఉన్నప్పటికీ, ఉపాధి రీత్యా మరో ప్రాంతంలో నివసిస్తూ అక్కడ అద్దె ఇంట్లో ఉంటారు. ఇలాంటి వారు అద్దె ఇంట్లో నివసిస్తున్నట్లు చెప్పినా, దేశంలో మరెక్కడైనా సొంత ఇల్లు ఉందా లేదా అనేది స్పష్టమైన సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. దీనివల్ల సొంత ఇల్లు ఉన్నవారు ఎందరు? లేనివారు ఎందరు అనేది తేల్చడానికి ఈ సమాచారం రాబట్టాలని కేంద్రం నిర్ణయించింది.రేడియో వింటున్నారా? సొంత రేడియో సెట్ ఉందా? లేదా స్మార్ట్‌ఫోన్‌లో ఉన్న రేడియోను వింటున్నారా? అనేది తప్పనిసరిగా తెలపాలి. (ప్రధానమంత్రి నిర్వహిస్తున్న మన్‌కీ బాత్ నేపథ్యంలో ఈ ప్రశ్న అడుగుతున్నట్లు తెలుస్తోంది). ఈ నెల ఒకటి నుంచి పలు కేంద్రపాలిత ప్రాంతాలు, 10 రాష్ట్రాల్లో ఆన్‌లైన్‌లో వ్యక్తిగతంగా నమోదు ప్రారంభమైంది. తాజాగా బిహార్ రాష్ట్రంలో శుక్రవారం ప్రారంభించారు. బంగాల్, గుజరాత్, ఝార్ఖండ్ మినహా మిగిలిన రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలన్నింటికీ జనగణన షెడ్యూలును కేంద్రప్రభుత్వం తాజాగా విడుదల చేసింది.

# 'భూమి ఇప్పించండి అమ్మమ్మల కాలం నాటి వంట రుచులు చూపిస్తాం'

**ప్రతి జిల్లాలో రైతు సంఘాలకు ఐదు ఎకరాల భూమిని లీజుకు ఇవ్వండి**
**తెలుగు సంస్కృతిని ప్రదర్శించే ఏర్పాట్లు చేస్తాం**



ముఖ్యమంత్రికి తమ ప్రతిపాదనను వివరించిన విజయ్ రామ్

జాతీయ రహదారుల వెంబడి ప్రతి జిల్లాలోనూ రైతు సంఘాలకు ఐదు ఎకరాల భూమిని లీజు ప్రాతిపదికన కేటాయించండి. అమ్మమ్మల కాలం నాటి స్వచ్ఛమైన ఇంటి వంట రుచులను అందిస్తామని 'సేవ్ ఫౌండేషన్' వ్యవస్థాపకుడు విజయ్ రామ్ ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి స్పష్టం చేశారు. 'మా భూమి, మా పంటలు, మా వంటలు' అనే మా నినాదానికి మీ మద్దతును అందించండి. ప్రతి జిల్లాలో హైవేల వెంబడి ఇచ్చే భూమిలో 'తెలుగుదనం' (తెలుగు సంస్కృతి సారం) అనే శీర్షికన 600 రకాల ఆంధ్ర వంటకాలను పరిచయం చేస్తామని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హయాంలో రైతు బజార్లు, శిల్పారామాలను స్థాపించడం ద్వారా చంద్రబాబు మన వ్యవసాయానికి, సంస్కృతికి అపారమైన మద్దతును అందించారని ఆయన గుర్తు చేశారు. ఇప్పుడు ఈ 'తెలుగుదనం' వేదికల ఏర్పాటుకు కూడా అటువంటి సహకారాన్నే అందించాలని ఆయన ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. సుభాష్ పాలేకర్ ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని మొట్టమొదటగా సూచించింది, ప్రోత్సహించింది చంద్రబాబేనని కూడా ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు.

**చంద్రబాబుకు 35 రకాల ఉత్పత్తుల బహూకరణ :** చిత్తూరుకు చెందిన ప్రవాస తెలుగు మహిళ ఝాన్సీ లక్ష్మీబాయి, విజయ్ రామ్ సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి తమ ప్రతిపాదనలను సమర్పించి వాటి గురించి వివరించారు. ఈ 'తెలుగుదనం' కేంద్రాల ద్వారా ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయానికి ఒక వేదికను కల్పించడం వల్ల రైతు సమాజానికి ఎంతో మేలు జరుగుతుందని వారు చెప్పారు. ఈ సందర్భంగా మచిలీపట్నం సమీపంలోని తారకటూరులో ఉన్న ఒక వ్యవసాయ క్షేత్రంలో పండించిన 35 రకాల ఉత్పత్తులను వారు చంద్రబాబుకు బహూకరించారు. ఆ వ్యవసాయ క్షేత్రాన్ని తాను స్వయంగా సందర్శిస్తానని ముఖ్యమంత్రి తమకు హామీ ఇచ్చారని విజయ్ రామ్ తెలిపారు. విశాఖపట్నంలో మా వంటకాలకు అపారమైన ఆదరణ లభిస్తుందని వెల్లడించారు."గత రెండేళ్లుగా మేము విశాఖపట్నంలో ఒక 'ఆహార ఉత్సవం' (భోజన పండుగ) నిర్వహించి అనేక రకాల వంటకాలను పరిచయం చేశాం. దీనికి అద్భుతమైన స్పందన లభించింది. ఏప్రిల్ 1 నుంచి 5వ తేదీ వరకు 'సబల' అనే పేరుతో జరిగిన ఈ కార్యక్రమానికి 50,000 మంది ప్రజలు హాజరయ్యారు. మా సంప్రదాయ వంటకాల పట్ల ప్రజలకు ఎంత ఆసక్తి ఉందో చెప్పడానికి ఇదే స్పష్టమైన నిదర్శనం." - విజయ్ రామ్, సేవ్ ఫౌండేషన్' వ్యవస్థాపకుడు

**తయారీలపై పూర్తి శిక్షణ :** 'తెలుగుదనం' (తెలుగు సంస్కృతి సారం) కేంద్రాల ఏర్పాటు ప్రణాళికల గురించి వివరిస్తూ, తెలుగు ప్రజలకు మాత్రమే ప్రత్యేకమైన సుమారు 600 రకాల వంటకాలను ఎలా తయారు చేయాలో ఈ కేంద్రాల ద్వారా నేర్పిస్తామని ఆయన తెలిపారు. ఏ సీజన్‌లో ఏ విధమైన ఆహారం తీసుకోవాలనే దానిపై మార్గదర్శకత్వం అందిస్తాం. సంప్రదాయ పిండివంటలు, ఊరగాయల తయారీ, ఎద్దుల సహాయంతో నడిచే గానుగల ద్వారా కోల్డ్-ప్రెస్డ్ నూనెల ఉత్పత్తి, మట్టి బొమ్మలు, కుండల తయారీ, అలాగే బుట్టలు, తాటి ఆకు మంచాల అల్లిక వంటి అంశాలలో శిక్షణ ఇస్తాం. జానపద కళలు, తెలుగు కవిత్వం, మహనీయుల వీరగాథల గురించి తెలుసుకోవడానికి వేదికలుగా ఈ కేంద్రాలను రూపొందిస్తాం. అంతేకాకుండా గో-ఆధారిత వ్యవసాయం, వర్షపు నీటి సంరక్షణ, స్థానిక విత్తనాల పరిరక్షణ, దేశవాళీ పశు జాతుల పెంపకం, సుస్థిర పాడి పరిశ్రమ నమూనాలపై నిరంతర శిక్షణ అందిస్తామని ఆయన వెల్లడించారు.

**అన్ని ప్రధాన కార్యక్రమాలకు ఆతిథ్యం :** జిల్లా పరిధిలో జరిగే అన్ని ప్రధాన కార్యక్రమాలకు ఈ కేంద్రాలే వేదికలుగా నిలిచేలా సంస్థ ఏర్పాట్లు చేస్తుంది. సంప్రదాయ 'పెళ్లి చూపులు, పర్యావరణ హిత వివాహాలు, 'సీమంతం', 'ఉయ్యాల పండుగ', పుట్టినరోజు వేడుకలు, పదవీ విరమణ సన్మాన సభలు వంటి వివిధ సందర్భాల కోసం ఈ ప్రాంగణాలను వినియోగించుకోవచ్చని చెప్పారు. ప్రతి జిల్లాలోనూ ఈ కేంద్రాల నిర్వహణను ఒక ×ూూ అధికారి పర్యవేక్షించేలా చూడటం అత్యంత ఆవశ్యకం అని విజయ్ రామ్ వివరించారు.

# ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు చెల్లించాలి : పరుచూరి రాజేంద్ర బాబు

**- అక్రమ అడ్మిషన్లు నిర్వహిస్తున్న విద్యాసంస్థలపై చర్యలు ఏవీ.?**



**విజయవాడ,ఏప్రిల్18.అక్షర టైమ్స్:**-ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని స్థానిక గాంధీనగర్ కార్యాలయంలో రైట్స్ ఫర్ యూత్ అండ్ స్టూడెంట్స్ ఫోరమ్ (ఆర్ వై ఎస్ ఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్ర బాబు మరియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చామల లక్ష్మారెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో పెండింగ్లో ఉన్న ఫీజురియంబర్స్ మెంట్ బకాయిలు 6,400 కోట్లు తక్షణమే విడుదల చేయాలని రైట్స్ ఫర్ యూత్ అండ్ స్టూడెంట్స్ ఫోరమ్ (ఆర్ వై ఎస్ ఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్ర బాబు కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..., రాష్ట్రంలో పెండింగ్లో ఉన్నటువంటి ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 23 నెలల కాలంలో ఒక్కసారి మాత్రమే ఫీజు రీయింబర్స్మెంట్ ఇచ్చారని, ఇంకా సుమారుగా 7 క్వార్టర్స్ బకాయిలు 6,400 కోట్లు పెండింగ్ లో ఉన్నాయని అన్నారు. ఒక పక్క రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఫీజులు అడిగిన కాలేజీల వివరాలు ఇవ్వండి చర్యలు తీసుకుంటామని చెప్తున్నా కూడా విద్యాసంస్థలు యాజమాన్యాలు అండర్ టేకింగ్ లెటర్స్ తీసుకోవడం తో పాటు ఫీజు చెల్లించక పోతే పరీక్షలకు, ల్యాబ్ లకు అనుమతించమని విద్యార్థులను వేధిస్తున్నటువంటి పరిస్థితులు ఉన్నాయన్నారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ప్రభుత్వం బకాయిలు చెల్లించాలని, విద్యార్థులను వేధింపులకు గురి చేస్తున్న విద్యాసంస్థలపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో విద్యా సంవత్సరం ముగియక ముందే కొన్ని విద్యాసంస్థలు, పాఠశాలలు,కాలేజీలు, యాజమాన్యాలు ముందస్తు అడ్మిషన్ లు నిర్వహిస్తున్నారని పిఆర్ ఓ ల ద్వారా ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తూ రాయితీలు కల్పిస్తామంటూ మభ్యపెడుతూ తల్లిదండ్రులను ప్రలోభాలకు గురి చేయడం జరుగుతుందనీ ఒక సంస్థ పేరుతో అనుమతి పొంది బ్రాంచీలను నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం జరుగుతున్న అధికారులు మొద్దు నిద్ర నటిస్తున్నారని అన్నారు. అక్రమ అడ్మిషన్లు నిర్వహిస్తున్న సంబంధిత విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఆర్ వై ఎస్ ఎఫ్ రాష్ట్ర నాయకులు పటమట నరేష్, రెమల్లి రవీంద్ర బాబు, సోమయ్య, నాగేంద్ర పాల్గొన్నారు

# రోజూ 125 టన్నుల వ్యర్థాలు ఐదు టన్నుల బయోగ్యాస్ ఉత్పత్తి

**వంట గ్యాస్ కొరతకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు**
**ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య విధానంలో కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్లు**
**తొలి దశలో హోటళ్లకు సరఫరా**
**రూ.59.63 కోట్లతో ప్రణాళిక**



అమెరికా, ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం కారణంగా వంట గ్యాస్ కొరత నెలకొని క్షేత్రస్థాయిలో ప్రజలు అనేక కష్టాలను ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో గ్యాస్ సిలిండర్‌కు ప్రత్యామ్నాయంగా కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. రాష్ట్రంలోని ఐదు ప్రాంతాల్లో పీపీపీ (ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య) విధానంలో వీటిని ఏర్పాటు చెయ్యాలని నిర్ణయించింది.వ్యర్థాల నుంచి బయోగ్యాస్ ఉత్పత్తి చేసి వాణిజ్య అవసరాలకు సరఫరా చేయనుంది. పలు రాష్ట్రాల్లో విజయవంతంగా నిర్వహిస్తున్న కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్ల తరహాలో రాష్ట్రంలో రూ.59.63 కోట్లతో నెల్లూరు, ఒంగోలు, గుంటూరు, రాజమహేంద్రవరం, విజయవాడలో ఏర్పాటు చేయనున్నట్లు సంబంధిత అధికారులు తెలుపుతున్నారు.

**టెండర్లకు ఆహ్వానం:** ఇందులో రూ. 12.50 కోట్లు కేంద్ర ప్రభుత్వం గ్రాంట్‌గా ఇవ్వనుంది. రూ. 8.30 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చనుంది. పుర, నగరపాలక సంస్థలు రూ. 17 కోట్లు అందిస్తాయి. మిగిలిన రూ. 21.83 కోట్లు ప్లాంట్ల ఏర్పాటుకు ముందుకొచ్చిన ప్రైవేట్ సంస్థలు పెట్టనున్నాయి. ఆసక్తిగల సంస్థలను ఆహ్వానిస్తూ రాష్ట్ర స్వచ్ఛాంధ్ర సంస్థ టెండర్లు పిలిచింది.

**చెత్త సేకరణ ఇలా:** ఒక్కో ప్లాంట్‌కు రోజూ 25 టన్నుల చొప్పున ఐదు ప్లాంట్లకూ కలిపి 125 టన్నుల వ్యర్థాలు అవసరం. ఇందుకోసం నగరాల్లో మార్కెట్‌లు, హోటళ్లు, హాస్టళ్లు, కమ్యూనిటీ హాళ్ల నుంచి ఆహారం, కూరగాయల వ్యర్థాలు రోజూ తరలించనున్నారు. టౌన్‌షిప్‌లు, భారీ అపార్ట్‌మెంట్ల నుంచి కూడా వీటిని సేకరిస్తారు. ఘన వ్యర్థాల నిర్వహణ విధానం-2026 కొత్త నిబంధనల ప్రకారం రోజూ 100 కిలోల పొడి వ్యర్థాలు వచ్చే టౌన్‌షిప్‌లలో వాటిని ఎరువుల కింద విధిగా తయారు చేయాలి. లేనప్పుడు నగరపాలక సంస్థలకైనా సరఫరా చేయాలి.అందువల్ల ఇలాంటి వాటి నుంచి కూడా రోజూ పొడి వ్యర్థాలు ప్లాంట్లకు తరలించనున్నారు. రోజూ 125 టన్నుల వ్యర్థాలు వినియోగించి ఐదు ప్లాంట్లలో ఐదు టన్నుల బయో గ్యాస్ ఉత్పత్తి చేయనున్నారు. ప్రాథమిక దశలో హోటళ్లకు, రెండో దశలో ఇతర వాణిజ్య సంస్థలకు అందిస్తారు. దేశవ్యాప్తంగా 132 ప్లాంట్లలో రోజూ 120 టన్నుల గ్యాస్ ఉత్పత్తి చేసి సరఫరా చేస్తున్నారు. రాష్ట్రంలోనూ దశలవారీగా ప్లాంట్ల సంఖ్యను పెంచాలని ప్రభుత్వం యోచిస్తోంది. ప్రైవేట్ ప్లాంట్లను ప్రోత్సహించనుంది. స్వచ్ఛ కార్యక్రమాల్లో ఇదో కీలక ముందడుగని స్వచ్ఛాంధ్ర సంస్థ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరాం అభిప్రాయపడ్డారు.ప్లాంట్లతో మేలు జరుగుతుందిలా: ప్లాంట్లకు చెత్త సరఫరా చెయ్యడం ద్వారా నగరాల్లో వ్యర్థాల సమస్యకు పరిష్కారం దొరుకుతుంది. ఎల్పీజీ వినియోగం తగ్గించడానికి దోహదపడుతుంది. డంపింగ్ యార్డులకు చెత్త తరలించే పరిస్థితి తగ్గుతుంది. సతత్ పథకం కింద కేంద్రం నిధులను సద్వినియోగం చేసుకుంటుంది.

# రాష్ట్రంలో రోజువారీ కూలీల్లో ఎస్సీలే అధికం

**13 శాతం మందికి నో టాయిలెట్స్**
**బీసీల్లో జనాభాకు తగ్గట్టుగా దినసరి కూలీలు**



రాష్ట్రంలోని ఎస్సీల్లో రోజువారీ కూలీలే అత్యధిక సంఖ్యలో ఉన్నారని సమగ్ర కుటుంబ సర్వే నివేదిక వెల్లడించింది. షెడ్యూల్డ్ కులాల వారిలో 25 శాతం మంది దినసరి కూలీలుగా, 29 శాతం మంది ఉపాధి హామీ పథకాల కింద కూలీలుగా, 27 శాతం మంది వ్యవసాయ కూలీలుగా పని చేస్తున్నారు. కేవలం 11 శాతం మంది మాత్రమే స్వయంగా సాగు చేసుకునే రైతులు ఉన్నారు. మొత్తం జనాభాలో 17.4 శాతంగా ఉన్నప్పటికీ వివిధ రంగాల్లో దీనికి తగినంత ప్రాతినిధ్యం లేదు. 7 శాతం మంది మాత్రమే వ్యాపారాలు లేదా అనుబంధ రంగాల్లో వారి పని వారు చేసుకుంటున్నారు.

**తక్కువ వేతనాలు వచ్చే వృత్తులపైనే జీవనం :** ఇక షెడ్యూల్డ్ తెగల విషయానికి వస్తే 13 శాతం మంది రోజువారీ కూలీలుగా, 12 శాతం మంది ఉపాధి హామీ పథకాల కింద కూలీలుగా, 17 శాతం మంది వ్యవసాయ కూలీలుగా పని చేస్తున్నారు. 23 శాతం మంది స్వయంగా సాగు చేసుకునే రైతులుగా ఉన్నారు. ఇక మొత్తం జనాభాలో 10.3 శాతంగా ఉన్న ఎస్టీ విభాగంలో 17 శాతం మంది వ్యవసాయ కూలీలుగా, 13 శాతం మంది రోజువారీ కూలీలుగా, 12 శాతం మంది ఉపాధి హామీ పథకాల కింద కూలీలుగా పని చేస్తున్నారనే విషయాన్ని పరిగణనలోకి తీసుకుంటే అత్యధిక శాతం మంది తక్కువ వేతనాలు వచ్చే వృత్తులపైనే ఆధారపడి జీవిస్తున్నారని స్పష్టమవుతోంది. వీరిలో 3 శాతం మందికి మాత్రమే మధ్యతరహా లేదా భారీ స్థాయి వ్యాపారాలు సొంతంగా ఉన్నాయి.

**బీసీల్లో జనాభాకు తగ్గట్టుగా :** ఇక బీసీల విషయానికొస్తే వీరు మొత్తం జనాభాలో 52.6 శాతంగా ఉన్నారు. ఇందులో రోజువారీ కూలీలుగా పని చేసేవారిలో వీరి వాటా 58 శాతంగా ఉంది. అదేవిధంగా ఉపాధి హామీ పనుల్లో 58 శాతం కాగా, వ్యవసాయ కూలీల్లో 52 శాతంగా ఉంది. సాగుదారులుగా ఉన్న వారిలో బీసీలు 54 శాతం ఉన్నారు. వ్యాపార రంగంలో కూడా వీరి ప్రాతినిధ్యం గణనీయంగా ఉండటంతో 53 శాతంగా నమోదైంది. ప్రభుత్వ ఉద్యోగాల్లో వీరి వాటా 54 శాతం కాగా, ప్రైవేటు రంగ ఉద్యోగాల్లో 53 శాతంగా ఉంది. భారీ పరిశ్రమలు, మధ్య తరహా పరిశ్రమలు, వ్యాపార సంస్థల్లోని మొత్తం వీరు 53 శాతం ఉన్నారని నివేదికలో పేర్కొంది.

**ఓసీల్లో 4 శాతం మాత్రమే :** ఓపెన్ కేటగిరీల విషయానికి వస్తే రోజువారీ కూలీలు, ఉపాధి హామీ కార్మికులు, వ్యవసాయ కూలీల్లో వీరి వాటా కేవలం 4 శాతం మాత్రమే. సాగుదారులతో అయితే 12 శాతం, వ్యాపారాల్లో 39 శాతం, ప్రభుత్వ ఉద్యోగాల్లో 19 శాతం, ప్రైవేటు రంగంలో 29 శాతంగా ఉంది. రాష్ట్రవ్యాప్తంగా చూస్తే మొత్తం జనాభాలో కేవలం 56.4 శాతం మంది మాత్రమే 12వ తరగతి వరకు విద్యను అభ్యసిస్తున్నారు. ఇందులో షెడ్యూల్డ్ కులాల శాతం 57 శాతంతో సగటు కంటే కొంచెం ఎక్కువగా ఉంది. ఇక బీసీలు, షెడ్యూల్డ్ తెగల విషయానికి వస్తే నమోదైన గణాంకాలు వరుసగా 54, 53 శాతంగా ఉన్నాయి.

**మరుగుదొడ్ల సౌకర్యం లేదు :** తెలంగాణలో మొత్తం జనాభాలో 13.5 శాతం మందికి మరుగుదొడ్ల సౌకర్యం అందుబాటులో లేదు. ఈ టాయిలెట్ సౌకర్యాల లేమి ఎస్టీ జనాభాలో 32.5 శాతం మంది, ఎస్సీలో 18.8 శాతం, బీసీల్లో 10.8 శాతం, ఓసీల్లో 4.5 శాతంగా ఉంది. వివిధ సామాజిక వర్గాల మధ్య పారిశుద్ధ్యం, ఆరోగ్యం అసమానతలకు ఈ విషయం ఒక సూచికగా గుర్తుంటుందని నివేదికలో పేర్కొంది. ప్రత్యేకించి ఈ సమస్య మహిళ భద్రత, గౌరవానికి సంబంధించిన విషమని తెలిపింది.

## కీరదోస ఎలా తినాలి తొక్క తీశా తీయకుండానా



సాధారణంగా కీరదోస తొక్కలు తీసి తింటే రుచిగా ఉంటుంది. నిజానికి, తొక్క భాగం ఎక్కువ పోషకమైనదట. దోసకాయ తొక్కలలో ఫైబర్, విటమిన్ కె, యాంటీఆక్సిడెంట్లు, సిలికా వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరానికి చాలా ప్రయోజనకరంగా ఉంటాయి. కీరదోస తొక్క చేదుగా, కాస్త గట్టిగా కూడా ఉంటుంది.. వేసవిలో శరీరాన్ని చల్లగా ఉంచుకోవడానికి చక్కని పరిష్కారం కీరదోస. చాలా మంది కీరదోస తొక్క తీసి తింటారు. కొంతమంది తొక్క తీయకుండానే అలాగే తింటారు. కానీ కీరదోస అసలు ఎలా తింటే ఆరోగ్యానికి మంచిదో చాలా మందికి తెలియదు.వేసవిలో శరీరాన్ని చల్లగా ఉంచుకోవడానికి చక్కని పరిష్కారం కీరదోస. చాలా మంది కీరదోస తొక్క తీసి తింటారు. కొంతమంది తొక్క తీయకుండానే అలాగే తింటారు. కానీ కీరదోస అసలు ఎలా తింటే ఆరోగ్యానికి మంచిదో చాలా మందికి తెలియదు.

**1 / 5**

సాధారణంగా కీరదోస తొక్కలు తీసి తింటే రుచిగా ఉంటుంది. నిజానికి, తొక్క భాగం ఎక్కువ పోషకమైనదట. దోసకాయ తొక్కలలో ఫైబర్, విటమిన్ కె, యాంటీఆక్సిడెంట్లు, సిలికా వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరానికి చాలా ప్రయోజనకరంగా ఉంటాయి.సాధారణంగా కీరదోస తొక్కలు తీసి తింటే రుచిగా ఉంటుంది. నిజానికి, తొక్క భాగం ఎక్కువ పోషకమైనదట. దోసకాయ తొక్కలలో ఫైబర్, విటమిన్ కె, యాంటీఆక్సిడెంట్లు, సిలికా వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరానికి చాలా ప్రయోజనకరంగా ఉంటాయి.

**2 / 5**

కీరదోస తొక్క చేదుగా, కాస్త గట్టిగా కూడా ఉంటుంది. పైగా సాగు సమయంలో ఉపయోగించే పురుగుమందులు వీటిపై ఉంటాయి. ఇది శరీరానికి చాలా హానికరం. ఈ కారణంగా రసాయనాల ప్రభావాలను నివారించడానికి చాలా మంది కీరదోస తొక్క తీసి తినేందుకు ఆసక్తి చూపుతారు. కీరదోస తొక్క చేదుగా, కాస్త గట్టిగా కూడా ఉంటుంది. పైగా సాగు సమయంలో ఉపయోగించే పురుగుమందులు వీటిపై ఉంటాయి. ఇది శరీరానికి చాలా హానికరం. ఈ కారణంగా రసాయనాల ప్రభావాలను నివారించడానికి చాలా మంది కీరదోస తొక్క తీసి తినేందుకు ఆసక్తి చూపుతారు.

**3 / 5**

అయితే వీటిపై ఉండే రసాయనాలు పోవాలంటే చల్లటి నీటిలో బాగా కడిగి, కొద్దిగా ఉప్పు లేదా బేకింగ్ సోడాతో శుభ్రం చేస్తే పురుగుమందులు తొలగిపోతాయని నిపుణులు అంటున్నారు. ఇప్పుడు తొక్కతోనే తినడం పూర్తిగా సురక్షితం. నిపుణుల అభిప్రాయం ప్రకారం, దోసకాయలను తొక్క తీయకుండా తినడం వల్ల అనేక ముఖ్యమైన పోషకాలు లభిస్తాయి. లోపలి భాగాన్ని మాత్రమే తినడం ద్వారా నీరు, కొద్ది మొత్తంలో ఫైబర్ మాత్రమే లభిస్తుందట. అందువల్ల కీరదోస తినడానికి ముందు వాటిని బాగా కడగడం మంచిది. అయితే వీటిపై ఉండే రసాయనాలు పోవాలంటే చల్లటి నీటిలో బాగా కడిగి, కొద్దిగా ఉప్పు లేదా బేకింగ్ సోడాతో శుభ్రం చేస్తే పురుగుమందులు తొలగిపోతాయని నిపుణులు అంటున్నారు. ఇప్పుడు తొక్కతోనే తినడం పూర్తిగా సురక్షితం. నిపుణుల అభిప్రాయం ప్రకారం, దోసకాయలను తొక్క తీయకుండా తినడం వల్ల అనేక ముఖ్యమైన పోషకాలు లభిస్తాయి. లోపలి భాగాన్ని మాత్రమే తినడం ద్వారా నీరు, కొద్ది మొత్తంలో ఫైబర్ మాత్రమే లభిస్తుందట. అందువల్ల కీరదోస తినడానికి ముందు వాటిని బాగా కడగడం మంచిది.

**4 / 5**

దోసకాయ తొక్క తీయాలా.. వద్దా.. అనేది పూర్తిగా మీ ప్రాధాన్యత, శుభ్రపరిచే పద్ధతిపై ఆధారపడి ఉంటుంది. మీరు కీరదోస పూర్తి పోషకాలకు పొందాలనుకుంటే, ఆరోగ్యానికి 100 శాతం ప్రయోజనాలను పొందాలనుకుంటే, దానిని బాగా కడిగి తొక్క తీయకుండా తినండి. దోసకాయ తొక్క తీయాలా.. వద్దా.. అనేది పూర్తిగా మీ ప్రాధాన్యత, శుభ్రపరిచే పద్ధతిపై ఆధారపడి ఉంటుంది. మీరు కీరదోస పూర్తి పోషకాలకు పొందాలనుకుంటే, ఆరోగ్యానికి 100 శాతం ప్రయోజనాలను పొందాలనుకుంటే, దానిని బాగా కడిగి తొక్క తీయకుండా తినండి.

## బండి మీద బజ్జీలు, పునుగులు మీ ఫేవరెట్టా ఈ 3 వ్యాధులు రావడం గ్యారెంటీ



రోడ్డు పక్కన బజ్జీలు, పునుగులు తినడం చాలా మందికి అలవాటు అయినప్పటికీ ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ముఖ్యం. ఈ ఆహారాలు రుచికరమైనవి అయినా, వాటి తయారీలో పరిశుభ్రత, నాణ్యత లోపిస్తే ఆరోగ్య సమస్యలు తప్పవు. స్వల్పకాలిక సమస్యలైన ఫుడ్ పాయిజనింగ్ నుండి దీర్ఘకాలిక సమస్యలైన గుండె జబ్బుల వరకు ప్రమాదాలు ఉన్నాయి. వీటిని రెగ్యులర్ గా తినేవారిలో ఈ 3 రకాల వ్యాధుల ప్రమాదం తప్పదు.. రోడ్డు పక్కన స్టాళ్లలో విక్రయించే బజ్జీలు, పునుగులు రుచికరమైనవి, సరసమైనవి అయినప్పటికీ, వీటిని తరచూ తినడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. ఈ ఆహారాలు తయారీలో ఉపయోగించే పదార్థాలు, వంట పద్ధతులు, పరిశుభ్రత స్థాయిలు ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయి. ఈ ఆర్టికల్‌లో రోడ్డు పక్కన వేసే బజ్జీలు, పునుగులు తినడం వల్ల కలిగే సంభావ్య సమస్యలను వివరిస్తాము.

### పరిశుభ్రత లేకపోవడం వల్ల సమస్యలు

రోడ్డు పక్కన స్టాళ్లలో తరచూ పరిశుభ్రత ప్రమాణాలు తక్కువగా ఉంటాయి. ఉపయోగించే నీరు, వంట సామగ్రి, చేతులు శుభ్రంగా లేకపోతే, బ్యాక్టీరియా, వైరస్‌లు ఆహారంలో కలుస్తాయి. ఇవి ఫుడ్ పాయిజనింగ్, వాంతులు, డయేరియా, కడుపు నొప్పి వంటి సమస్యలకు దారితీస్తాయి. కొన్ని సందర్భాల్లో, హెపటైటిస్ %ూ%, సాల్మొనెల్లా వంటి తీవ్రమైన ఇన్ఫెక్షన్లు కూడా సంభవించవచ్చు.

### నూనె నాణ్యత వల్ల ఆరోగ్య సమస్యలు

బజ్జీలు, పునుగులు వేయడానికి ఉపయోగించే నూనె తరచూ పదేపదే వేడి చేయబడుతుంది. ఇలా చేయడం వల్ల నూనెలో ట్రాన్స్ ఫ్యాట్స్, ఫ్రీ రాడికల్స్ ఏర్పడతాయి, ఇవి గుండె జబ్బులు, కొలెస్ట్రాల్ స్థాయిల పెరుగుదలకు కారణమవుతాయి. అలాగే, నాణ్యత లేని లేదా కల్తీ నూనె ఉపయోగించడం వల్ల జీర్ణ సమస్యలు, కాలేయ ఒత్తిడి వంటివి ఎదురవుతాయి.

### అధిక కేలరీలు, ఊబకాయం

బజ్జీలు, పునుగులు పాత నూనెలో వేయబడతాయి, ఇవి అధిక కేలరీలను కలిగి ఉంటాయి. తరచూ ఈ ఆహారాలను తినడం వల్ల ముఖ్యంగా మూడు రకాల ప్రమాదాలు పొంచి ఉన్నాయి. అవే బరువు పెరగడం, ఊబకాయం వంటి సమస్యలు తలెత్తుతాయి. ఈ ఆహారాలలో ఉండే అధిక కొవ్వు, ఉప్పు రక్తపోటు, డయాబెటిస్ వంటి దీర్ఘకాలిక జబ్బుల ప్రమాదాన్ని పెంచుతాయి.

### జీర్ణ సమస్యలు

ఈ ఆహారాలు తరచూ బరువైనవి, జీర్ణం కావడానికి సమయం పడతాయి. అధిక నూనె, మసాలాల వాడకం వల్ల అజీర్ణం, గ్యాస్, గుండెల్లో మంట వంటి సమస్యలు రావచ్చు. కొన్ని స్టాళ్లలో వాడే మైదా, కల్తీ పదార్థాలు జీర్ణ వ్యవస్థపై ఒత్తిడిని పెంచుతాయి.

### అలర్జీలు, ఆహార సున్నితత్వం

రోడ్డు పక్క స్టాళ్లలో ఉపయోగించే పదార్థాలు ఎల్లప్పుడూ తాజాగా లేదా నాణ్యమైనవిగా ఉండకపోవచ్చు. కొన్ని సందర్భాల్లో, కల్తీ రంగులు, సంరక్షణ పదార్థాలు లేదా అస్వచ్ఛమైన పదార్థాలు అలర్జీలకు కారణమవుతాయి. ఇవి చర్మంపై దద్దుర్లు, శ్వాస సమస్యలు లేదా ఆహార సున్నితత్వ లక్షణాలను కలిగించవచ్చు.

## మర్చిపోకుండా ఉండేందుకు జపనీస్ వాడే మైండ్ ట్రిక్స్ తెలిస్తే షాకవ్వాల్సిందే



తెలివితేటలు, క్రమశిక్షణ వంటి పదాలు చెప్పగానే ముందుగా గుర్తొచ్చేది జపాన్ దేశమే. వీరి ఇంటిలిజెన్స్ ను ఉపయోగించి చేసే తయారు చేసే టెక్నాలజీకి ప్రపంచవ్యాప్తంగా పేరుంది. అయితే, వీరు ఏ విషయాన్నైనా మర్చిపోకుండా ఎలా గుర్తుపెట్టుకుంటారు అనేది అంతుచిక్కని విషయం. అందుకోసం వీరు కొన్ని టెక్నిక్స్ ను ఉపయోగిస్తారట. వీటివల్లే వారు అంత తెలివిగా ఉంటారంటారు. అవేంటో చూద్దాం. మెదడులో సమాచారాన్ని ఎక్కువ కాలం నిలిపి ఉంచేందుకు షిచిడా పద్ధతి ఉపయోగపడుతుంది. ఈ విధానంలో సమాచారాన్ని రంగుల బొమ్మలు లేదా కథల రూపంలో ఊహించుకోవడం జరుగుతుంది. ఉదాహరణకు, ఒక జాబితాను గుర్తుంచుకోవాలంటే, దానిని ఒక సజీవ కథగా మార్చి, మెదడు సృజనాత్మక భాగాన్ని ఉత్తేజపరచడం ద్వారా గుర్తుంపు సులభమవుతుంది. ఈ పద్ధతి జపాన్ విద్యా విధానాల్లో విస్తృతంగా ఉపయోగిస్తుంటారు.ఎన్-బ్యాక్ టెక్నిక్‌ట ఎన్-బ్యాక్ టెక్నిక్ మెదడు గుర్తుంచుకునే సామర్థ్యాన్ని, ఏకాగ్రతను పెంచే మానసిక వ్యాయామం. ఈ పద్ధతిలో ఒక వరుసలోని అంశాలను కొన్ని దశల ముందు నుంచి గుర్తుచేసుకోవాలి. ఉదాహరణకు, రెండు లేదా మూడు అంశాల ముందు ఉన్న వాటిని గుర్తుంచుకోవడం. ఈ విధానం ద్వారా క్రమంగా మెదడు పనితీరు మెరుగుపడి, సమాచారాన్ని త్వరగా గ్రహించే సామర్థ్యం పెరుగుతుంది.

### చంకింగ్ (కాంజీ నేర్చుకునే శైలి)

సంక్లిష్ట సమాచారాన్ని చిన్న, సులభమైన భాగాలుగా విభజించడం చంకింగ్ పద్ధతి యొక్క ప్రధాన ఉద్దేశం. జపాన్ కాంజీ అక్షరాలను నేర్చుకునే విధానం నుంచి ఈ టెక్నిక్ పుట్టింది. ఉదాహరణకు, ఒక పెద్ద సంఖ్యను గుర్తుంచుకోవాలంటే, దానిని చిన్న సమూహాలుగా విభజించి నేర్చుకోవడం ద్వారా మెదడుకు సులభతరం అవుతుంది. ఈ విధానం సమాచారాన్ని వ్యవస్థీకరించడంలో సహాయపడుతుంది.

### స్పేస్డ్ రిపిటీషన్

సమాచారాన్ని దీర్ఘకాలం గుర్తుంచుకోవడానికి స్పేస్డ్ రిపిటీషన్ అనేది ఒక శక్తివంతమైన పద్ధతి. ఈ టెక్నిక్‌లో సమాచారాన్ని నిర్దిష్ట వ్యవధులలో (ఉదాహరణకు, 1 రోజు, 3 రోజులు, 7 రోజులు) పునరావృతం చేయడం జరుగుతుంది. భాషా నేర్చుకోవడంలో ఈ పద్ధతి ఎక్కువగా ఉపయోగించబడుతుంది. క్రమం తప్పకుండా పునరావృతం చేయడం వల్ల మెదడు సమాచారాన్ని బలంగా నిలుపుకుంటుంది.

### మైండ్ మ్యాపింగ్ (బుజాన్ శైలి)

మైండ్ మ్యాపింగ్ అనేది సమాచారాన్ని దృశ్య రూపంలో రూపొందించే పద్ధతి. ఒక కేంద్ర ఆలోచన చుట్టూ సంబంధిత విషయాలను చిత్రం లేదా రేఖాచిత్రం రూపంలో అనుసంధానం చేయడం ద్వారా ఈ టెక్నిక్ పనిచేస్తుంది. ఈ విధానం సమాచారాన్ని వ్యవస్థీకరించడంతో పాటు, దానిని సులభంగా గుర్తుంచుకోవడంలో సహాయపడుతుంది. జపాన్ విద్యార్థులు ఈ పద్ధతిని ఉపయోగిస్తారు.

### ఫురుసాటో జ్ఞాపక టెక్నిక్

ఫురుసాటో టెక్నిక్ సమాచారాన్ని మనసుకు సుపరిచితమైన స్థలాలు లేదా వ్యక్తిగత జ్ఞాపకాలతో అనుసంధానం చేసే పద్ధతి. ఉదాహరణకు, మీ సొంత ఊరిలోని ఒక ప్రదేశంతో సమాచారాన్ని జోడించడం ద్వారా భావోద్వేగ సంబంధాన్ని ఏర్పరచుకోవచ్చు. ఈ భావోద్వేగ అనుబంధం మెదడులో సమాచారాన్ని ఎక్కువ కాలం నిలిపి ఉంచడంలో సహాయపడుతుంది.

## బరువు తగ్గడానికి డైట్ చేస్తున్నాం పొరపాటున కూడా తొద్దు



ప్రస్తుతం వయసుతో సంబంధం లేకుండా అధిక బరువు ఊబకాయం సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. దీంతో బరువు తగ్గేందుకు తినే ఆహారం విషయంపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. స్పెషల్ డైట్ ని ఫాలో అవుతారు. డైట్ లో పండ్లు తినడం ఆరోగ్యకరమైనదని భావిస్తారు. అయితే అన్ని రకాల పండ్లు బరువు తగ్గడానికి ఉపయోగపడవు. డైటింగ్ చేస్తున్నప్పుడు మీ డైట్‌లో ఏ పండ్లను చేర్చుకోకూడదో ఈ రోజు తెలుసుకుందాం.. బరువు తగ్గడానికి డైటింగ్ ప్రారంభించినప్పుడు మొదట తినే ఆహారంలో ఆరోగ్యకరమైన పదార్థాలను చేర్చుకోవడంపై దృష్టి పెడతారు. అందులో పండ్లను ఆరోగ్యకరమైన ఎంపికగా భావించి ప్రతిరోజూ వాటిని తినడం ప్రారంభిస్తారు. పండ్లలో పోషకాలు సమృద్ధిగా ఉండటమే కాదు శరీరానికి మేలు చేసే ఫైబర్, విటమిన్లు, యాంటీఆక్సిడెంట్లు కూడా ఉంటాయి. అయితే అన్ని రకాల పండ్లు బరువు తగ్గడానికి సహాయపడవని మీకు తెలుసా? అవును కొన్ని పండ్లలో సహజ చక్కెర , కేలరీలు ఉంటాయి. అవి మీ బరువు తగ్గించే ప్రక్రియకు ఆటంకం కలిగిస్తాయి. తరచుగా ప్రజలు ఆరోగ్యంగా ఉన్నామని భావిస్తూ కొన్ని రకాల పండ్లను తీసుకుంటారు. ఈ రోజు డైటింగ్ చేసేవారు ఏ ఏ పండ్లకు దూరంగా ఉండాలో తెలుసుకుందాం..

అరటిపండ్లు: అరటిపండ్లలో అధిక మొత్తంలో చక్కెర, కేలరీలు ఉంటాయి. ఒక మధ్య తరహా అరటిపండులో దాదాపు 100-120 కేలరీలు, అధిక కార్బోహైడ్రేట్లు ఉంటాయి. ఎవరైనా డైటింగ్ చేస్తుంటే శరీరంలో కేలరీల సమతుల్యతను పాడు చేస్తుంది.

ద్రాక్ష: ఇవి తియ్యగా ఉంటాయి. వీటిలో చాలా సహజ చక్కెర ఉంటుంది. వీటిని ఎక్కువ పరిమాణంలో తింటే బరువు తగ్గడానికి బదులుగా పెరుగుతారు. అలాగే ఇవి త్వరగా జీర్ణమవుతాయి. కనుక మీకు త్వరగా ఆకలి అనిపిస్తుంది. అతిగా తినే అవకాశం ఉంది.

అజర్‌బైజాన్, టర్కీదేశాలను బహిష్కరించాలని భారతీయులు పిలుపు..

పుచ్చకాయ: పుచ్చకాయలో నీటి శాతం ఎక్కువగా ఉంటుంది. అంతేకాదు గ్లైసెమిక్ ఇండెక్స్ కూడా పుచ్చకాయలో ఎక్కువగా ఉంటుంది. దీని అర్థం ఇది త్వరగా చక్కెరగా మారుతుంది. ఇన్సులిన్ స్పైక్‌లకు కారణమవుతుంది. కనుక పుచ్చకాయ బరువు తగ్గడాన్ని అడ్డుకుంటుంది.

మామిడి పండు: సాధారణ డైట్ తీసుకునే వారికి వేసవి పండ్లు తగినవి కావు. మామిడి పండ్లలో చాలా సహజ చక్కెర, కేలరీలు ఉంటాయి. ముఖ్యంగా పండిన మామిడి పండ్లు బరువు తగ్గించే ప్రయాణాన్ని నెమ్మది చేస్తాయి. కనుక వీలైతే, వీటిని డైట్ చేసేవారు దూరం పెట్టండి.

పైనాపిల్: పైనాపిల్‌లో కూడా అధిక మొత్తంలో ఫ్రక్టోజ్ ఉంటుంది. ఎవరైనా బరువు తగ్గడానికి ప్రయత్నిస్తుంటే పరిమిత పరిమాణంలో తినండి. దీనిని భారీ మొత్తంలో తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతాయి.

ఏ పండ్లు తినాలంటే

డైటింగ్ చేస్తున్నప్పుడు అన్ని రకాల పండ్లను మానేయల్సిన అవసరం లేదు. పండ్లను తెలివిగా ఎంచుకుని తినాలి. డైటింగ్ చేస్తున్నప్పుడు ఆపిల్, బొప్పాయి, జామ, బెర్రీలు, నేరేడు పండ్లను తినవచ్చు. వీటిలో కేలరీలు తక్కువగా..ఫైబర్ అధికంగా ఉంటాయి. ఇవి బరువు తగ్గడానికి సహాయపడతాయి.

## కంటి దురద ఈ వ్యాధికి ప్రారంభ సంకేతం బీ కేర్ ఫుల్ బ్రదర్

వేసవి, శీతాకాలంలో పొడి గాలితోపాటు దైనందిన జీవనశైలి అలవాట్లు కంటి అసౌకర్యానికి కారణంగా చెప్పవచ్చు. కానీ ఇది కేవలం అలెర్జీల వల్ల మాత్రమే కాదు, అనేక రకాల ఆరోగ్య సమస్యలకు సంకేతం కూడా. దానికి కారణమేమిటో అర్థం చేసుకుని దానికి సరైన చికిత్స చేయడం వల్ల కళ్ళ ఆరోగ్యాన్ని.. ఇటీవలి కాలంలో కళ్ళు దురద సాధారణ సమస్యగా మారింది. వేసవి, శీతాకాలంలో పొడి గాలితోపాటు దైనందిన జీవనశైలి అలవాట్లు కంటి అసౌకర్యానికి కారణంగా చెప్పవచ్చు. కానీ ఇది కేవలం అలెర్జీల వల్ల మాత్రమే కాదు, అనేక రకాల ఆరోగ్య సమస్యలకు సంకేతం కూడా. దానికి కారణమేమిటో అర్థం చేసుకుని దానికి సరైన చికిత్స చేయడం వల్ల కళ్ళ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. కళ్ళు దురదకు కారణమేమిటి? వాటిని నివారించడానికి ఇక్కడ కొన్ని చిట్కాలను నిపుణులు సూచిస్తున్నారు. అవేంటో తెలుసుకుందాం..

**అలెర్జీ**

దుమ్ము లేదా ఇతర అలెర్జీ కారకాలు కళ్ళలో దురద, ఎరుపు, నీరు కారడానికి కారణమవుతాయి.

**పొడి కళ్ళు**

కళ్ళు తగినంత నీటిని ఉత్పత్తి చేయనప్పుడు లేదా కన్నీళ్లు చాలా త్వరగా పొడి బారినప్పుడు దురదగా మారుతాయి. స్క్రీన్‌ల ముందు ఎక్కువ సమయం గడపడం, ఎయిర్ కండిషనింగ్ ఉపయోగించడం లేదా తక్కువ తేమ ఉన్న వాతావరణంలో ఎక్కువ సమయం గడపడం వల్ల కూడా ఇది సంభవించవచ్చు.

**ఇంటర్ పాఠ్యపుస్తకాలు మారుతున్నాయ్.. కొత్త సిలబస్ ఇదే!**

**కంటి ఇన్ఫెక్షన్**

కండ్లకలక వంటి బాక్టీరియల్ లేదా వైరల్ ఇన్ఫెక్షన్లు దురద, కళ్ళు ఎర్రబడటానికి కారణమవుతాయి.


**కాంటాక్ట్ లెన్సులు**

కాంటాక్ట్ లెన్స్‌లను సరిగ్గా శుభ్రం చేయకపోవడం, ఎక్కువసేపు వాటిని ధరించడం వల్ల కళ్ళు దురద లేదా అసౌకర్యంగా ఉంటాయి.

పర్యావరణ కారకం కాలుష్యం, పొగ లేదా ఇతర రసాయనాలు కళ్ళను చికాకు కలిగిస్తాయి. వేసవి ఎండ వేడి లేదా శీతాకాలపు చల్లని గాలి కళ్ళ చికాకు, దురదకు కారణమవుతాయి.

**మందుల దుష్ప్రభావాలు**


కొన్ని మందులు కళ్ళు ఎండిపోయి దురదకు కారణమవుతాయి. బ్లెఫారిటిస్ (కనురెప్పల వాపు), తామర లేదా థైరాయిడ్ సంబంధిత సమస్యలు కూడా కళ్ళ దురదకు కారణమవుతాయి. కొన్ని



సందర్భాల్లో డయాబెటిస్ లేదా ఆటో ఇమ్యూన్ వ్యాధులు కూడా కళ్ళను ప్రభావితం చేస్తాయి. కొన్నిసార్లు వేడి వస్తువులను తిన్న తర్వాత కూడా దురద, కళ్ళు ఎర్రబడటం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ సందర్భంలో పుష్కలంగా నీరు తాగడం, టీ- కాఫీ వంటి పానీయాలు తీసుకోకపోవడం మంచిది. సమస్య తీవ్రమైతే వైద్యుడిని తప్పనిసరిగా కలవాలి.

**గమనిక:** ఈ కంటెంట్ సాధారణ సమాచారాన్ని మాత్రమే అందిస్తుంది. మరింత సమాచారం కోసం ఎల్లప్పుడూ వైద్యుడిని సంప్రదించడం మర్చిపోవద్దు

## ఎండిన నిమ్మకాయలను బయటపడేస్తున్నారా ఇకపై పారేయకండి ఇలా వాడితే బోలెడన్ని లాభాలు



నిమ్మకాయలు ఆరోగ్యానికి చాలా మంచివి. కానీ తాజా నిమ్మకాయల కంటే ఎండిన నిమ్మకాయలలో ఎక్కువ పోషకాలు ఉంటాయని మీకు తెలుసా? అవును.. ఎండిన నిమ్మకాయల్లో విటమిన్ సి , ఐరన్, కాల్షియం, మెగ్నీషియం, ఫైబర్, విటమిన్ బి12 వంటి ముఖ్యమైన పోషకాలు సమృద్ధిగా ఉంటాయట. ఈ పోషకాలు శరీర ఆరోగ్యాన్ని కాపాడుతాయి. అందుకే మీరు ఇంట్లో ఎండిన నిమ్మకాయలను పారేస్తుంటే.. ఈరోజే వాటిని పారేయడం మానేయండి. ఎందుకంటే ఎండిన నిమ్మకాయ ఎక్కువ ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. అవేంటో ఇక్కడ తెలుసుకుందాం.. ఎండిన నిమ్మకాయలను బయటపడేస్తున్నారా? ఇకపై పారేయకండి.. ఇలా వాడితే బోలెడన్ని లాభాలు.. ఎండిన నిమ్మకాయలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. అజీర్ణం, పేగు సంబంధిత రుగ్మతలు వంటి సమస్యలను తగ్గిస్తుంది. ఇది మలబద్ధకం లేదా ఇతర జీర్ణ సమస్యలను తగ్గించడంలో కూడా సహాయపడుతుంది. ఎండిన నిమ్మకాయలోని విటమిన్ సి శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచుతుంది. ఇది వైరస్‌లు, బ్యాక్టీరియా వంటి ఇన్ఫెక్షన్‌ల నుంచి శరీరాన్ని రక్షిస్తుంది. వాతావరణంలోని మార్పులను తట్టుకునే సామర్థ్యాన్ని కూడా అందిస్తుంది. ఎండిన నిమ్మకాయలను తక్కువ మొత్తంలో క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల రోగనిరోధక శక్తి బలపడుతుంది. ఎండిన నిమ్మకాయల్లో యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఈ అంశాలు మన చర్మానికి మంచివి. కాబట్టి వీటిని క్రమం తప్పకుండా ఉపయోగించడం వల్ల చర్మం శుభ్రంగా, ప్రకాశవంతంగా మారుతుంది. చర్మంపై ఉన్న మచ్చలు తగ్గడానికి కూడా సహాయపడుతుంది. ఎండిన నిమ్మకాయలు రక్తపోటును నియంత్రించడంలో సహాయపడతాయి. వీటిలోని పొటాషియం కంటెంట్ రక్తపోటును నియంత్రిస్తుంది. గుండె ఆరోగ్యాన్ని కాపాడుతుంది. ఎండిన నిమ్మకాయలలో ఉండే ఫైబర్ కంటెంట్ శరీరానికి శక్తిని అందించడమే కాకుండా కడుపు నిండిన అనుభూతిని కలిగిస్తుంది. తద్వారా ఆకలి తగ్గుతుంది. అతిగా తినే అలవాటు తగ్గుతుంది. ఎండిన నిమ్మకాయలు సహజ నిర్విషీకరణకారిగా పనిచేస్తాయి. అవి శరీరం నుండి విషాన్ని తొలగించడం ద్వారా శరీరాన్ని శుభ్రపరిచే ప్రక్రియలో సహాయపడతాయి. ఇవి కాలేయ ఆరోగ్యానికి అవసరమైన విటమిన్లు, జీర్ణ రసాయనాలను కూడా అందిస్తాయి.

### దీన్ని ఎలా తినాలి?

ఎండిన నిమ్మకాయలను నేరుగా తినవచ్చు లేదా చాట్స్‌లో లేదా ఇతర వంటకాలకు జోడించడం ద్వారా తినవచ్చు. వీటిని మీ రోజువారీ ఆహారంలో చేర్చుకోవడం ద్వారా, మీ ఆరోగ్యాన్ని మరింత బలోపేతం చేసుకోవచ్చు. ఇంటర్ పాఠ్యపుస్తకాలు మారుతున్నాయ్.. కొత్త సిలబస్ ఇదే!

గమనిక: ఈ కంటెంట్ సాధారణ సమాచారాన్ని మాత్రమే అందిస్తుంది. మరింత సమాచారం కోసం ఎల్లప్పుడూ వైద్యుడిని సంప్రదించడం మర్చిపోవద్దు

# యంగ్ ఎంట్రప్రెన్యూర్స్ సమ్మిట్

### చిన్న స్టార్టప్‌లు కోట్లు ఎలా సంపాదిస్తున్నాయి



హైదరాబాద్ వేదికగా 'యంగ్ ఎంట్రప్రెన్యూర్స్ సమ్మిట్ 2026'కు రంగం సిద్ధమైంది. ఏప్రిల్ 10 నుంచి ఐటీ హబ్ నడిబొడ్డున ఉన్న హైటెక్స్‌లో ఈ భారీ ఈవెంట్ ప్రారంభం కానుంది. ముఖ్యంగా చిన్న చిన్న పనులతో మొదలుపెట్టి, వాటిని భారీ బిజినెస్‌లుగా మార్చిన తెలుగు ఫౌండర్లపై ఈ సదస్సు ప్రధానంగా దృష్టి సారించనుంది. తమ స్టార్టప్‌లను ఎలా డెవలప్ చేశారో, ఆ సక్సెస్ సీక్రెట్స్‌ను వీరు వేలాది మంది యువ క్రియేటర్లతో పంచుకోనున్నారు.ఈ సమ్మిట్‌లో పాల్గొనే చాలామంది స్పీకర్లు కేవలం పది వేల రూపాయల పెట్టుబడితోనే తమ ప్రయాణాన్ని మొదలుపెట్టారు. నేడు కోట్లాది రూపాయల వార్షిక టర్నోవర్‌తో సత్తా చాటుతున్నారు. స్థిరమైన ఉద్యోగాలను వదిలేసి ఫుల్ టైమ్ బిజినెస్‌లోకి ఎలా వచ్చారు? రిస్క్ మేనేజ్‌మెంట్ చేస్తూ బ్రాండ్‌ను ఎలా బిల్డ్ చేయాలి? అనే అంశాలే ఈ సదస్సులో హైలైట్‌గా నిలవనున్నాయి.హైదరాబాద్ యంగ్ ఎంట్రప్రెన్యూర్స్ సమ్మిట్ 2026: సక్సెస్ స్టోరీలే హైలైట్‌తొలిరోజు ముగ్గురు ప్రముఖ తెలుగు ఫౌండర్లు తమ అనుభవాలను పంచుకోనున్నారు. వరంగల్‌లో ఒక చిన్న వంటింటి నుంచి మొదలైన ఫుడ్ వెంచర్ నుంచి.. తెలుగు రాష్ట్రాల్లో విస్తరించిన లాజిస్టిక్స్ ప్లాట్‌ఫామ్ వరకు ఎన్నో ఆసక్తికర విషయాలు ఇక్కడ చర్చకు రానున్నాయి. చిన్నగా మొదలుపెట్టి మార్కెట్‌లో ఎంత వేగంగా సక్సెస్ కావచ్చో వీరి కథలు నిరూపిస్తున్నాయి.

| ఫౌండర్ నేపథ్యం | ప్రారంభ పెట్టుబడి | ప్రస్తుత పరిస్థితి |
|---|---|---|
| వరంగల్ ఫుడీ | =ం 15,000 | 50+ అవుట్‌లెట్లు |
| వైజాగ్ టెక్కీ | =ం 50,000 | సిరీస్ ఫండింగ్ |
| హైదరాబాద్ మేకర్ బూట్‌స్ట్రాప్ | = 10 జతీ రెవెన్యూ | |

మూడు రోజుల పాటు జరిగే ఈ ఈవెంట్‌లో ఫండ్ రైజింగ్, డిజిటల్ మార్కెటింగ్ స్ట్రాటజీలపై ప్రత్యేక వర్క్‌షాప్‌లు ఉంటాయి. భారీ బడ్జెట్ లేకుండానే మొదటి వెయ్యి మంది కస్టమర్లను ఎలా సంపాదించారో ఫౌండర్లు వివరిస్తారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు వదిలి సొంతంగా ఏదైనా చేయాలనుకునే వారికి ఈ సెషన్స్ ఎంతో ఉపయోగపడతాయి. టీమ్ బిల్డింగ్, ఇన్వెస్ట్‌మెంట్స్ వంటి అంశాలపై ఇక్కడ ప్రాక్టికల్ టిప్స్ లభిస్తాయి.యంగ్ ఎంట్రప్రెన్యూర్స్ సమ్మిట్: యువతకు ఉపయోగపడే స్కిల్స్‌ఈ సమ్మిట్ కోసం రిజిస్ట్రేషన్లు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. అఫీషియల్ వెబ్‌సైట్ ద్వారా టికెట్లు బుక్ చేసుకోవచ్చు. నెట్‌వర్కింగ్ జోన్స్, టెక్నికల్ హ్యాకథాన్ సెషన్లలో పాల్గొనే అవకాశం ఉంటుంది. అలాగే లోకల్ స్టార్టప్‌ల కోసం హైటెక్స్‌లో భారీ ఎగ్జిబిషన్ కూడా ఏర్పాటు చేస్తున్నారు. రీజినల్ మార్కెట్‌పై పట్టున్న మెంటర్లను కలిసేందుకు ఇది ఒక అద్భుతమైన అవకాశం.ఏప్రిల్ 12న టాప్ ఇన్నోవేటర్ల కోసం నిర్వహించే గాలా ఈవెంట్‌తో ఈ సదస్సు ముగుస్తుంది. తెలుగు రాష్ట్రాల్లో స్టార్టప్ కల్చర్‌ను ఈ సమ్మిట్ కొత్త పుంతలు తొక్కించనుంది. తమ కలలను నిజం చేసుకోవాలనుకునే యువ పారిశ్రామికవేత్తలు ఈ అవకాశాన్ని అస్సలు మిస్ కావద్దు. హైదరాబాద్‌లో మూడు రోజుల పాటు జరిగే ఈ నాలెడ్జ్ షేరింగ్ ఈవెంట్ కోసం సిద్ధంగా ఉండండి.

# బెంగళూరు సబర్బన్ రైలు ఆగిందా

### ఐటీ ఉద్యోగులకు షాకింగ్ వార్త

బెంగళూరులో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 148 కిలోమీటర్ల సబర్బన్ రైలు ప్రాజెక్టుకు కొత్త చిక్కులు వచ్చి పడ్డాయి. భూ బదిలీ ప్రక్రియలో జరుగుతున్న ఆకస్మిక జాప్యం వల్ల 2026 నాటికి ఈ ప్రాజెక్టు పూర్తి కావడం కష్టంగా కనిపిస్తోంది. కే-రైడ్ అధికారులకు అందాల్సిన కీలక భూభాగాలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. ముఖ్యంగా వైట్‌ఫీల్డ్, సర్జాపూర్ వంటి ఐటీ కారిడార్లలో ప్రయాణించే వారికి ఇది పెద్ద ఎదురుదెబ్బ. దీంతో అటు ప్రయాణికులు, ఇటు రియల్ ఎస్టేట్ ఇన్వెస్టర్లు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.ప్రస్తుతం హెబ్బాల్ నుంచి యలహంక వరకు, అలాగే అంతర్జాతీయ విమానాశ్రయానికి వెళ్లే దేవనహళ్లి రూట్‌లో పనులు నిలిచిపోయాయి. భారీ నిర్మాణాల కోసం ఈ జోన్లలో కే-రైడ్ అధికారులకు ఇంకా కొన్ని ఎకరాల భూమి అందాల్సి ఉంది. భూమి చేతికి రాకపోతే నిర్ణీత షెడ్యూల్ ప్రకారం పిల్లర్ల నిర్మాణం సాధ్యం కాదు. ఈ జాప్యం వల్ల రైలు పనులతో పాటు స్థానిక రోడ్డు పనులు,



ఇతర అభివృద్ధి ప్రాజెక్టులు కూడా ఆగిపోయాయి.సబర్బన్ రైలు ఆలస్యం.. రియల్ ఎస్టేట్ మార్కెట్‌పై ఎలాంటి ప్రభావంసర్జాపూర్, కేఆర్ పురం ప్రాంతాల్లోని ప్రాపర్టీ మార్కెట్‌పై ఈ ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ఇక్కడ అద్దెలు త్వరలోనే భారీగా మారే అవకాశం ఉందని రియల్ ఎస్టేట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. 2026 నాటికి రైలు సౌకర్యం వస్తుందన్న ఆశతో చాలా మంది ఈ ప్రాంతాల్లో ఇళ్లు కొనుగోలు చేశారు. ఇప్పుడు ప్రాజెక్టు గనుక ఆలస్యమైతే, అపార్ట్‌మెంట్ల రీసేల్ విలువ పెరగకుండా నిలిచిపోయే ప్రమాదం ఉంది. వేల సంఖ్యలో ఐటీ ఉద్యోగులకు ఆఫీస్ ప్రయాణం మళ్లీ పెద్ద తలనొప్పిగా మారనుంది.ప్రభావిత కారిడార్ ప్రస్తుత పరిస్థితిప్రయాణికులపై ప్రభావంహెబ్బాల్ - యలహంక
భూ బదిలీ పెండింగ్‌అద్దెలు పెరిగే ముప్పుఆర్ పురం-వైట్‌ఫీల్డ్
క్లియరెన్స్ దశలో..ఆఫీస్ ప్రయాణంలో జాప్యంసర్జాపూర్ బెల్ట్ సర్వే జరుగుతోంది రీసేల్ ధరల్లో స్తబ్దత భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం అధికారులపై ఒత్తిడి తెస్తోంది. వచ్చే త్రైమాసికం నాటికి పరిపాలనాపరమైన చిక్కులన్నీ తొలగిపోతాయని కే-రైడ్ అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టు అనుకున్న సమయానికి పట్టాలెక్కాలంటే తక్షణ చర్యలు తప్పనిసరి. అప్పటివరకు బెంగళూరు వాసుల సాఫీ ప్రయాణం కలగానే మిగిలిపోయేలా ఉంది. ఈ సమస్యకు త్వరగా పరిష్కారం దొరుకుతుందని నగరవాసులు కోరుకుంటున్నారు.

# ఒరాకిల్ ఎందుకు ఇన్ని వేల మందిని తీసేస్తోంది

### లోపల జరుగుతోంది ఇదే!

ప్రముఖ గ్లోబల్ టెక్ దిగ్గజం ఒరాకిల్ నుండి వస్తున్న తాజా వార్తలు ఐటీ రంగాన్ని వణికించివేస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా సుమారు 10,000 నుండి 30,000 మంది ఉద్యోగులను తొలగించాలని కంపెనీ నిర్ణయించగా, అందులో అత్యధికంగా ప్రభావితమైన దేశాల్లో భారత్ ఒకటి. సుమారు 12,000 మంది భారతీయ ఉద్యోగులు ఈ లేఆఫ్స్ వల్ల తమ ఉపాధిని కోల్పోయినట్లు అంచనా. క్లౌడ్, హెల్త్‌కేర్, సేల్స్ , నెట్‌సూట్ వంటి కీలక విభాగాల్లో ఈ కోతలు జరగడం గమనార్హం. అసలు ఇంత పెద్ద కంపెనీ, ఇంతమందిని ఎందుకు తొలగిస్తోంది? దీని వెనుక ఉన్న ఆర్థిక సమీకరణాలేంటి? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.ఏఐ కోసం భారీ పందెం.. ఉద్యోగులపై భారం!ఒరాకిల్ తీసుకున్న ఈ కఠిన నిర్ణయం వెనుక కృత్రిమ మేధ మౌలిక సదుపాయాల కోసం చేస్తున్న భారీ పెట్టుబడులు ఉన్నాయి. 2025లో ఒరాకిల్, ఓపెన్ ఏఐ సంస్థతో దాదాపు 300 బిలియన్ డాలర్ల విలువైన క్లౌడ్ కంప్యూటింగ్ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. చాట్ జీపీటీ వంటి అడ్వాన్స్‌డ్ ఏఐ సిస్టమ్స్ కోసం భారీ డేటా సెంటర్లను నిర్మించడమే ఈ ఒప్పందం లక్ష్యం. అయితే, ఈ వేగవంతమైన విస్తరణ కోసం ఒరాకిల్ దాదాపు 100 బిలియన్ డాలర్ల పైగా అప్పులు చేయాల్సి వచ్చింది. దీనివల్ల కంపెనీ ఫ్రీ క్యాష్ ఫ్లో దెబ్బతింది.ఖర్చులను అదుపులోకి తెచ్చుకోవడానికి ఒరాకిల్ ఇప్పుడు తన సిబ్బందిని తగ్గించుకుంటోంది. ఈ శ్రీఖఎశీటటం ద్వారా కంపెనీ దాదాపు 8 నుండి 10 బిలియన్ డాలర్లను ఆదా చేయాలని భావిస్తోంది. ఈ మిగిలిన నిధులను ఏఐ ప్రాజెక్టుల కోసం మళ్లించనుంది. విచిత్రమేమిటంటే, ఏఐ టూల్స్ సహాయంతోనే తక్కువ మంది టీమ్‌లతో ఎక్కువ పని చేయవచ్చని ఒరాకిల్ భావిస్తోంది. అంటే, టెక్నాలజీ పెరుగుదల మనుషుల అవసరాన్ని తగ్గిస్తోందన్నమాట.ఇండియాలో సెవెరెన్స్ ప్యాకేజీ ఎలా




ఉందిఉద్యోగం కోల్పోయిన వారికి ఇచ్చే పరిహారం లేదా సెవెరెన్స్ ప్యాకేజీపై బెంగళూరులోని ఒరాకిల్ ఇండియా డెవలప్‌మెంట్ సెంటర్ ఉద్యోగులు సోషల్ మీడియాలో (ముఖ్యంగా రెడ్డిట్) కొన్ని వివరాలను పంచుకున్నారు. దీని ప్రకారం..సర్వీస్ ఆధారిత పే: పని చేసిన ప్రతి ఏడాదికి 15 రోజుల బేసిక్ శాలరీ.ఎక్స్ గ్రేషియా: ప్రతి ఏడాదికి అదనంగా మరో 15 రోజుల శాలరీతో పాటు, ఫిక్స్‌డ్ అమౌంట్‌గా రెండు నెలల జీతం.గార్డెనింగ్ లీవ్: ఒక నెల రోజుల పాటు పని చేయాల్సిన అవసరం లేకుండానే ఇచ్చే జీతం.లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్: వాడుకోని సెలవులకు ఇచ్చే నగదు , దాదాపు రూ. 20,000 వరకు ఇన్సూరెన్స్ బెనిఫిట్.మొత్తంగా చూస్తే ఒరాకిల్ తీసుకున్న ఈ నిర్ణయం కేవలం ఒక కంపెనీకి మాత్రమే పరిమితం కాదు. మొత్తం టెక్ పరిశ్రమ ఇప్పుడు ఏఐ వైపు అడుగులు వేస్తోంది. భారీ పెట్టుబడులు అవసరమైనప్పుడు కంపెనీలు మొదట చేసే పని మానవ వనరుల కోత. ఒకప్పుడు లక్షల్లో జీతాలు ఇచ్చి తీసుకున్న కంపెనీలే, ఇప్పుడు టెక్నాలజీ సాకుతో వేల మందిని ఇంటికి పంపిస్తున్నాయి. ఐటీ ఉద్యోగులు కేవలం కోడింగ్ మీదనే కాకుండా, మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా తమను తాము అప్‌డేట్ చేసుకోవాల్సిన అవసరాన్ని ఈ లేఆఫ్స్ మరోసారి గుర్తుచేస్తున్నాయి.

# ఇకపై టోల్ ప్లాజాలు క్యాష్ లెస్

### ఏప్రిల్ 10 నుంచి అంతా డిజిటల్‌లోనే!

### టోల్ వ్యవస్థను పూర్తిగా డిజిటల్‌గా మార్చే ఉద్దేశంతో ఈ నిర్ణయం

### ఏప్రిల్ 10 నుంచి టోల్ బూత్‌ల వద్ద నగదు చెల్లింపులను స్వీకరించబోమని ఉత్తర్వులు జారీ

జాతీయ రహదారులపై ప్రయాణించే వారికి అలర్ట్! టోల్ ప్లాజాల వద్ద నగదుతో చెల్లింపులు చేస్తున్నారా ఇకపై టోల్‌ప్లాజాలో నగదు తీసుకోరు. టోల్ ప్లాజాల వద్ద నగదు చెల్లింపులను పూర్తిగా నిలిపివేస్తున్నట్లు రహదారి రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఏప్రిల్ 10 నుంచి టోల్ బూత్‌ల వద్ద నగదు చెల్లింపులను స్వీకరించబోమని ఉత్తర్వులు జారీ చేసింది. ఫీజు చెల్లింపులకు పూర్తిగా డిజిటల్ లావాదేవీలను మాత్రమే ఉపయోగించాలని భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ కు చెందిన ఒక సీనియర్ అధికారి సూచించారు. టోల్‌ప్లాజాల వద్ద రద్దీని తగ్గించడం, ప్రయాణ సమయాన్ని ఆదాచేయడం, రుసుముల వసూళ్లలో పారదర్శకత కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు."ఒక వాహనం సరైన ఫాస్టాగ్ లేకుండా టోల్ ప్లాజాలోకి ప్రవేశించిన సందర్భాల్లో వినియోగదారులు ఇప్పటికే ద్వారా రుసుము చెల్లించవచ్చు. అయితే, ఆ వాహన వర్గానికి వర్తించే సాధారణ రుసుము కంటే 1.25 రెట్లు అధిక మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుంది. ఒకవేళ వాహన యజమాని లేదా డ్రైవర్ ఈ నియమం




కింద నిర్దేశించిన పద్ధతిలో రుసుము చెల్లించడానికి అంగీకరించకపోతే, అటువంటి వాహనంపై నియమం 14 ప్రకారం తగిన చర్యలు తీసుకుంటారు.టోల్ వసూలుకు ఫాస్టాగ్ విధానంగా కొనసాగుతుందని, సరైన ఫాస్టాగ్ లేకుండా వచ్చే వాహనాలకు ప్రత్యామ్నాయ చెల్లింపు మార్గంగా ఉపయోగపడుతుంది."భారత రహదారి రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖటోల్ వ్యవస్థను పూర్తిగా డిజిటల్‌గా మార్చే ఉద్దేశంతో ఈ నిర్ణయంకాగా, టోల్ చెల్లింపుల్లో చాలా వరకు ఫాస్టాగ్ ద్వారానే జరుగుతున్నాయి. దాదాపు 98 శాతం లావాదేవీలు ఈ రూపంలోనే జరుగుతున్నాయని గణాంకాలు చెబుతున్నాయి. అయితే, ఫాస్టాగ్ లేకపోవడం, పనిచేయకపోవడం వంటి కారణాలతో టోల్‌ప్లాజా వద్దకు వచ్చే వాహనాల నుంచి చెల్లించాల్సిన మొత్తాన్నికి రెండింతల ఫీజును తీసుకుంటున్నారు. అదే యూపీఐ ఆప్షన్ ఎంచుకుంటే 1.25 రెట్లు ఫీజు మాత్రమే వసూలు చేస్తున్నారు. జాతీయ రహదారుల టోల్ వ్యవస్థను పూర్తిగా డిజిటల్‌గా మార్చే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎన్‌హెచ్‌ఏఐ చెప్పింది.దేశవ్యాప్తంగా 1,150 టోల్‌ప్లాజాలుఇటీవల ఫాస్టాగ్ వార్షిక పాస్ విధానంలో 50 లక్షల మంది చందాదారులు నమోదు చేసుకుని అరుదైన మైలురాయిని కూడా అధిగమించింది. ఈ పాస్ ద్వారా వినియోగదారులు సంవత్సరానికి రూ.3,000 చెల్లించి, గరిష్ఠంగా 200 సార్లు టోల్ ప్లాజాలను దాటి ప్రయాణించవచ్చు. ఆగస్టు 15న ప్రారంభమైనప్పటి నుంచి ఈ పాస్‌ల ద్వారా మొత్తం 26.55 కోట్ల లావాదేవీలు జరిగాయని పేర్కొంది. దేశవ్యాప్తంగా వివిధ జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలపై 1,150 టోల్‌ప్లాజాలు ఉన్నాయి .టోల్‌ప్లాజాల వద్ద వేచి చూడకుండా త్వరలో కొత్త ఎలక్ట్రానిక్ సిస్టమ్‌అంతకుముందు కొద్ది రోజుల క్రితం జాతీయ రహదారులపై ఉన్న టోల్‌ప్లాజాల వద్ద ఇకపై ఒక్క క్షణం కూడా ఆగాల్సిన అవసరం లేకుండా కొత్త వ్యవస్థను తీసుకువస్తున్నట్లు కేంద్రం ప్రకటించింది. ప్రస్తుతం ఉన్న విధానం తెర మరుగై ఏడాదిలోగా దేశవ్యాప్తంగా అమల్లోకి రానుందని వెల్లడించారు. ప్రస్తుతం 10 ప్రాంతాల్లో ఈ తరహా విధానాన్ని అమలుచేస్తున్నామని చెప్పారు. దాన్ని దేశవ్యాప్తంగా విస్తరించనున్నామని లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయంలో తెలిపారు. టోల్ ప్లాజాల వద్ద ఫీజు వసూలు చేసేందుకు నేషనల్ ఎలక్ట్రానిక్ టోల్ కలెక్షన్ కార్యక్రమాన్ని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా తీసుకొచ్చింది. ఇది కూడా ఫాస్టాగ్ ద్వారానే పని చేస్తుంది. అయితే, టోల్‌ప్లాజా మీదుగా వెళ్లినప్పుడు వాహనం ఆపాల్సిన అవసరం లేకుండానే యూజర్ బ్యాంక్ అకౌంట్ నుంచి ఫీజు ఆటోమేటిక్‌గా కట్ అవుతుంది.

# బెంగళూరుకు బిగ్ షాక్

### మంగళూరుకు వెళ్లిపోతున్న ఐటీ కంపెనీలు

### భారత సిలికాన్ బీచ్‌గా కొత్త నేమ్



12 సంవత్సరాలుగా సింగపూర్‌లో పనిచేస్తున్న ఇంజనీర్ ఆదిత్య జీవితంలో ఒక కీలక మలుపు చోటు చేసుకుంది. అమెరికాకు చెందిన ప్రముఖ ఆడియో సొల్యూషన్స్ సంస్థ దీశీంవ ాతీశీటవంంఅశీఖశ్రీ అతనికి ఒక ప్రత్యేక బాధ్యతను అప్పగించింది. అదేంటంటే పూర్తిగా కొత్త ఉత్పత్తి శ్రేణిని మొదటి నుంచి నిర్మించడమే కాకుండా.. అమెరికా వెలుపల కంపెనీ స్థాపించే తొలి యూనిట్‌కు సరైన స్థలాన్ని ఎంపిక చేయడం. మొదట కంపెనీ సూచన ఏంటంటే బెంగళూరు. కానీ ఆదిత్యకు అక్కడి వాస్తవ పరిస్థితులు బాగా తెలుసు. తీవ్రమైన ట్రాఫిక్, పెరుగుతున్న జీవన వ్యయం, అధిక ఉద్యోగ మార్పిడులు వంటి అంశాలు దీర్ఘకాలిక పనులకు అడ్డంకిగా మారతాయని ఆయన నమ్మారు. అందుకే ఆయన ఒక భిన్నమైన ప్రతిపాదన చేశారు. కర్ణాటక తీరంలోని మంగళూరు గురించి చెప్పాడు. సాంప్రదాయంగా మంగళూరు ఆర్థిక వ్యవస్థ శుద్ధి కర్మాగారాలు, షిప్పింగ్, మత్స్యకార రంగం, వ్యవసాయం చుట్టూ తిరిగింది. కానీ ఉడిపి జిల్లా కర్కల సమీపంలో పెరిగిన ఆదిత్యకు ఈ ప్రాంతంలోని ప్రతిభ, జీవన నాణ్యత, ప్రశాంత వాతావరణం మీద పూర్తి నమ్మకం ఉంది. తక్కువ ట్రాఫిక్, శుభ్రమైన గాలి, సమతుల్య జీవితం.. ఇవన్నీ ఐటీ నిపుణులను ఆకర్షించే అంశాలుగా నమ్మాడు. నవంబర్ 2024లో లింక్డ్‌ఇన్ ద్వారా నియామక ప్రక్రియ ప్రారంభమైంది. మంగళూరు, ఉడిపి ప్రాంతానికి చెందిన కానీ ఇతర నగరాల్లో పనిచేస్తున్న నిపుణులను ప్రత్యేకంగా సంప్రదించారు. ఫలితం ఆశ్చర్యకరంగా వచ్చింది. కుటుంబానికి దగ్గరగా ఉండే అవకాశం, కొత్త ఉత్పత్తిని మొదటి నుంచీ నిర్మించే ఛాన్స్, మంచి జీతం ఇలా ఇవన్నీ వారిని ఆకర్షించాయి. బెంగళూరు ట్రాఫిక్ కష్టాలకు చెక్..ఇకపై నిమిషాల్లోనే ఆఫీసుకు.. రూ. 120 కోట్లతో బెల్లందూర్ మెట్రోస్టేషన్ రెడీ.. జనవరి 2025 నాటికి ఆదిత్య భారత్‌లో బోస్ ప్రొఫెషనల్ రెండో ఉద్యోగిని నియమించారు. అదే సంవత్సరం చివరికి బృందం 50 మందికి చేరింది. నేడు ఈ బృందం మంగళూరులోని కొట్టారా చౌక్‌లో ఉన్న ఆధునిక కార్యాలయం నుంచి అమెరికా మార్కెట్ కోసం కీలక సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేస్తోంది. బోస్ ప్రొఫెషనల్ ఒక్కటే కాదు. ఇటీవలి సంవత్సరాల్లో మంగళూరు, ఉడిపి, దక్షిణ కన్నడ జిల్లాల్లో వందలాది ఐటీ కంపెనీలు కార్యకలాపాలు ప్రారంభించాయి. గత రెండు సంవత్సరాల్లో ఈ ప్రాంత ఐటీ ఆదాయం రూ.3,200 కోట్ల నుంచి దాదాపు రూ.5,000 కోట్లకు చేరుకుంది. ఇందులో సుమారు రూ.3,000 కోట్లు నిపుణుల జీతాల రూపంలో స్థానిక ఆర్థిక వ్యవస్థలోకి ప్రవహిస్తున్నాయి. 2034 నాటికి ఈ ప్రాంత ఐటీ ఆదాయాన్ని రూ.45,000 కోట్లకు చేర్చాలని, ఉద్యోగులను 50 వేల నుంచి 2 లక్షలకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. గత మూడేళ్లలోనే దాదాపు 100 మిలియన్ డాలర్ల విలువైన గ్లోబల్ కొనుగోళ్లు జరగడం ఇక్కడి టెక్నాలజీ నాణ్యతకు నిదర్శనం. తక్కువ ఆఫీస్ అద్దెలు, చౌకైన గృహాలు, సరసమైన విద్య, 15 నిమిషాల నగరం'గా పేరొందిన ప్రయాణ సౌలభ్యం.. ఇవన్నీ మంగళూరును ప్రత్యామ్నాయంగా నిలబెడుతున్నాయి. బెంగళూరులో జరిగిన తప్పులను పునరావృతం కాకుండా నియంత్రిత అభివృద్ధి జరగాలని స్థానిక వ్యవస్థాపకులు కోరుతున్నారు. ఒకప్పుడు ఉద్యోగాల కోసం బయటకు వెళ్లిన యువత ఇప్పుడు తిరిగి స్వస్థలానికి వస్తోంది. ఈ మార్పే మంగళూరు-ఉడిపి తీరాన్ని నిజమైన భారతదేశ సిలికాన్ బీచ్ గా మార్చుతోంది. డిస్క్లైమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.


# క్రెడిట్ కార్డ్ వాడుతున్నారా

### ఏప్రిల్ 1 లోపు ఈ మార్పులు తెలుసుకోకపోతే ఇబ్బందే




ఈ రోజుల్లో టీ కప్పు దగ్గర నుండి విమాన టిక్కెట్ల వరకు ప్రతిదానికీ క్రెడిట్ కార్డు వాడటం సర్వసాధారణం అయిపోయింది. అయితే ఈ వాడకం పెరిగే కొద్దీ పన్ను అధికారులు కూడా తమ నిఘాను పెంచుతున్నారు. ప్రతిపాదిత ఆదాయపు పన్ను నిబంధనలు 2026 ప్రకారం ఏప్రిల్ 1 నుండి క్రెడిట్ కార్డ్ వినియోగదారులపై కొన్ని కొత్త నిబంధనలు అమలు కానున్నాయి. ఈ మార్పులు మీ ఆర్థిక లావాదేవీలపై ఎలాంటి ప్రభావం చూపుతాయో ఇప్పుడు వివరంగా తెలుసుకుందాం. పాన్ కార్డ్ తప్పనిసరి ఇకపై కొత్తగా క్రెడిట్ కార్డ్ కోసం దరఖాస్తు చేసుకోవాలంటే 'పాన్' కార్డ్ తప్పనిసరి. కొత్త నిబంధనల ప్రకారం, పాన్ వివరాలు ఇవ్వకుండా బ్యాంకులు ఏ అప్లికేషన్‌ను ప్రాసెస్ చేయవు. క్రెడిట్ కార్డ్ ఖర్చులను పన్ను వ్యవస్థతో అనుసంధానించడానికి , నకిలీ ఖాతాలను అరికట్టడానికి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. భారీ లావాదేవీలపై ఐటీ శాఖ నిఘా ఒక ఆర్థిక సంవత్సరంలో మీరు క్రెడిట్ కార్డ్ ద్వారా రూ. 10 లక్షలు లేదా అంతకంటే ఎక్కువ నగదు రహిత చెల్లింపులు చేస్తే.. ఆ వివరాలను బ్యాంకులు నేరుగా ఆదాయపు పన్ను శాఖకు నివేదిస్తాయి. అలాగే రూ. 1 లక్ష లేదా అంతకంటే ఎక్కువ నగదు రూపంలో క్రెడిట్ కార్డ్ బిల్లు చెల్లిస్తే కూడా ఐటీ శాఖకు సమాచారం వెళ్తుంది. మీ ఆదాయానికి, ఖర్చులకు పొంతన లేకపోతే నోటీసులు వచ్చే అవకాశం ఉంది. క్రెడిట్ కార్డ్ తో ఆదాయపు పన్ను చెల్లింపు పన్ను చెల్లింపుదారులకు ఇది ఒక శుభవార్త. త్వరలో మీరు మీ ఆదాయపు పన్నును కూడా క్రెడిట్ కార్డు ద్వారా చెల్లించే అవకాశం కలగనుంది. ప్రస్తుతం నెట్ బ్యాంకింగ్ లేదా డెబిట్ కార్డులకే పరిమితమైన ఈ సౌకర్యం క్రెడిట్ కార్డ్ వినియోగదారులకు మరింత వెసులుబాటును ఇస్తుంది. అయితే, దీనిపై పడే వడ్డీ రేట్లు , ప్రాసెసింగ్ ఫీజులను గమనించుకోవడం ముఖ్యం. కంపెనీ క్రెడిట్ కార్డుల వినియోగం ఉద్యోగులకు కంపెనీలు ఇచ్చే క్రెడిట్ కార్డుల విషయంలో కూడా నిబంధనలు కఠినతరం కానున్నాయి. ఆ కార్డ్ ద్వారా చేసే ఖర్చులను వ్యక్తిగత ప్రయోజనాలుగా పరిగణించి పన్ను విధించే అవకాశం ఉంది. అయితే, ఆ ఖర్చు కేవలం కంపెనీ పనుల కోసమే అని సరైన ఆధారాలు , సర్టిఫికేషన్ చూపిస్తే పన్ను మినహాయింపు పొందవచ్చు. అడ్రస్ ప్రూఫ్ గా క్రెడిట్ కార్డ్ స్టేట్‌మెంట్ పాన్ కార్డ్ దరఖాస్తు చేసుకునే వారికి ఇది సులభతరమైన మార్పు. గత మూడు నెలల్లో జారీ చేసిన క్రెడిట్ కార్డ్ స్టేట్‌మెంట్‌ను ఇకపై చెల్లుబాటు అయ్యే చిరునామా ధృవీకరణ పత్రం గా అంగీకరిస్తారు. దీనివల్ల డాక్యుమెంటేషన్ ప్రక్రియ మరింత సులభం అవుతుంది. ఈ నిబంధనలు ప్రస్తుతానికి డ్రాఫ్ట్ రూపంలో ఉన్నాయి. ప్రజల అభిప్రాయాల తర్వాత ఏప్రిల్ 1 నుండి అధికారికంగా అమల్లోకి రానున్నాయి. కాబట్టి క్రెడిట్ కార్డ్ వాడేటప్పుడు కాస్త జాగ్రత్తగా నిబంధనలకు లోబడి వ్యవహరించడం ఉత్తమం.

# క్రేజీ కాంబోలో రాబోతున్న ‘ఉడ్తా తీర్’





బాలీవుడ్ వెండితెరపై ఓ సరికొత్త కలయిక ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతోంది. విలక్షణ నటుడు ఆయుష్మాన్ ఖురానా,యంగ్ సెన్సేషన్ సారా అలీఖాన్ జంటగా నటిస్తున్న క్రేజీ ప్రాజెక్ట్ ‘ఉడ్తా తీర్’. ఈ సినిమాకు సంబంధించిన విడుదల తేదీని మేకర్స్ తాజాగా అధికారికంగా ప్రకటించారు. సాధారణంగా గూఢచారి సినిమాలు అంటే యాక్షన్, సీరియస్ డ్రామాతో నిండి ఉంటాయి. కానీ, ‘ఉడ్తా తీర్’ ఆ గూఢచారి ప్రపంచాన్ని పూర్తిగా వినోదాత్మకంగా, తలకిందులు చేసేలా చూపిస్తూ ఒక స్పై యాక్షన్ కామెడీగా రాబోతోంది. ఆయుష్మాన్ ఖురానా తనదైన శైలిలో చేసే కామెడీ అడ్వెంచర్లు ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణ కానున్నాయట. ప్రముఖ రచయిత ఆకాష్ ఎ కౌశిక్ ఈ చిత్రం ద్వారా దర్శకుడిగా ఇండస్ట్రీకి పరిచయం కాబోతున్నారు. విభిన్నమైన కథాంశంతో ఆయన ఈ కథను సిద్ధం చేశారని సమాచారం. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందించాలనే లక్ష్యంతో స్టార్ ప్రొడ్యూసర్ కరణ్ జోహార్, అదర్ పూనావాలా, గునీత్ మోంగా కపూర్ వంటి హేమాహేమీలు ఈ ప్రాజెక్ట్ కోసం చేతులు కలిపారు. వినోదానికి ప్రాధాన్యతనిస్తూనే, ఒక సాహసోపేతమైన ప్రయాణంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. షూటింగ్ పనులను శరవేగంగా జరుపుకుంటున్న ఈ సినిమాను సెప్టెంబర్ 11, 2026న థియేటర్లలో విడుదల కాబోతున్నట్లు మూవీ మేకర్స్ అఫీషియల్‌గా అనౌన్స్ చేశారు. ఆయుష్మాన్ మార్క్ కామెడీకి సారా అలీఖాన్ గ్లామర్ తోడైతే బాక్సాఫీస్ వద్ద వినోదాల పంట పండటం ఖాయమని మేకర్స్ భావిస్తున్నారు.




# నటసింహంతో డింపుల్ సెల్ఫీ..

## సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతున్న ఫొటోలు

నటసింహం నందమూరి బాలకృష్ణ, యువ నటి డింపుల్ హయాతి కలిసి చేసిన సందడి ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. గుంటూరులో జరిగిన ఒక ప్రైవేట్ కార్యక్రమం కోసం వీరిద్దరూ కలిసి ప్రయాణించడమే కాకుండా, అక్కడ దిగిన ఫొటోలు అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. గుంటూరులోని లక్ష్మీపురంలో ఒక ప్రముఖ జ్యువెలరీ షోరూమ్ ప్రారంభోత్సవానికి బాలకృష్ణ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయనతో పాటు డింపుల్ హయాతి కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వీరిద్దరూ హైదరాబాద్ నుంచి గుంటూరుకు ఒకే ప్రత్యేక హెలికాప్టర్‌లో ప్రయాణించారు. ఈ ప్రయాణ సమయంలో డింపుల్ హయాతి తన ఫోన్‌లో సెల్ఫీ తీయగా.. పక్కనే ఉన్న బాలయ్య చిన్న పిల్లాడిలా రకరకాల క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్ ఇస్తూ అల్లరి చేశారు. సాధారణంగా గంభీరంగా కనిపించే బాలయ్య, ఇంత సరదాగా ఉండటాన్ని చూసి నెటిజన్లు ఫిదా అవుతున్నారు. ప్రస్తుతం బాలయ్య గోపీచంద్ మలినేని దర్శకత్వంలో ‘చీదీఖ 111’ (వర్కింగ్ టైటిల్) చిత్రంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలో డింపుల్ హయాతి రెండో హీరోయిన్‌గా నటిస్తోందని ఇప్పటికే వార్తలు వస్తున్నాయి. తాజాగా వీరిద్దరూ కలిసి ఒకే ఈవెంట్‌లో కనిపించడంతో, ఈ రూమర్లు నిజమేనని ఫ్యాన్స్ భావిస్తున్నారు. అయితే, దీనిపై చిత్ర యూనిట్ నుండి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.


# ‘లెనిన్’ పది రోజుల్లో మొత్తం క్లోజ్

అఖిల్ అక్కినేని ప్రస్తుతం ‘లెనిన్’ చిత్రంలో హీరోగా నటిస్తున్నాడు. భాగ్యశ్రీ బోర్సే ఇందులో హీరోయిన్‌గా కనిపించనుండగా, మురళీ కిషోర్ అబ్బూరు ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నాడు. జూన్ 26న ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ చాలా రోజుల క్రితమే ప్రకటించారు. ఇక తాజాగా ఈ మూవీ షూటింగ్‌కు సంబంధించిన ఒక అప్డేట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం, ఈ చిత్రానికి సంబంధించిన మరో పది రోజుల షూటింగ్ మాత్రమే పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. అందులో మూడు రోజులు టాకీ పార్ట్ కోసం, మిగతా రోజుల్లో రెండు పాటలను చిత్రీకరించబోతున్నట్లు సమాచారం. ఇక ప్రస్తుతం డబ్బింగ్ పనులు కూడా జరుగుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుత ప్రణాళికలను బట్టి చూస్తే, ఈ మూవీకి సంబంధించిన షూటింగ్ మరియు పోస్ట్ ప్రొడక్షన్ పనులు మే నెలలో పూర్తయ్యే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. దాంతో ఈ మూవీ బృందం ఈ చిత్రాన్ని చెప్పిన సమయానికి కచ్చితంగా ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. నాగార్జున అక్కినేని, సూర్యదేవర నాగవంశీ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఎస్ ఎస్ తమన్ సంగీతం అందిస్తున్నాడు.



# ఎన్టీఆర్ ఫ్యాన్స్‌కి డబుల్ ట్రీట్.. ఆ రోజు కోసం ఎదురు చూపులు..

టాలీవుడ్ మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ వరుసగా భారీ ప్రాజెక్టులతో తన ఫ్యాన్స్‌కు ఫుల్ ట్రీట్ ఇవ్వడానికి సిద్ధమవుతున్నాడు. ఇప్పటికే స్టార్ దర్శకుడు ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ‘డ్రాగన్’ అనే యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో నటిస్తున్న తారక్, తన తదుపరి చిత్రాన్ని మాటల మాంత్రికుడు శ్రీనివాస్‌తో చేయనున్న విషయం తెలిసిందే. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన అరవింద సమేత వీర రాఘవ బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సాధించడంతో, ఈ కొత్త ప్రాజెక్ట్‌పై అంచనాలు మరింతగా పెరిగాయి. తాజా సమాచారం ప్రకారం, ఈ చిత్రం ఆధ్యాత్మికత, కమర్షియల్ ఎలిమెంట్స్ మేళవింపుతో కూడిన విభిన్న కథాంశంతో తెరకెక్కనుంది. ముఖ్యంగా కుమారస్వామి నేపథ్యం ఉండబోతుందని, విజువల్ వండర్‌గా మలచడానికి త్రివిక్రమ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇక ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన మరో ఆసక్తికర అంశం టైటిల్. సోషల్ మీడియాలో వినిపిస్తున్న ప్రచారం ప్రకారం, ఈ చిత్రానికి ‘గాడ్ ఆఫ్ వార్’ అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను పరిశీలిస్తున్నారట. టైటిల్‌ను బట్టి చూస్తే, ఈసారి ఎన్టీఆర్‌ను మరింత ఉగ్రరూపంలో, శక్తివంతమైన పాత్రలో చూపించే అవకాశం ఉందని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇదిలా ఉంటే, ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా ఈ రెండు సినిమాలకు సంబంధించిన కీలక అప్‌డేట్స్ రావొచ్చని ఫిలింనగర్ వర్గాల్లో గట్టిగా వినిపిస్తోంది. ఒకే రోజు త్రివిక్రమ్ ప్రాజెక్ట్ అధికారిక ప్రకటనతో పాటు, ప్రశాంత్ నీల్ దర్శకత్వంలోని ‘డ్రాగన్’ నుంచి కూడా అప్డేట్ వచ్చే అవకాశం ఉందట. ఈ డబుల్ అనౌన్స్‌మెంట్స్ ఎన్టీఆర్ అభిమానులకు నిజమైన పండుగలా మారనుండడం ఖాయం. ఒకవైపు భారీ యాక్షన్ డ్రామా, మరోవైపు ఆధ్యాత్మిక బ్యాక్‌డ్రాప్‌లో విజువల్ గ్రాండియర్ ఇలా రెండు విభిన్న జానర్లలో సినిమాలు చేయడం ద్వారా తారక్ తన గ్లోబల్ ఇమేజ్‌ను మరింత బలోపేతం చేస్తున్నాడు. మొత్తంగా ఎన్టీఆర్ తన కెరీర్‌లో అత్యంత కీలక దశలో ఉన్నాడని చెప్పాలి. వరుసగా భారీ ప్రాజెక్టులు, స్టార్ డైరెక్టర్లతో కాంబినేషన్లు, విభిన్న కథలు అన్నీ కలిసి టాలీవుడ్‌లో మరో సెన్సేషన్ సృష్టించడానికి సిద్ధంగా ఉన్నాయి. ఇక ఈ సినిమాలు ప్రేక్షకులను ఎలా అలరిస్తాయో చూడాలి.




# ఆ హీరోతో నటించానని ఊరంతా చెప్పాను..



తన అద్భుతమైన నటనతో ఎంతో మంది అభిమానులను సంపాదించుకున్న సత్యదేవ్ తాజాగా ‘రావు బహదూర్’ చిత్రంలో హీరోగా నటిస్తున్నాడు. ఈ సినిమా ప్రమోషన్ కార్యక్రమాల నిమిత్తం ఇటీవల మీడియాతో ఇంటరాక్ట్ అయిన ఆయన తన కెరీర్ ప్రారంభ దశలో జరిగిన ఓ ఆసక్తికర సంఘటనను గుర్తుచేసుకున్నారు. సత్యదేవ్ మాట్లాడుతూ? “నేను నటుడిగా కెరీర్ ప్రారంభించిన కొత్తలో మహేష్ బాబు హీరోగా నటించిన ఓ సినిమాలో చిన్న పాత్ర చేశాను. అది చిన్న పాత్ర అయినా కూడా మహేష్ బాబు గారి భుజం మీద చేయి వేసుకొని ఒక చిన్న డైలాగ్ కూడా చెప్పాను. అంత పెద్ద నటుడితో కలిసి నటించడం చాలా ఆనందంగా అనిపించింది. ఆ ఆనందాన్ని ఆపుకోలేక ఊరంతా తిరిగి మహేష్‌తో సినిమా చేశానని అందరికీ చెప్పుకున్నాను. ఇక సినిమా విడుదలైన తర్వాత థియేటర్‌కు వెళ్లి చూస్తే అందులో నా పాత్ర కనిపించలేదు. ఎడిటింగ్‌లో నా సన్నివేశాలను తీసేశారని తెలిసి కాస్త బాధపడ్డాను” అని సత్యదేవ్ వెల్లడించారు. ఇక ప్రస్తుతం సత్యదేవ్ నటిస్తున్న ‘రావు బహదూర్’ చిత్రంపై ప్రేక్షకుల్లో మంచి అంచనాలు నెలకొన్నాయి. వెంకటేష్ మహా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని ఉఓః ఎంటర్‌టైన్‌మెంట్, ం+ూ మూవీస్, శ్రీచక్ర ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. మలయాళ చిత్రాలతో గుర్తింపు సంపాదించుకున్న దీపా థామస్ ఈ సినిమాలో కథానాయికగా నటిస్తోంది. ఈ మూవీ ద్వారా ఆమె తెలుగు తెరకు పరిచయం కానుంది.

# ‘తిమ్మరాజుపల్లి టీవీ’ విషయంలో కిరణ్ అబ్బవరం ఎందుకు ఆ తప్పు చేసాడు

అంతా కొత్తవాళ్లతో నటుడు కిరణ్ అబ్బవరం ‘తిమ్మరాజుపల్లి టీవీ’ అనే సినిమాను నిర్మించిన విషయం మనందరికీ తెలిసిందే. ఇందులో సాయి తేజ హీరోగా నటించగా, వేద జలంధర్ హీరోయిన్‌గా నటించింది. ఈ చిత్రం నుంచి మేకర్స్ విడుదల చేసిన ప్రచార చిత్రాలు అన్నీ అద్భుతంగా ఉండడంతో ప్రస్తుతం ఈ మూవీపై భారీ స్థాయిలో అంచనాలు నెలకొన్నాయి. గత కొంతకాలంగా ఏదైనా సినిమాపై మంచి అంచనాలు ఏర్పడితే, ఆ మూవీకి సంబంధించిన ప్రీమియర్ షోలను చిత్ర విడుదలకు ముందు రోజు పెద్ద ఎత్తున ప్రదర్శించడం ఆనవాయితీగా మారింది. దాంతో ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొనడంతో, ఈ మూవీకి సంబంధించిన ప్రీమియర్ షోలను కూడా ఈరోజు సాయంత్రం నుంచి పెద్ద ఎత్తున ప్రదర్శిస్తారని సినీ విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. కానీ ఇప్పటివరకు అందుకు సంబంధించిన అధికారిక ప్రకటన రాకపోవడంతో, ఈ మూవీకి సంబంధించిన ప్రీమియర్ షోలు లేనట్టేనని స్పష్టమైంది. దీనిపై కొంతమంది తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. కిరణ్ అబ్బవరం ఈ సినిమాకు సంబంధించిన ప్రమోషన్లను అద్భుతమైన రీతిలో నిర్వహించి సినిమాను జనాల వరకు తీసుకువెళ్లాడు. ఒకవేళ నిజంగానే సినిమాలో మంచి కంటెంట్ ఉండి ఉంటే, ఈ చిత్రానికి సంబంధించిన ప్రీమియర్ షోలను ప్రదర్శించాల్సిందని, దాని ద్వారా మంచి టాక్ వస్తే అదిరిపోయే రేంజ్ ఓపెనింగ్స్ వచ్చేవని కొంతమంది అభిప్రాయపడుతున్నారు. ఏదేమైనా, రేపు ఈ చిత్రానికి గనుక మంచి టాక్ వస్తే, ఈ మూవీ భారీ కలెక్షన్లను అందుకునే అవకాశాలు చాలావరకు ఉన్నాయని సినీ వర్గాలు భావిస్తున్నాయి.



PRINTED, PUBLISHED AND OWNER BY B.JAVEED BASHA Printed at M/S Aliya Publication, #7/235 - A Maniyar Street,Near Main Bazar, Tadipatri - 515411,Anantapur District Andra Pradesh, Published at M/S Aliya Publication, #7/235-A Maniyar Street,Near Main Bazar Tadipatri - 515411 ,Anantapur District,Andra Pradesh - 515411 EDITOR B.JAVEED BASHA RNI. NO : APTEL/2022/90211, Cell : 83339 79192 , 83339 75354 , E-mail : akshratimes@gmail.com